ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

బుధవారం 18 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 152 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ఐపీఎల్‌కు ధోనీ వీడ్కోలు

సీఎస్కేకు ఇక మెంటార్

12





విదేశీ విద్యార్థులకు భారీ ఊరట..

ట్రంప్ సర్కారు ప్రతిపాదనను కొట్టివేసిన అమెరికా కోర్టు!

2



సమ్మక్క సాగర్‌కు గ్రీన్ సిగ్నల్

ఎన్‌వోసీ త్వరగానే ఇస్తాం.. అప్పటిదాకా ఆగక్కర్లేదు

సమ్మక్కసాగర్‌పై ఛత్తీస్‌గఢ్ సీఎం సాయ్ సానుకూల స్పందన

ఎల్‌నినో కష్టాల్లో ఉన్నాం... వెంటనే ఎన్‌వోసీ ఇవ్వాలన్న రేవంత్

గరిష్ఠ వరద ముంపునకూ పరిహారమిస్తామని స్పష్టీకరణ

ముంపు అధ్యయనానికి రూ.9.88 కోట్లు చెల్లించాం: రేవంత్

సమ్మక్క సాగర్ బ్యారేజీ విషయంలో తెలంగాణకు ఉపశమనం లభించింది. ఎన్‌వోసీని త్వరగానే ఇస్తామని, అది వచ్చేదాకా ఆగాల్సిన అవసరం లేదని, బ్యారేజీలో నీళ్లు నింపుకోవడం మొదలుపెట్టవచ్చని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెప్పినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

రాయ్ పూర్, నవంబర్ 17 (సింగిడి)

2

తెలంగాణ పట్ల సోనియాకు ప్రేమ లేదు

అందుకే సోనియా ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన తేలేదు



కాంగ్రెస్ నాయకులు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలి

ప్రత్యేక రాష్ట్రం సోనియా దయాభిక్ష కాదు.. ఇక్కడి ప్రజల పోరాట ఫలితం

ఆమె ఆత్మల, గుండెల్లు కూడా తెలంగాణ లేదు: కేటీఆర్

సోనియా గాంధీ ఆత్మకథపై కేటీఆర్ సంచలన కామెంట్స్

2

సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉంటే.. ఆమె ఆత్మకథ లో తెలంగాణ ప్రస్తావన ఎందుకు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. సోనియమ్మే తెలంగాణ ఇచ్చిందని చెప్పుకునే కాంగ్రెస్ నేతలు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఎవరి దయాభిక్ష కాదని.. ఇక్కడి ప్రజల పోరాట ఫలితమని నొక్కి చెప్పారు. రాజకీయ అవసరాల కోసమే రాష్ట్రమిచ్చిన సోనియా గుండెల్లో, ఆత్మల కూడా 'తెలంగాణ' లేదని తేల్చి చెప్పారు.

-హైదరాబాద్, నవంబర్ 17 (సింగిడి)

కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా

ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల జీవిత బీమా

రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా అందించేలా ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వివిధ శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. గురువారం సిద్ధిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఇందిరమ్మ బీమా దరఖాస్తును విడుదల చేయడంతోపాటు ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించనున్నారు.

-హైదరాబాద్, నవంబర్ 17 (సింగిడి)

ప్రస్తుతం వివిధ శాఖల్లో అమలవుతున్న ప్రభుత్వ బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా అందాలన్నారు. గురువారంసిద్దిపేటలో జరగనున్న బహిరంగ సభలో ఇందిరమ్మ బీమా దరఖాస్తును సీఎం విడుదల చేయనున్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇందిర్మ బీమా, ఇందిరమ్మ చీరల పంపిణీపై అధికారులతో తన నివాసంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు

అర్హులైన ప్రతి మహిళకూ ఇందిరమ్మ చీర

నేడు సిద్దిపేట సభలో బీమా దరఖాస్తు విడుదల చేయనున్న సీఎం



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు బీమా పథకం అమలయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ బీమా పథకం కింద ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల జీవిత బీమా లభిస్తుందని, దీంతో ఉపాధి హామీ కూలీలతోపాటు లక్షలాది మంది పేదలు లబ్ధి పొందుతారని అన్నారు. ప్రస్తుతం అమలవుతున్న వివిధ రకాల బీమా పథకాల కింద రూ.2 లక్షల జీవిత బీమా, రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు అధికారులు తెలపగా.. రూ.2 లక్షలు ఉన్న జీవిత బీమాను ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకువచ్చి రూ.5 లక్షలకు పెంచాలని సీఎం సూచించారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి బీమా భద్రత అందుకుంటున్న వారిలో ఏ ఒక్కరినీ తొలగించవద్దని తేల్చి చెప్పారు.

2

మావోల భారీ కుట్ర భగ్నం

కర్రెగుట్టల్లో వాటర్ ట్యాంకుల్లో దాచిన 280 గ్రెనేడ్ లాంచర్ షెల్స్ స్వాధీనం



తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. నవంబర్ 16న ఛత్తీస్‌గఢ్‌లోని పూజారి కాంకేర్ సమీప కర్రెగుట్టల ప్రాంతంలో భద్రాద్రి కొత్తగూడెం పోలీసులు చేపట్టిన ప్రత్యేక కూంబింగ్ ఆపరేషన్‌లో భారీ ఆయుధ డంప్‌లు బయటపడ్డాయి. దట్టమైన అడవిలో 3వేర్వేరు చోట్ల మావోయిస్టులు అత్యంత రహస్యంగా దాచిపెట్టిన 280 బారెల్ గ్రెనేడ్ లాంచర్ షెల్స్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పక్కా సమాచారంతో కర్రెగుట్టల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టిన పోలీసులకు అటవీ ప్రాంతంలో పాతిపెట్టిన సిన్‌టెక్స్ వాటర్ ట్యాంక్ డ్రమ్స్ కనిపించాయి. వాటిని వెలికితీసి చూడగా, లోపల భారీ ఎత్తున మందుగుండు సామగ్రి బయటపడింది.

కొత్తగూడెం (సింగిడి)

2

క్వాడ్ సదస్సులో ప్రధాని మోదీపై

ట్రంప్ ప్రశంసలు

85 మిలియన్ డాలర్లతో ఏఐ యాక్సిలరేటర్..

ఉమ్మడి సైనిక విన్యాసాలకు నాలుగు దేశాల సిద్ధం



భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మోదీని 'టఫ్ మ్యాన్' (గట్టి మనిషి)గా అభివర్ణించారు. రెండేళ్ల విరామం తర్వాత ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన క్వాడ్ దేశాల సదస్సులో ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతలు పాల్గొన్న ఈ సమావేశంలో క్వాడ్ భాగస్వామ్యాన్ని ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన కూటమిగా ట్రంప్ పేర్కొన్నారు. గతంలోనూ మోదీని 'టఫ్ నెగోషియేటర్'గా, తనకంటే మెరుగైన నాయకుడిగా అభివర్ణించిన విషయం తెలిసిందే.

-న్యూఢిల్లీ, నవంబర్ 17 (సింగిడి)

2

ఏరోస్పేస్ హబ్‌గా

హైదరాబాద్!

ప్రెసిషన్ ఇంజినీరింగ్‌కు ప్రపంచస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దుతాం

కొత్తూరులో టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



తెలంగాణను అధునాతన తయారీ, ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో ప్రపంచస్థాయి పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రెసిషన్ ఇంజినీరింగ్‌కు హైదరాబాద్‌ను కీలక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులో జేఈహెచ్ ఏరోస్పేస్ ఏర్పాటు చేసిన టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు.

-హైదరాబాద్, నవంబర్ 17 (సింగిడి)

2

పెళ్లి పిలుపుపై రాజకీయాల నిందలా?



2

సాక్షి కథనంపై వైఎస్ షర్మిల ఆగ్రహం

గతంలో వైఎస్సార్ సైతం చంద్ర బాబును ఆహ్వానించారని వెల్లడి

వైసీపీ తీరుపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు

పత్రికా కథనానికి జగన్ సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్

రూ.7 వేల కోట్లకు పైగా తుపాను నష్టం..

తక్షణ ఆర్థిక సాయం అందించండి

నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ



వరుస తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. దిల్లీలో ఆమెతో సమావేశమైన చంద్రబాబు.. రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్నబ్, మురను తుపాన్ల కారణంగా ప్రాథమిక అంచనాల ప్రకారమే రూ.7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు వివరించారు. చేతికందిన పంటలు నీటిపాలయ్యాయని, తీర ప్రాంతాల్లో మౌలిక వసతులు దెబ్బతిన్నాయని తెలిపారు.

-న్యూఢిల్లీ, నవంబర్ 17 (సింగిడి)

2

తీరం వైపు తుపాను పరుగులు!

చెన్నైకి 590 కి.మీ. దూరంలో అక్వాన్

శుక్రవారం మధ్యాహ్నం నెల్లూరు–విశాఖ మధ్య తీరం దాటే అవకాశం

అతి తీవ్ర తుపానుగా బలపడే సూచనలు

కోస్తా జిల్లాలకు భారీ నుంచి అత్యంత భారీ వర్ష సూచన

మత్స్యకారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



అక్వాన్ తుపాను తీరంవైపు దూసుకొస్తోంది. ప్రస్తుతం దక్షిణ, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తుపాను.. గత ఆరు గంటలుగా గంటకు మూడు కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. చెన్నైకి 590 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 650 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 660 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 780 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

విశాఖపట్నం, నవంబర్ 17 (సింగిడి)

కేంబ్రిడ్జ్‌లో రాహుల్

ప్రేమ జ్ఞాపకాలు



గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి తల్లిదండ్రులు కలిసిన రెస్టారెంట్‌కు రాహుల్‌గాంధీ

2

అక్కడి చికెన్ మాత్రం నచ్చలేదు..

సోనియా ఆత్మకథ ఆవిష్కరణలో ఆసక్తికర వ్యాఖ్యలు



మావోల భారీ కుట్ర భగ్నం

స్వాధీనం చేసుకున్న 280 బీజీఎల్ షెల్స్ అన్నీ సీపీఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్ మొదటి కంపెనీకి చెందిన విగా పోలీసులు గుర్తించారు.

2025 ప్రారంభంలోనే భారీ ప్లాన్

ఈ ఆయుధ నిల్వల వెనుక ఉన్న మావోయిస్టుల వ్యూహాన్ని భద్రాద్రి కొత్తగూడెం పోలీసులు వెల్లడించారు. భవిష్యత్తులో భద్రతా బలగాలపై దాడులు లేదా భారీ కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలుగా, 2025 ప్రారంభంలోనే మావోయిస్టులు ఈ మందుగుండు సామగ్రిని దట్టమైన అటవీ ప్రాంతంలో రహస్యంగా దాచిపెట్టారని తెలిపారు. అవసరమైన సమయంలో వీటిని తిరిగి తీసుకెళ్లి ఉపయోగించాలని వారు ప్లాన్ చేసినట్లు పేర్కొన్నారు. సకాలంలో వీటిని గుర్తించి సీజ్ చేయడం వల్ల పెను ముప్పు తప్పినట్లయింది.

ఆయుధాలు వీడి రండి.. అండగా ఉంటాం: పోలీసుల పిలుపు

ఈ సందర్భంగా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులకు భద్రాద్రి కొత్తగూడెం పోలీసులు కీలక పిలుపునిచ్చారు. హింసామార్గాన్ని, ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. లొంగిపోయే మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం ఆకర్షణీయమైన పునరావాస పథకాన్ని అమలు చేస్తోందని గుర్తుచేశారు.

లొంగిపోయిన వారికి తక్షణమే నగదు రివార్డులు అందజేస్తారు.

నివాసం కోసం ఇంటి స్థలాలు, జీవనోపాధి కోసం వ్యవసాయ భూమికి ఆర్థిక సహాయం అందిస్తారు.

స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేకంగా బ్యాంకు రుణాలు మంజూరు చేస్తారు.

ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వ హెల్త్ కార్డులు కూడా జారీ చేస్తారు.

అజ్ఞాత జీవితాన్ని వదిలి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పోలీసులు మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు.

ఏరోస్పేస్ హబ్‌గా హైదరాబాద్!

విమానాలు, విమాన ఇంజిన్ల అసెంబ్లీ, మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన ప్రత్యేక టూల్స్, ఫిక్చర్లు, గేజ్‌లను ఈ కేంద్రంలో తయారు చేయనున్నారు. విడిభాగాల ఉత్పత్తితోపాటు వాటికి అవసరమైన అధునాతన యంత్రాలు, టూలింగ్ సామర్థ్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రంలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తోందని మంత్రి వివరించారు. గతంలో ఇలాంటి ప్రత్యేక పరికరాల కోసం విదేశీ సంస్థలు లేదా కొద్దిమంది సరఫరాదారులపై ఆధారపడాల్సి వచ్చేదని పేర్కొన్నారు.

తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యంగా

తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్, రక్షణ, సాంకేతిక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని శ్రీధర్‌బాబు చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. డిజైన్, ఇంజినీరింగ్, ప్రెసిషన్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ విభాగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

ప్రపంచ సరఫరా వ్యవస్థలో 'మేడ్ ఇన్ తెలంగాణ'

ప్రపంచస్థాయి సంస్థలు, దేశీయ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో స్థానిక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) అనుసంధానించేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. అధునాతన టూలింగ్ కేంద్రాల ఏర్పాటుతో ఏరోస్పేస్ రంగంలో స్థానిక పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌కు మరింత గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్, జేఈహెచ్ ఏరోస్పేస్ సీఈవో విశాల్ సంఘవి, సీవోవో వెంకటేష్ ముద్రగళ్ల తదితరులు పాల్గొన్నారు

కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా

ఇందిరమ్మ బీమా పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలని, బీమా దరఖాస్తులను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని అన్నారు. జిల్లా కలెక్టర్లు దీనిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇక రాష్ట్రంలోని అర్హులైన ప్రతి మహిళకూ ఇందిరమ్మ చీర అందాలని, ఈ మేరకు చీరలను తక్షణమే అన్ని జిల్లాలకు తరలించాలని సీఎం ఆదేశించారు. చీరల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్ష సమావేశంలో సీఎంవో ముఖ్య కార్యదర్శులు శేషాద్రి, శ్రీధర్, సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెళ్లి పిలుపుపై రాజకీయాల నిందలా?

"తండ్రి వయసున్న వ్యక్తి చంద్రబాబుకు శుభలేఖ అందిస్తే చెట్టాపట్టాల్ అంటారా? ఆత్మీయ సంబంధాలు అంటగడతారా? ఇది వావి వరసలు తెలిసి నోరు చేసే పనేనా? సమాజం పట్ల విలువలు ఉన్నోడు రాసే రాతలేనా? మనిషై పుడితే ఆడబిడ్డ మీద వేసేవి ఇలాంటి నిందలా? నాపై నేడు సాక్షి దినపత్రికలో రాసిన కథనం తీవ్ర అభ్యంతరకరం. నాకు, నా కుటుంబానికి జరిగిన వ్యక్తిత్వ హననం. ఇది వైసీపీ అండ్ కో నీచపు బుద్ధికి, మరింత దిగజారుడు సంస్కారానికి, తల్లి, చెల్లి అనే తేడాలేకుండా జంతువు చేష్టలకు పరాకాష్ఠ. జగన్ గారికి, తన సైతాన్ సైన్యానికి ఇంకా పచ్చ రోగం తగ్గలేదు. అద్దంలో వారి మొహం ఇంకా వారికి కనపడటం లేదు. మహిళల మీద వక్రభాష్యం చెప్పడం మానలేదు. అక్రమ సంబంధాలు అంటగట్టే నీచ సంస్కృతిని మరవలేదు. వారి మానసిక స్థితి మెరుగుపడలేదు. ఆత్మీయతతో పిలిచే పెళ్లి పిలుపులో కూడా రాజకీయ కోణం వెతకడం అంటే.. సాక్షి తీరు అచ్చం కోడిగుడ్డు మీద ఈకలు పీకడమే ! ఎవరి మెప్పుకోసం ఈ దిగజారుడు? నా కుమార్తె వివాహ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తే రాజకీయ కోణమని, చెట్టపట్టాల్ అని, ఆత్మీయ సంబంధాలని తప్పుడు అర్థాలువెతుకుతున్నారంటే, మీ ఆలోచనా విధానం ఎంత కలుషితమైందో, మీ మెదడు ఇంకా మోకాళ్లలో ఎందుకుందో, మీ స్థాయి ఎక్కడికి దిగజారిందో, మానవసంబంధాలు మరిచిపోయి రాక్షస తత్వాన్ని ఎందుకు ప్రదర్శిస్తున్నారో రాష్ట్ర ప్రజలకు మళ్లీ మళ్లీ అర్థమవుతూనే ఉంది. ఆనాడు తన బిడ్డల పెళ్లిళ్లకు సైతం చంద్రబాబుగారిని వైఎస్సార్ గారు ఆహ్వానించారు. అంటే ఆయన కూడా చంద్రబాబు గారితో చెట్టపట్టాల్ వేసుకొనితిరిగినట్లా ? బాబు గారు పెళ్లిళ్లకు వచ్చి ఆశీర్వచనాలు ఇస్తే వైఎస్సార్ తో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్నట్లా ? వైసీపీ అధ్యక్షుడు జగన్ గారిని అడుగుతున్నాం. అక్కచెల్లెమ్మల మీద అమితమైన ప్రేమ అని చెప్పే మీరు.. మీ పత్రిక సాక్షిలో ఇలాంటి చెట్టాపట్టాల్ వార్తను ఎలా సమర్థించుకుంటారు? ఒక ఆడబిడ్డ మీద నిందలు వేయడమా మీ పత్రిక విధానం? తల్లి, చెల్లి అనే బేధం లేకుండా బురద రాతలు రాయించడమేనా మీ ఎజెండా? ఇది మీరే దగ్గరుండి రాయించిన రోత రాతలా? సమాధానం చెప్పాలి. ఇలాంటి నీచపు రాతలు రాయించినందుకు, తప్పుడు కూతలు కూయించినందుకు సంజాయిషీ మీరిస్తారా? లేక మీ సాక్షితో ఇప్పిస్తారా ? తేల్చుకోవాలి" అని షర్మిల నిప్పులు చెరిగారు.

సమ్మక్క సాగర్‌కు గ్రీన్ సిగ్నల్

ఛత్తీస్‌గఢ్ రాజధాని నయా రాయ్‌పూర్‌లోని సాయ్ అధికారిక నివాసంలో మంగళవారం ఇద్దరు ముఖ్య మంత్రులు భేటీ అయ్యారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి తెలంగాణకు నీటి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని రేవంత్ ఈ భేటీలో వివరించారు. అందుకే నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) వెంటనే ఇవ్వాలని కోరారు. దీనికి సాయ్ ఉదారంగా స్పందించారు. బీజాపూర్ జిల్లాలో ముంపు ప్రాంతాన్ని అంచనా వేసి, పరిహారం ఖరారు చేస్తూ ఎన్‌వోసీ జారీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి వెంట నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ పర్యాటక శాఖ మంత్రి రాజేశ్ అగర్వాల్, ఆ రాష్ట్ర సీఎస్ వికాస్ శీల్, ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద 2017లో చేపట్టిన ఈ బ్యారేజీ నిర్మాణం 2021-22 నాటికే దాదాపు పూర్తయింది. అయినా ఛత్తీస్‌గఢ్ అనుమతి లేక ఐదేళ్లుగా పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయలేకపోయారు. విష్ణుదేవ్ సాయ్ సానుకూల స్పందనను పెద్ద ముందడుగుగా అధికారులు భావిస్తున్నారు. బ్యారేజీని పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు అనుమతి కోసం తెలంగాణ కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)ను ఆశ్రయించింది.

జలాశయం వల్ల పొరుగు రాష్ట్రంలోని రెవెన్యూ, అటవీ భూములు మునుగుతాయి కాబట్టి ఛత్తీస్‌గఢ్ నుంచి



ఎన్‌వోసీ తేవాలని సీడబ్ల్యూసీ సూచించింది. గోదావరే ఇక్కడ ఇరు రాష్ట్రాల మధ్య సహజ సరిహద్దు. సమ్మక్క సాగర్ డీపీఆర్‌కు సీడబ్ల్యూసీలోని మిగతా విభాగాల నుంచి నుంచి అనుమతులు వచ్చాయని రేవంత్ వివరించారు. ఎన్‌వోసీ వస్తే అంతర్రాష్ట్ర విభాగం క్లియరెన్స్, ఆ తర్వాత సాంకేతిక సలహా మండలి(టీఏసీ) అనుమతి లభిస్తాయని తెలిపారు. ఈ అధికారిక అనుమతులు ఇంకా రావాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినందున ప్రజాప్రయోజనాల దృష్ట్యా మిగిలిన అనుమతుల ప్రక్రియనూ వేగవంతం చేయాలని రేవంత్ కోరారు. అవసరమైతే షరతులతో కూడిన ఎన్‌వోసీ అయినా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ముంపుపై భిన్న అంచనాలు

ఈ ప్రాజెక్టును తొలుత కాంతనపల్లి వద్ద ప్రతిపాదించారు. అక్కడ నిర్మిస్తే 11,408 ఎకరాల భూమి, 17 ఆదివాసీ గ్రామాలు మునిగిపోతాయని, భద్రత, మౌలిక వసతుల పైనా ప్రభావం పడుతుందని తేలింది. దాంతో ముంపును తగ్గించేందుకు నిర్మాణ స్థలాన్ని తుపాకులగూడెంకు మార్చామని తెలంగాణ వివరించింది. ఛత్తీస్‌గఢ్ కోరిన మేరకు ముంపు అధ్యయనం కోసం రూ.9.883 కోట్లను ఏప్రిల్‌లోనే చెల్లించామని, ఐఐటీ ఖరగ్‌పూర్ తన నివేదికను జూలై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించిందని తెలిపింది. తెలంగాణ అధికారులు వెల్లడించిన నివేదిక వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు ముంపునకు గురవుతాయి. గరిష్ఠ వరద వచ్చినా ముంపు 100 ఎకరాల లోపేనని, నదీగర్భాన్ని మినహాయిస్తే మునిగే ప్రైవేటు భూమి సుమారు 32 ఎకరాలేనని వారు చెబుతున్నారు. అయితే పూర్తిస్థాయి నీటిమట్టం(ఎఫ్‌ఆర్‌ఎల్) వద్ద బీజాపూర్ జిల్లాలోని తార్లగూడ సహా 2-3 గ్రామాల పరిధిలో సుమారు 300 హెక్టార్ల(దాదాపు 740 ఎకరాలు) రెవెన్యూ, అటవీ భూమి ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖ అధికారి ఒకరు పీటీఐకి తెలిపారు. ఐఐటీ నివేదిక ఆధారంగా ఇరు రాష్ట్రాల అధికారులు ప్రస్తుతం ఉమ్మడి సర్వే చేస్తున్నారు. రెండు రాష్ట్రాలు అంగీకరించిన విధానంలో నిర్వాసితులుగా గుర్తించిన ప్రతి భూయజమానికీ పరిహారం చెల్లిస్తామని రేవంత్ చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో అమల్లో ఉన్న చట్టాల ప్రకారం భూసేకరణ, పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

పట్టువదలని ప్రయత్నాలు

ఎన్‌వోసీ కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పలుమార్లు సాయితో చర్చించారు. 2025 సెప్టెంబరు 22న నయా రాయ్‌పూర్‌లో, 2026 జూన్ 11న హైదరాబాద్‌లో, సెప్టెంబరు 4న న్యూఢిల్లీలో ఆయనను కలిశారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ 2025 జనవరి 18, మార్చి 3, జూలై 14, సెప్టెంబరు 14, డిసెంబరు 13 తేదీల్లో, 2026 జూన్ 11న ఎన్‌వోసీ కోసం లేఖలు రాశారు. చివరకు సీఎం స్వయంగా రంగంలోకి దిగి, గరిష్ఠ వరద ముంపునకూ పరిహారం ఇస్తామని ప్రకటించారు. దాంతో ఛత్తీస్‌గఢ్ సానుకూలంగా మారిందని అధికారులు చెబుతున్నారు.

4.40 లక్షల ఎకరాల స్థిరీకరణ

సమ్మక్కసాగర్ నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు(ఎఫ్‌ఆర్‌ఎల్ 83 మీటర్లు). శ్రీరాంసాగర్ రెండో దశ కింద 4.40 లక్షల ఎకరాలు, రామప్ప--పాకాల అనుసంధానం కింద 30 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం దీని లక్ష్యం.

తెలంగాణ పట్ల సోనియాకు ప్రేమ లేదు

కేసీఆర్ నాయకత్వంలో సాగిన ప్రజా ఉద్యమమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి అసలు కారణం. తెలంగాణ ప్రజలు సృష్టించిన రాజకీయ అనివార్యతకు తలొగ్గే కాంగ్రెస్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. తెలంగాణ ఉద్యమ ఉప్పెనలో కొట్టుకుపోతామన్న భయంతోనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది. తెలంగాణపై కాంగ్రెస్‌కు ఎన్నడూ నిజమైన ప్రేమ లేదు. రాజకీయ అవసరాల కోసమే రాష్ట్రం ఏర్పాటు చేశారు. తెలంగాణ చరిత్రను కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకోవాలని చూడటం సిగ్గుచేటు.

పీవీ నరసింహారావుపై ఇప్పుడు ప్రేమ ఒలకబోస్తున్న కాంగ్రెస్ నేతలకు వాణీదేవి గట్టి సమాధానం చెప్పారు. పీవీపై అంత ప్రేమ ఉంటే ఆయన అంత్యక్రియలను ఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదని వాణీదేవి ప్రశ్నించారు. తెలంగాణ నాయకత్వం, ప్రజల పట్ల సోనియా గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి ఎన్నడూ నిజమైన అభిమానం లేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ఎప్పుడూ రాజకీయ అవసరాల కోణంలోనే చూసింది.

తెలంగాణ సాధనలో ప్రజల త్యాగాలను, కేసీఆర్ నాయకత్వాన్ని కాంగ్రెస్ విస్మరించే ప్రయత్నం చేస్తున్నది. కోట్లాది తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, పోరాటాలు, కేసీఆర్ నాయకత్వంలోని ఉద్యమ ఫలితమే స్వరాష్ట్రం. తెలంగాణ ఉద్యమ చరిత్రను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ చెరిపేయలేదు.

హామీలు చూస్తే చక్కెరొస్తది

మూసీ సుందరీకరణ విషయంలో ఇప్పటివరకు డీపీఆర్ లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎవరికి ఇప్పటివరకు కాంట్రాక్టులు వచ్చాయో ప్రభుత్వం చెప్పాలి. కాంగ్రెస్ 420 హామీలు చూస్తే చక్కెర వచ్చి పడిపోవాల్సిందే. ఎన్నికల 6 నెలల ముందు ఇచ్చిన



హామీలు నెరవేరిస్తే మళ్లీ గెలవచ్చు అని ప్రభుత్వం భ్రమలో ఉంది. డీపీఆర్ తిరిగి రావడం అంటేనే ప్రభుత్వం పనితనం తెలుస్తుంది.

నా మీద అడ్డగోలుగా ఆరోపణలు చేస్తూ 8వేల ఎకరాలు ఆక్రమించారని చెప్పారు. రెండు నెలలు అవుతుంది ఎక్కడ నిరూపించారు.. సిగ్గుండాలి ముఖ్యమంత్రికి. వందల కోట్లు పెట్టి మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీతో ఫుట్ బాల్ ఆటలు పెట్టిన ఎన్ని పెట్టుబడులు వచ్చాయో చెప్పాలి. చిత్తశుద్ధి ఉంటే ఈ మూడేళ్లలో ఎన్ని సంస్థలు వచ్చాయి ఎన్ని కోట్లు వచ్చాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. సీఎం 119 నియోజకవర్గాలకు ముఖ్యమంత్రి ఎక్కడైన సభ పెట్టుకోవచ్చు. జనం చూడరు.

కేసీఆర్‌కు సెపరేట్‌గా వెళ్తలేవ్

కాళేశ్వరం ప్రజల ప్రాజెక్ట్..పేరు మార్చడం అంటే సిగ్గుచేటు. మూడేళ్లలో ప్రాజెక్ట్ ను పండబెట్టారు. ఆయన పేరు మారిస్తే మేం వచ్చాక మార్చి శునకానందం పొందుతున్నరు. ఇలాంటి ప్రయత్నాలు చేస్తే మేం అధికారంలోకి రాగానే కాంగ్రెస్ నాయకుల పేర్ల మీద ఉన్న ప్రాజెక్ట్ ల పేర్లు మారుస్తాం. 67 ఎకరాల్లో రైతులకు వచ్చిన నీళ్లు కేసీఆర్ కూడా వెళ్తున్నాయి.. ఆయనకి సెపరేట్‌గా వెళ్ళడం లేదు. ప్రజాస్వామ్యం గురించి సుద్దులు చెప్పిన రాహుల్, ప్రతిపక్షాల మీద ఫైస్‌మీట్ పెట్టినా కేసులు ఎందుకు పెడుతున్నారో సమాధానం చెప్పాలి. దీక్ష దివస్ సందర్భంగా అన్ని నియోజకవర్గాల్లో స్ఫూర్తి సభలు నిర్వహిస్తాం. ఉమ్మడి కరీంనగర్ లో సభ నిర్వహిస్తాం. మే అక్కడ పాల్గొంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

భారత్ సమ్మిట్‌తో సాధించిందేమిటి?

కొడంగల్‌కు రూ.9 వేల కోట్లు తరలించారు. మేడిగడ్డ నీటిని వినియోగించడంలో ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను పట్టించుకోకుండా ప్రభుత్వం ప్రజాధనాన్ని దుబారా చేస్తోంది. రూ.100 కోట్లతో భారత్ సమ్మిట్ నిర్వహించి ప్రభుత్వం సాధించిందేమిటి? ఈ కార్యక్రమం వల్ల రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. కొడంగల్ నియోజకవర్గానికి సుమారు రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులు కేటాయించడాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల అవసరాలను కూడా ప్రభుత్వం సమానంగా పరిగణనలోకి తీసుకోవాలి. మేడిగడ్డ బ్యారేజీలో అందుబాటులో ఉన్న నీటిని ఒడిసిపట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. మరోవైపు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు సుమారు 10 టీఎంసీల నీరు అవసరమవుతుంది. ఈ పరిస్థితుల్లో మూసీ సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వడం సరైన నిర్ణయం కాదు. రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో భారీ వ్యయంతో మూసీ సుందరీకరణ చేపట్టాలనుకోవడం ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రశ్నలు లేవనెత్తుతోందని కేటీఆర్ విమర్శించారు.



రూ.7 వేల కోట్లకు పైగా తుపాను నష్టం..
తక్షణ ఆర్థిక సాయం అందించండి

ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర బృందాలు నష్టాన్ని అంచనా వేశాయని, వీలైనంత త్వరగా సాయం అందిస్తే రాష్ట్రానికి ఊరట కలుగుతుందని చంద్రబాబు కోరారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు నిధులు విడుదల చేయాలని, విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలకు రోడ్లు, సాగునీరు, డ్రింకింగ్ వాటర్ సప్లై, డ్రిప్ ఇరిగేషన్‌కు నిధులివ్వాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తలెత్తిన సమస్యలను కూడా వివరించి ఏపీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాల వారీగా చేపట్టిన అభివృద్ధి ప్రణాళికలను నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి వివరించారు. ఇటీవల విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాలనూ ప్రస్తావించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కేంబ్రిడ్జ్‌లో రాహుల్ ప్రేమ జ్ఞాపకాలు

న్యూఢిల్లీ, నవంబర్ 17 (సింగిడి)

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. తన తల్లిదండ్రులు సోనియాగాంధీ, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ తొలిసారి కలుసుకున్న కేంబ్రిడ్జ్‌లోని ఓ రెస్టారెంట్‌కు గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి వెళ్లినట్లు చెప్పారు. అయితే అక్కడి ఆహారం మాత్రం తనను తీవ్రంగా నిరాశపరిచిందని సరదాగా వ్యాఖ్యానించారు. సోమవారం దిల్లీలో సోనియా గాంధీ ఆత్మకథ ''బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'' అధికారిక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రాహుల్ ఈ విషయాలు పంచుకున్నారు.

''చాలా సంవత్సరాల తర్వాత నేను కేంబ్రిడ్జ్‌కు వెళ్లాను. అప్పుడు నా గర్ల్‌ఫ్రెండ్‌తో 'మనమిద్దరం వర్సిటీ రెస్టారెంట్‌కు వెళ్దాం' అని చెప్పాను. అక్కడికి ఎందుకు తీసుకెళ్తున్నానో ఆమెకు తెలియదు. నా తల్లిదండ్రులు ఎక్కడ కలుసుకున్నారో చూడాలనేది నా ఉద్దేశం. లోపలికి వెళ్లిన తర్వాత నా తల్లిదండ్రులు ఈ రెస్టారెంట్‌లోనే కలుసుకున్నారని అక్కడి వ్యక్తికి చెప్పాను. వెంటనే అతను 'ఓహ్.. వాళ్లా! నాకు తెలుసు' అన్నాడు'' అని రాహుల్ వెల్లడించారు.

''మీరు ప్రేమలో పడాలనుకుంటే మాత్రం వర్సిటీ రెస్టారెంట్‌కు వెళ్లండి. కానీ అక్కడి చికెన్ వంటకం మాత్రం ఎప్పుడూ తినకండి. మా తల్లిదండ్రులకు అక్కడి ఆహారం అద్భుతంగా అనిపించింది. చాలా బాగుందని వారు గుర్తు చేసుకున్నారు. కానీ నాకు మాత్రం అక్కడి భోజనం అస్సలు నచ్చలేదు'' అని నవ్వులు పూయించారు. కార్యక్రమం అనంతరం విలేకరులు రాహుల్.. మీ ప్రియురాలు ఎక్కడున్నారని ప్రశ్నించగా.. ''ఆమె నా స్నేహితురాలు'' అని సమాధానమిచ్చారు. సోనియాగాంధీ ఆత్మకథ విడుదలై వారం కూడా గడవకముందే 2 లక్షలకుపైగా కాపీలు అమ్ముడుపోయాయని ప్రచురణ సంస్థ హార్పర్‌కాలిన్స్ భారత శాఖ సీఈఓ అనంత్ పద్మనాభన్ వెల్లడించారు. ఈ పుస్తకం స్వతంత్ర భారతంలో విడుదలైన అతి పెద్ద ఆత్మకథగా ఖ్యాతి గడించిందన్నారు. ఇక పుస్తకాన్ని కొన్నవాళ్లు.. ఆర్డర్ చేసిన పుస్తకం ఎదురుచూస్తున్నవారు, పుస్తకం చదివినప్పటికీ ఆ విషయాన్ని బయటకు చెప్పనివాళ్లు.. అంటూ పద్మనాభన్ చమత్కరించారు. ఆయన వ్యాఖ్యలతో సభలో పెద్ద ఎత్తున నవ్వులు, చప్పట్లు వినిపించాయి. ముందు వరుసలో కూర్చున్న సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సైతం నవ్వుకున్నారు.

కాంగ్రెస్ నయవంచనకు
నేటితో మూడేళ్లు
హరీశ్‌రావు విమర్శలు

హైదరాబాద్, నవంబర్ 17 (సింగిడి)



కాంగ్రెస్ మేనిఫెస్టోకు, ఆ పార్టీ నయవంచనకు నేటితో మూడేళ్లు అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. గొప్పగా చెప్పుకున్న అభయ హస్తం హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీ మొండి హస్తంగా మారిందని ఆరోపించారు. మేనిఫెస్టో తమకు భగవద్గీత అని, దానిని తప్పకుండా అమలు చేస్తామని మూడేళ్ల క్రితం ఇదే రోజున ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో టీపీసీసీగా ఉన్న రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మూడేళ్లు గడిచినా ఆ హామీలకు దిక్కులేదన్న ఆయన, వాటి అమలు ఊసే లేదని ఆక్షేపించారు. ఓట్లు వేసిన ప్రజలనే కాదు, ఓట్లు వేసి దేవుళ్లను, పవిత్ర గ్రంథాలను సైతం సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. గాంధీ భవన్ సాక్షిగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదని ఘాటుగా ప్రశ్నించారు. మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆశలను ఓట్లుగా మార్చుకొని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఆశలను ఆవిరి చేశారని విమర్శించారు. కాంగ్రెస్ మాయ మాటలు, నయ వంచనను తెలంగాణ ప్రజలు ఇప్పటికే గుర్తించారని, ఇక మిగిలింది తగిన గుణపాఠం చెప్పడమేనని వ్యాఖ్యానించారు.

విదేశీ విద్యార్థులకు భారీ ఊరట..

న్యూఢిల్లీ, నవంబర్ 17 (సింగిడి)

అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విదేశీ విద్యార్థులకు భారీ ఊరట లభించింది. అంతర్జాతీయ విద్యార్థులు, పరిశోధకులు, విదేశీ జర్నలిస్టుల నివాస గడువుకు పరిమితులు విధించాలని ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలను అక్కడి ఫెడరల్ కోర్టు కొట్టివేసింది. విద్యార్థుల నివాస కాలపరిమితి నాలుగేళ్లకు పరిమితం చేయడంతోపాటు, ఆ తర్వాత కొనసాగాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేయాలన్న హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రతిపాదన చట్టవిరుద్ధమని తేల్చింది. దీంతో దశాబ్దాలుగా అమల్లో ఉన్న 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' విధానం కొనసాగనుంది. ఈ తీర్పుతో అమెరికాలో చదువుకుంటున్న భారతీ

యాంటీబయోటిక్స్ దుర్వినియోగాన్ని అరికట్టాలి

ప్రజలకు అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

హనుమకొండ ప్రతినిధి

నవంబర్ 17 (సింగిడి)

యాంటీబయోటిక్స్‌ను వైద్యుల సూచనల మేరకే వినియోగించాలని, వాటి దుర్వినియోగం వల్ల యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) పెరిగి భవిష్యత్తులో తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వక్తలు పేర్కొన్నారు. ఔషధాల సరైన వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ), న్యూఢిల్లీ ఆధ్వర్యంలో తెలంగాణలోని వివిధ ఫార్మసీ కళాశాలల సహకారంతో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు–2026ను మంగళవారం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఈ వేడుకలకు ఆతిథ్యమిచ్చింది. ఈ ఏడాది 'స్వస్థ భారత్: యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను ఎదుర్కోవడం' అనే ఇతివృత్తంతో కార్యక్రమాలను నిర్వ హించారు. యాంటీబయోటిక్స్‌ను అవసరం లేకుండా వినియోగించడం, వైద్యుల సలహా లేకుండా స్వీయ వైద్యం చేసుకోవడం, సూచించిన మందుల కోర్సును మధ్యలోనే నిలిపివేయడం వంటి చర్యల వల్ల సూక్ష్మజీవుల్లో మందులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతోందని నిర్వాహకులు వివరించారు. దీనివల్ల సాధారణ ఇన్‌ఫెక్షన్లకు సైతం చికిత్స అందించడం కష్టతరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.



భారీ అవగాహన ర్యాలీ

వేడుకల్లో భాగంగా ఉదయం 7.30 గంటలకు హనుమకొండలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు భారీ యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణలోని వివిధ ఫార్మసీ కళాశాలలకు చెందిన సుమారు మూడు వేల మంది విద్యార్థులు, అధ్యాపకులు, ఫార్మసిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ మోంటు కుమార్ ఎం. పటేల్ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ రెడ్డి స్వాగతం పలికారు. ర్యాలీలో విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో ఫ్లాష్‌మాబ్‌లు ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. 'యాంటీబయోటిక్స్ దుర్వినియోగాన్ని అరికట్టాలి', 'వైద్యుల సూచనల మేరకే మందులు వాడాలి', 'ఔషధాలను బాధ్యతాయుతంగా వినియోగించాలి' అనే సందేశాలతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఉదయం 9.40 గంటలకు ర్యాలీ కాళోజీ కళాక్షేత్రానికి చేరుకోగా, అక్కడ కూడా విద్యార్థులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.



ఘనంగా ప్రారంభోత్సవ వేడుకలు

ఉదయం 10 గంటలకు కాళోజీ కళాక్షేత్రంలో సంప్రదాయ స్వాగత నృత్యం, తెలంగాణ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో ప్రారంభోత్సవ వేడుకలు మొదలయ్యాయి. అనంతరం జ్యోతి ప్రజ్వలన, వందేమాతరం కార్యక్రమాలు నిర్వహించారు.ముఖ్య అతిథిగా, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విశిష్ట అతిథిగా, వరంగల్ కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి అతిథిగా పాల్గొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ మోంటు కుమార్ ఎం. పటేల్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు.కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జె. వెంకటేశ్వర్ రావు స్వాగత ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పీసీఐ అధ్యక్షుడు డాక్టర్ మోంటు కుమార్ ఎం. పటేల్ తదితరులు ఫార్మసీ విద్య అభివృద్ధి, ఔషధ పరిశోధనలు, ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల ప్రాధాన్యాన్ని వివరించారు. ఔషధాలను పంపిణీ చేయడమే కాకుండా, వాటి సరైన వినియోగంపై రోగులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఫార్మసిస్టులపై ఉందని పేర్కొన్నారు.

నిపుణులతో ప్యానెల్ చర్చ

మధ్యాహ్నం రైన్‌బో ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నీరజ్ ధభాయ్ కీలకోపన్యాసం చేశారు. అనంతరం వికాస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ అడెపు రమేష్ సంధానకర్తగా ప్యానెల్ చర్చ నిర్వహించారు. ఈ చర్చలో రైన్‌బో ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నీరజ్ ధభాయ్, హైదరాబాద్ నైపర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. చంద్రయ్య, న్యూహైట్ ఫార్మా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి. వెంకటేశ్వర్లు, పారిశ్రామికవేత్త డాక్టర్ బి. శ్రీనివాస్, రైన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రి క్లినికల్ ఫార్మసిస్ట్ డాక్టర్ తాడికొండ అంబిక, హైదరాబాద్ ఐఐసీటీ మాజీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎన్. లింగయ్య, ప్రతిమ క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్, చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ అవినాష్ తిప్పని పాల్గొన్నారు. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ నివారణ, ఔషధాల సముచిత వినియోగం, క్లినికల్ ఫార్మసీ, వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు, ఔషధ పరిశోధనలు, ఫార్మసిస్టుల వృత్తిపరమైన బాధ్యతలపై నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. విద్యార్థులకు వివిధ రంగాలకు చెందిన నిపుణులతో నేరుగా చర్చించే అవకాశం కల్పించారు.

ఘనంగా ముగింపు వేడుకలు, బహుమతుల ప్రదానం

సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో విశ్వంభర ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ చ. వాహినీ దేవి, వరంగల్ ఎంజీఎం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ బి. యోగానందం, వరంగల్ కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి పాల్గొన్నారు.కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జె. వెంకటేశ్వర్ రావు స్వాగత ప్రసంగం చేయగా, ప్రముఖ అతిథులను నిర్వాహకులు సత్కరించారు. ఆరోగ్యరంగంలో ఫార్మసిస్టుల సేవలు, ఫార్మసీ విద్య అభివృద్ధి, విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించాల్సిన ఆవశ్యకతను వక్తలు వివరించారు.సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో సైంటూన్స్, పోస్టర్ ప్రజెంటేషన్లు, ఫార్మా క్విజ్, నుక్కడ్ నాటక్, కార్టూన్ తయారీ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డాక్టర్ జి. శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలియజేయడంతో జాతీయ గీతాలాపనతో వేడుకలు ముగిశాయి.ఈ కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ డాక్టర్ జె. వెంకటేశ్వర్ రావు, కో-కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ వై. నరసింహారెడ్డి, డాక్టర్ జి. అనిల్ కుమార్ సమన్వయం చేశారు. ఆతిథ్య కళాశాల వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ రెడ్డి, వివిధ ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు, ఫార్మసిస్టులు, పీసీపీ ప్రతినిధులు, వివిధ కమిటీల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాంటీబయాటిక్స్‌ను విచక్షణారహితంగా వినియోగించకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, ఔషధాల బాధ్యతాయుత వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్రను విస్తృతంగా తెలియజేయడంలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు–2026 కీలకంగా నిలిచాయి.

ఎల్లారెడ్డిలో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి



కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 16(సింగిడి)

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం ఎల్లారెడ్డి నాయకులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును కోరారు.అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలో అంబేద్కర్ సంఘ భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సంఘం ప్రతినిధుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు, సంఘ భవన నిర్మాణానికి సంబంధించి అవసరమైన చర్యలు తీసుకొని పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు.అంబేద్కర్ ఆశయాలు, సమానత్వ భావన, సామాజిక న్యాయం భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా ఎల్లారెడ్డిలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని సంఘం నాయకులు పేర్కొ న్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేతరి అమృత్ రావు, కోశాధికారి కర్రోల్ల మొగులయ్య, కనిరాం సార్, డివిజన్ అధ్యక్షులు మర్రు సాయిబాబా, ఉపాధ్యక్షులు మర్రు సాయిలు, సభ్యులు సంగని పోచయ్య, సంగని లక్ష్మయ్య, బక్కోల్ల సాయిలు, చూడ సంజీవులు, పురం గంగారాం తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్ లో విదేశీ నేత రాజకీయ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 17, (సింగిడి):

హైదరాబాద్ లో జరిగిన భారత్ సమ్మిట్ లో విదేశీ సంస్థ ప్రతినిధి,పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్ పిఇఎస్ సెక్రెటరీ జనరల్ జియాకోమో ఫిలిబెక్ చేసిన రాజకీయ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ సిద్దిపేట ఏసీపీకి ఫిర్యాదు చేశారు. సోమవారం సిద్దిపేటలోని ఏసీపీ కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 13,14 తేదీల్లో హైదరాబాద్ లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన భారత్ సమ్మిట్ లో ఇటలీకి చెందిన జియాకోమో ఫిలిబెక్ఓట్ చోర్..గద్దె చోడ్ అంటూ ప్రధానిని ఉద్దేశించి నినాదాలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు..భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ, రాహుల్ గాంధీకి మద్దతుగా మాట్లాడటం పట్ల మండిపడ్డారు. ఒక విదేశీ పౌరుడు, అదీ కాన్విరెన్స్ వీసాపై వచ్చిన వ్యక్తి,భారతదేశ అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం వీసా నిబంధనల ఉల్లంఘన అని, ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ – 2025 ప్రకారం నేరమని బైరి శంకర్ పేర్కొన్నారు. ఇది భారత్ సమ్మిట్ కాదు,యాంటీ భారత్ సమ్మిట్ విదేశీ శక్తులను పిలిచి దేశాన్ని ప్రధానిని అవమానించడం కాంగ్రెస్ కు అలవాటైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నవ్వుతూ ఆ వ్యాఖ్యలను ఆస్వాదించడం సిగ్గుచేటన్నారు. ఒక విదేశీ రాజకీయ ప్రతినిధికి భారత చట్టాలను ఉల్లంఘించే స్వేచ్ఛ లేదని,ఫిలిబెక్ పై,అతనికి వేదిక కల్పించిన నిర్వాహకులపై కేసు నమోదు చేసి,వీసా రద్దు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు నేతృత్వంలోని బృందం ఇప్పటికే హైదరాబాద్ లో ఎఫ్ఆర్ఆర్ఓ ,డీజీపీ సీవీ ఆనంద్ కు ఫిర్యాదు చేసింది. అందులో భాగంగానే జిల్లా స్థాయిలో కూడా ఏసీపీకి ఫిర్యాదు చేసినట్లు బైరి శంకర్ తెలిపారు. పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్, కాసని గొట్టు సంతోష్రెడ్డన కార్యదర్శులు కెమ్మసారం సంతోష్ బి సునీల్, గుండ్లజనార్దన్, శ్రీను, వేణు, చెంది సత్యనారాయణ, అరిగే యాదగిరి, కృష్ణ, మహేందర్, సంతోష్, గణేష్, రాజిరెడ్డి, ప్రశాంత్, కార్తిక్ లు పాల్గొన్నారు.

జేఎన్ఎస్ స్టేడియంలో అన్ని పనులు పూర్తి చేయాలి

హనుమకొండ, నవంబర్ 17(సింగిడి)

హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో డిసెంబర్ 18 నుంచి 21 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 అథ్లెటిక్స్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖేలో ఇండియా నోడల్ ఆఫీసర్ పవన్‌తో కలిసి స్టేడియంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, ఇతర అభివృద్ధి పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, సాంకేతిక బృందాలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, భద్రత, మౌలిక సదుపాయాలను పకడ్బందీగా కల్పించాలని సూచించారు. స్టేడియం పరిసరాలను పూర్తి స్థాయిలో శుభ్రం చేసి చెత్త, పిచ్చిమొక్కలు, తొలగించాలని, నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలు లేకుండా చూడాలని ఆదేశించారు.బల్లియా ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని, స్టేడియం ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని హార్టికల్చర్ అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో తగినంత విద్యుత్ వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎలక్ట్రికల్ విభాగం అధికారులను ఆదేశించారు. అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు స్టేడియాన్ని అన్ని విధాలుగా సిద్ధం చేసి, పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, విద్యుత్, హార్టికల్చర్‌కు సంబంధించిన అన్ని పనులను నవంబర్ 24లోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. అనంతరం, వరంగల్ తూర్పుని యోజకవర్గంలో నేడు పంపిణీ చేయనున్న చేయూత ఆసరా పెన్షన్ల కార్యక్రమ ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. వరంగల్‌లోని ఎల్‌బీనగర్ ఈవెన్ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కొండా సురేఖ చేతుల మీదుగా నిర్వహించనున్న పెన్షన్ల పంపిణీకి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజారెడ్డి, జిల్లా క్రీడల అధికారి ప్రశాంత్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, మాధవీలత, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, సంబంధిత పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు పెన్షన్ల రూపంలో భరోసా

ఎల్లారెడ్డిలో సంక్షేమ పథకాల అమలు!

ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో నూతన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ

ఐదు మండలాల్లో 1,741 కుటుంబాలకు ఆర్థిక చేయూత

కామారెడ్డి ప్రతినిధి

నవంబర్ 16 (సింగిడి)

సదాశివనగర్: అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు అండగా నిలవడమే ప్రభుత్వ సంక్షేమ లక్ష్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పేర్కొన్నారు. ఈ దిశగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.సదాశివనగర్ పట్టణంలోని అశోక్ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన 1,741 మంది లబ్ధిదారుల కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలను అందజేశారు.మండలాల వారీగా పెన్షన్ల వివరాలు ఇలా ఉన్నాయి:- తాడ్వాయి మండలం – 407 కుటుంబాలు- గాంధారి మండలం – 717 కుటుంబాలు- సదాశివనగర్ మండలం – 475 కుటుంబాలు- రామారెడ్డి మండలం – 223 కుటుంబాలు- రాజంపేట మండలం – 219 కుటుంబాలుమొత్తంగా ఐదు మండలాల్లో 1,741 కుటుంబాలకు పెన్షన్ల మంజూరు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పెన్షన్ అనేది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేందుకు పేదలకు అందించే భరోసా అని పేర్కొన్నారు.నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో, పేద ప్రజల సంక్షేమానికి కూడా అంతే ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థుల ప్రతిభకు పట్టం

ఈఎంఆర్ఎస్ గాంధారి కీర్తి ప్రతిష్ఠలు!

నీట్-2026లో సత్తా చాటిన కె. నవీన్

రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచిన ఎల్. సంతోష్

రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసే అరుదైన అవకాశం.. విద్యార్థులను అభినందించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి గాంధారి నవంబర్ 17 (సింగిడి)

కామారెడ్డి: గిరిజన విద్యార్థులు చదువులోనూ, ప్రతిభాపాటవాల్లోనూ ఎవరికీ తీసిపోరని ఈఎంఆర్ఎస్ గాంధారి పాఠశాల విద్యార్థులు నిరూపిస్తున్నారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చాటుతూ ఇద్దరు విద్యార్థులు సాధించిన విజయాలు పాఠశాలకే కాకుండా కామారెడ్డి జిల్లాకు గర్వకారణంగా నిలిచాయి.ఈఎంఆర్ఎస్ గాంధారి పాఠశాలకు చెందిన కె. నవీన్ నీట్-2026 పరీక్షలో అర్హత సాధించి సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించే అవకాశం దక్కించుకున్నారు. మరో విద్యార్థి ఎల్. సంతోష్ తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఈఎంఆర్ఎస్ సైన్స్ విభాగంలో టాపర్‌గా నిలిచి తన ప్రతిభను చాటుకున్నారు. వీరిద్దరూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసే అరుదైన గౌరవాన్ని సైతం దక్కించుకోవడం విశేషం.విద్యార్థులు సాధించిన ఈ అసాధారణ విజయాల నేపథ్యంలో విద్యార్థి కె. నవీన్‌తో పాటు డీసీఓ కామారెడ్డి శ్రీనివాస్ స్వామి, గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ అమర్ సింగ్, ఈఎంఆర్ఎస్ గాంధారి ప్రిన్సిపాల్ రవీంద్ర కుమార్, టీజీటీ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు గోపాల్ మండల్, ఈఎంఆర్ఎస్ గాంధారి ఎస్ఎస్ఏ ఎం. రవి తదితరులు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి విద్యార్థుల విజయాలను వివరించారు.విద్యార్థుల ప్రతిభను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. నీట్ పరీక్షలో అర్హత సాధించి ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశం పొందడం గొప్ప విషయమని, రాష్ట్రస్థాయిలో సైన్స్ విభాగంలో టాపర్‌గా నిలవడం పాఠశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమని కొనియాడారు. గిరిజన విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషిని ప్రశంసించారు.పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సమగ్ర వికాసానికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని, విద్యార్థులు మరిన్ని ఉన్నత విజయాలు సాధించేందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.



కృషికి గుర్తింపు.. ప్రతిభకు ప్రోత్సాహం!

విద్యార్థులు సాధించిన ఈ విజయాల వెనుక వారి నిరంతర కృషి, పట్టుదలతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, పాఠశాల యాజమాన్యం సహకారం, అధికారుల ప్రోత్సాహం కీలకంగా నిలిచాయి. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు చెందిన గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, సరైన మార్గదర్శకత్వం అందిస్తే వారు జాతీయ స్థాయిలోనూ రాణించగలరని ఈ విజయాలు చాటుతున్నాయి.గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సమాన అవకాశాలు కల్పిస్తూ, వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయడమే లక్ష్యంగా ఈఎంఆర్ఎస్ గాంధారి పాఠశాల ముందుకు సాగుతోంది. ఈ విద్యార్థుల విజయాలు మరెందరో గిరిజన విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవడంతో పాటు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

దుబ్బాక గ్రామీణ రహదారుల అభివృద్ధికి వినతి

రహదారుల, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

సిద్దిపేట ప్రతినిధి,

నవంబర్ 17, (సింగిడి):

దుబ్బాక నియోజకవర్గంలోని గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం మంత్రిని కలిసి నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి, నూతన రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పలు గ్రామాల్లో రహదారుల అభివృద్ధి అవసరమని, నూతన రహదారుల నిర్మాణంతో ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు విద్యార్థులు, రైతులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగించేందుకు రోడ్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత రహదారులకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కొత్త ప్రభాకర్ రెడ్డి కోరారు.



సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగుల ఐక్య పోరు

సిద్దిపేట జిల్లాలో సామూహిక సాధారణ సెలవు విజయవంతం

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

సిద్దిపేట ప్రతినిధి,

నవంబర్ 17 (సింగిడి):

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపట్టిన సామూహిక సాధారణ సెలవు కార్యక్రమం సిద్దిపేట జిల్లాలో విజయవంతమైంది. రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా సోమవారం పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధులకు దూరంగా ఉండి తమ నిరసనను వ్యక్తం చేశారు.సీపీఎస్ విధానం ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితానికి ఆర్థిక భద్రత కల్పించలేకపోతోందని సంఘ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించే పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్సీపీఎస్ఈయూ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి రాజ్‌కుమార్ లకు వినతిపత్రం అందజేశారు. సా మూహిక సెలవులో పాల్గొన్న ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఉద్యోగుల పట్ల సానుకూల వైఖరితో ఉంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ సాధించే వరకు ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని జిల్లా సంఘ నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చేగూరి దేవరాజ్, ప్రధాన కార్యదర్శి బత్తిరాజు శశి, దా. బాబు, రమేష్, హరిప్రసాద్, బాలలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, సతీష్, మల్లేశం, రామచంద్రం, తిరుమలేశ్, శ్రీకాంత్, వినోద్, రాజమౌళి, ర

ఎడిటోరియల్

Editorial

బతుకు పాఠాలు నేర్పిన బడి



ప్రతి జీవికి పుట్టుకతో అమ్మ ఒడి మొదటి బడి అయితే ప్రతి మనిషికి అక్షర జ్ఞానాన్ని అందించి ఒక పరిపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దే దేవాలయం బడి. గుడిలో దేవుడి మాదిరిగా బడిలో గురువు నిస్వార్థంగా నిర్విరామంగా తన విజ్ఞానపు గనితో విద్యార్థి లోకం శ్రేయస్సుకై శ్రమిస్తారు. ఊహ వచ్చినప్పటి నుండి మంచి చెడును గుర్తించే సమర్థతను సామర్థ్యాన్ని నేర్పే ఉన్నత క్షేత్రం బడి. ఓనమాలను ఓర్పుగా నేర్చుకుని, పదాలను పదిలంగా అమార్చుకుంటూ మాటలను మర్యాదపూర్వకంగా వాడే సాంప్రదాయాన్ని అందించే మహోన్నతమైన జ్ఞానబీజం బడి. అంధకారంలో ఉన్న వ్యక్తికి వివేకవంతమైన, విచక్షణపూరితమైన ఆలోచనలను ప్రవర్తనను కలిగించే శక్తి చైతన్య రూపం బడి. ఎవరూ తెలియని, ఏమీ తెలియని పరిస్థితుల్లో మూగబోయిన బతుకులకు భరోసానిచ్చే బాల్య మిత్రులను బడి అందిస్తుంది. పాఠశాలలో విద్యార్థిగా ఉన్న ప్రతి నిమిషం వ్యక్తి జీవితంలో ఒక మధురమైన అద్భుతం. చదువు నేర్పే గురువుల మందలింపులు పాఠశాలలో నిర్వహించే జాతీయ పండుగల కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఆట, పాటల పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ చేసే కేరింతలు. తోటి విద్యార్థుల స్నేహపూర్వక వెక్కిరింతలు, కల్మషం లేని నేస్తాలు ఇలా ఒక్కటేమిటి మనిషి జీవితానికి సరిపడే ఎన్నో గొప్ప అనుభూతి జ్ఞాపకాల సమ్మేళనం బడి. సమాజం పట్ల విషయ పరిజ్ఞానం పట్ల విలువలతో కూడిన విద్యను అందిస్తుంది బడి. ఒక వ్యక్తి స్థాయి ఏదైనా తన బాల్య మిత్రులు ఎక్కడ ఉన్నా ఏం చేస్తున్నా మర్చిపోలేని గొప్ప ఆత్మీయ బంధానికి బడి బాధ్యున్ని చేస్తుంది. నాబడి, మనబడి అనే మంచి స్వార్థపూరితమైన ఆలోచనలు మదిలో జనింపచేసే ఆత్మీయఅనురాగాల నిలయానికి ప్రతీక. అనునిత్యం ఆత్మీయ అనుబంధాలను స్మరించుకుంటూ అభిమానాన్ని పంచుకుంటూ బాల్య స్నేహపు సన్నివేశాలను తెచ్చుకునేలా జ్ఞాపకి చేస్తుంది బడి. నేటి సమాజంలో చాలామంది విద్యార్థులు తమబడిని తమకు విద్య నేర్పిన గురువులను గౌరవించుకుంటూ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాలతో గతకాలపు ఆనందపు స్మృతులను, అనుబంధాలను మళ్లీ ఒకసారి గుర్తు తెచ్చుకొని తమ జీవితంలో ఎదురైన కష్టనష్టాలను మిత్రులతో పంచుకుంటూ కొంత సేపుతమ ప్రస్తుత జీవితాలను మరిచి ఆత్మీయ బంధాలకు పాత్రులు అవుతున్నారు. తమకు విద్య నేర్పిన గురువుల బాగోగులను తెలుసుకొని సహాయం చేస్తూ ఘనంగా సత్కరిస్తున్నారు. తమకు విజ్ఞానపు దారులు చూపి బతుకు పాఠాలు నేర్పిన బడి అభివృద్ధికి మరియు బడిలో రాబోవు తరాల విద్యా వ్యాప్తికి తమవంతు ఆర్థిక సహాయ సహకారాలు చేస్తూ బడి సమగ్ర అభివృద్ధికి చేయూతనందిస్తున్నారు. తరం ఏదైనా విద్యాబుద్ధులతో పాటు బతుకు పాఠాలను మంచి మానవత్వం విలువలను నేర్పిన బడిని మరువకుండా జీవితపు మ్యూజియంగా చూసుకుంటూ రక్షించుకుందాం. ప్రైవేటు, ప్రభుత్వ బడి ఏదైనా భవితకు బాటలు వేసిన బడిని, గురువులను జ్ఞానంతో కూడినవిజ్ఞానపు అరుదైన ఆస్తులుగా పరిరక్షించుకుందాం.

వంశీకృష్ణగౌడ్. బండి
ఎంఎస్సీ(కెమిస్ట్రీ)
రంగయ్యపల్లి, రేగొండ
జయశంకర్ జిల్లా
8688063096



బహు భాషావేత్త పురిపండా అప్పల స్వామి

నవంబర్ 18... కళాప్రపూర్ణ పురిపండా వర్ధంతి



తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందించిన మహానుభావులలో పురిపండా అప్పల స్వామి ప్రముఖులు. రచయితగా, పాత్రికేయులుగా, పత్రికా నిర్వాహకులుగా, రచయితల సంఘం అధ్యక్షులుగా, గ్రంథాలయ స్థాపకులుగా, గ్రాంథిక తెలుగు భాషా వాదిగా, బహుభాషా కోవిదులు గానే గాక, మహాత్మ గాంధీ నేతృత్వంలో చేపట్టిన స్వాతంత్ర్య ఉద్యమ కార్య క్రమాలలో జాతీయ వాదిగా క్రియా శీలక పాత్రలు పోషించారు.

పురిపండా అప్పలస్వామి (నవంబరు 13, 1904 – నవంబరు 18, 1982) విజయనగరం జిల్లా, సాలూరు గ్రామంలో నవంబరు 13, 1904 సంవత్సరంలో జన్మించారు. అక్కడే విద్యాభ్యాసం కొంతకాలం జరిపి, పిదప స్వయంకృషితో ఆంధ్ర, సంస్కృతాలలోనే గాక ఒరియా, హిందీ, బెంగాలీ, ఆంగ్ల భాషలలో పాండిత్యాన్ని ఆర్జించారు. మహాత్మాగాంధీ నిర్వహించిన సహాయ నిరాకర ణోద్యమం, హరిజనోద్యమం, ఖాదీ ప్రచారము లలో అత్యంత శ్రద్ధతో పాల్గొన్నారు. విశాఖపట్నంలో అఖిల భారత చరఖా సంఘం వారి ఖాదీ భాండాగారంలో నిర్వహకు డుగా కొంతకాలం పనిచేశారు.

పత్రికా రంగంలో ఆయన తన ప్రతిభను ప్రదర్శించారు. విశాఖ పట్నం నుండి వెలువడిన 'స్వశక్తి' అను జాతీయ వారపత్రికకు సహాయ సంపాదకుడుగా కొంత కాలం పనిచేశారు. 'ఆంధ్రపత్రిక' కు విలేఖరిగా పన్నెండేళ్ళు వ్యవహరించారు. 'సత్యవాణి' పత్రికను నిర్వహిస్తూ, ఆయన రాసిన సంపాదక వ్యాసాలు పునర్ముద్రణ గౌరవాన్ని పొందాయి. ఆయన ప్రచురించిన 'వైశాఖి' మాసపత్రిక సారస్వత ప్రియుల మన్ననలను పొందింది.

గ్రంథాలయోద్యమంలో ఆయన సాగించిన కృషి ప్రశంసనీయం. మంతెన ఆదినారాయణ స్వామి స్థాపించిన ఆంధ్రప్రదేశ్ ప్రథమ గ్రంథాలయాన్ని, 'కవితా సమితి' గ్రంథాలయాన్ని ఆయన అభివృద్ధి పరచారు. శ్రీరామవరం, పార్వతీ పురంల లోని గ్రంథాలయాలను పెంపొందించారు. మరకాం గ్రామాన ఒక గ్రంథాలయాన్ని స్థాపించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ యావజ్జీవ గౌరవ సభ్యులుగా ఎన్నుకో బడినారు.

ఆయన సాహిత్య రంగంలో సాధించిన కృషి అనన్య సామాన్యం. 15 ఏళ్ళ ప్రాయంలోనే తెలుగులో గద్యపద్య రచనను శ్రీకారం చుట్టారు. 1928 వరకు ఆయన గ్రాంథిక భాషావాది. గిడుగు వెంకట రామమూర్తిని పరిచయంతో, ఆయనతో ప్రభావితుడై తన సాహిత్య కృషిని వ్యావహారిక భాషలోనే సాగించారు. కందపద్య మయమైన 'రాట్న పతాకం' ఆయన తొలి రచన. ప్రముఖ రచనలలో 'సౌదామిని' ఆంగ్లంలోకే కాక హిందీ, ఒరియా భాషలలోకి కూడా అనువదింపబడి పెక్కు ముద్రణలను పొందింది. కేంద్ర సాహిత్య అకాడమీ కోరికపై 'అమృత సంతానం', 'మట్టి మనుష్యులు' అనే ఒరియా నుండి తెనిగించారు. వంగసాహిత్య చరిత్ర, ఒరియా సాహిత్య చరిత్రలను తెలుగులో రచించారు. అలాగే ఆంధ్ర సాహిత్య చరిత్రను ఒరియా భాషలో రచించి తెలుగు సాహిత్యంతో పరిచయాన్ని ఒరియా పండితులకు కల్పించారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వ్యవహారిక భాషలో రచించుటకు పూనుకొన్న సంస్కృత భారతానువాదం శాస్త్రి మరణం వలన అసమగ్రంగా నిలిచిపోగా, మిగిలిన పదిహేను న్నర పర్వాలను రచించి పూర్తిచేశారు. రాట్న పతాకం; మహమ్మద్ చరిత్ర; సౌదామిని; ఒరియా పాటలు; జగద్గురు శంకరాచార్య; ఛెతిమాణ అఠంగుఠ; విశ్వకళావీధి; హంగేరీ విప్లవం; దేవీ భాగవతం; పురిపండా భాగవతము; పురిపండా వ్యావహారికాంధ్ర మహాభారతం; శ్రీమద్భాగవతము; వ్యావహారి కాంధ్ర వాల్మీకి రామాయణం; అమృత సంతానం (అనువాదం); మట్టి మనుష్యులు (అనువాదం); వంగ సాహిత్య చరిత్ర; ఒడియా సాహిత్య చరిత్ర; భగవద్గీత తదితరాలు పురిపండా ప్రముఖ రచనలు.

ఆయన విశాఖ రచయితల సంఘానికి కొంతకాలం అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్ర ప్రదేశ్ లలితకళా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీలో కార్యవర్గ సంఘాలలో సభ్యత్వాలను పొందారు.

పురిపండా నవంబరు 18, 1982 సంవత్సరంలో పరమ పదించారు. ఆయనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ పురస్కారం ప్రదానం చేసింది.

ఆయన శతజయంతి ఉత్సవాలు విశాఖపట్నంలో ఘనంగా నిర్వహించగా, ఆ సందర్భంగా ఆయన జీవితచరిత్ర, సాహిత్యం గురించిన ద్వా.నా.శాస్త్రి రచించిన పుస్తకం విడుదల చేశారు. పురిపండా విగ్రహాన్ని బీచ్ రోడ్డులో ప్రతిష్ఠించారు.

-రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

మెడలో మాల.. మనసులో మార్పు రావాలి!

అయ్యప్ప దీక్ష అంటే కేవలం 41 రోజుల నియమం కాదు..
జీవితానికి నేర్పే గొప్ప పాఠం!
(బుధవారం ప్రత్యేక ఆధ్యాత్మిక కథనం)

కార్తీక మాసం వచ్చిందంటే చాలు.. ఎక్కడ చూసినా అయ్యప్ప నామస్మరణ. నల్లటి దుస్తులు ధరించిన స్వాములు, మెడలో తులసి లేదా రుద్రాక్ష మాల, నోట శరణుఘోష, ఇంటింటా అయ్యప్ప భజనలు.. శబరిమల యాత్రకు సిద్ధమయ్యే భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. అయితే అయ్యప్ప దీక్ష అంటే కేవలం మాల ధరించడం, నల్లటి దుస్తులు వేసుకోవడం, 41 రోజులు నియమాలు పాటించడం మాత్రమేనా? లేక మనిషిని మనిషిగా తీర్చిదిద్దే ఒక గొప్ప జీవన విధానమా?

మాల ధరించిన క్షణం నుంచి మారాలి మన ఆలోచన!

అయ్యప్ప మాలధారణ అనేది ఒక ఆధ్యాత్మిక సంకల్పం.

మాల మెడలో పడినప్పటి నుంచి భక్తుడు తన ప్రవర్తన, మాట, ఆలోచనలపై నియంత్రణ సాధించేందుకు ప్రయత్నిస్తాడు. కోపాన్ని తగ్గించుకోవడం, అబద్ధాలకు దూరంగా ఉండటం, ఇతరులను బాధించకపోవడం, మద్యపానం, ధూమపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండటం, సాత్విక ఆహారం తీసుకోవడం దీక్షలోని ముఖ్యమైన నియమాలు. ఈ నియమాల వెనుక ఉన్న అసలైన ఉద్దేశం శరీరాన్ని మాత్రమే కష్టపెట్టడం కాదు.. మనసును క్రమశిక్షణలో పెట్టడం. మనిషిలోని అహంకారాన్ని తగ్గించి, సహనం, ఓర్పు, సేవాభావం పెంపొందించడమే దీక్ష ఇచ్చే సందేశం.

స్వామి అంటే ప్రతి మనిషిలో దైవాన్ని చూడటం!

అయ్యప్ప దీక్షలో కనిపించే అత్యంత గొప్ప సంప్రదాయం ఒకరినొకరు 'స్వామి' అని సంబోధించుకోవడం. వయసు, కులం, ఆర్థిక స్థితి, హోదా వంటి భేదాలకు అతీతంగా భక్తులు పరస్పరం స్వామి అని పిలుచుకుంటారు. ఈ ఒక్క సంబోధనలోనే సమానత్వం అనే గొప్ప సందేశం దాగి ఉంది. సాధారణ రోజుల్లో ఒకరినొకరు హోదాలతో, ఆస్తిపాస్తులతో అంచనా వేసే సమాజం.. అయ్యప్ప దీక్షలో మాత్రం అందరినీ ఒకే దైవస్వరూపంగా చూడాలని నేర్చుకుంటుంది. నిజమైన భక్తి అంటే ఇదే కదా! మనిషిని గౌరవించడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కూడా భగవంతుడికి చేసే సేవే.

41 రోజుల దీక్ష.. జీవితాంతం గుర్తుండాల్సిన పాఠం!

మండల దీక్షలోని 41 రోజులు భక్తుడికి ఒక క్రమశిక్షణను అలవాటు చేస్తాయి. ఉదయం స్నానం, పూజ, నామస్మరణ, సాత్విక ఆహారం, నియంత్రిత జీవనం.. ఇవన్నీ మనిషి దైనందిన జీవితంలో మంచి అలవాట్లను పెంపొందించడానికి దోహదపడతాయి.

శబరిమల అధికారిక ఆలయ సమాచారం ప్రకారం మండల వ్రతం



వెనుక ప్రధాన ఉద్దేశం స్వీయ నియంత్రణ, మంచి అలవాట్లను పెంపొందించడం. అంటే 41 రోజుల పాటు పాటించిన నియమాలు యాత్ర పూర్తికాగానే ముగిసిపోకూడదు. అవి జీవితాంతం కొనసాగితేనే దీక్షకు నిజమైన సార్థకత లభిస్తుంది.

ఇరుముడి తలపై.. బాధ్యత గుండెల్లో!

శబరిమల యాత్రలో ఇరుముడికి ప్రత్యేక స్థానం ఉంది. గురుస్వామి మార్గదర్శకత్వంలో భక్తులు ఇరుముడిని సిద్ధం చేసుకుంటారు. నెయ్యితో నింపిన కొబ్బరికాయను అయ్యప్పకు సమర్పించడం ఈ యాత్రలోని ముఖ్యమైన ఆచారం. కొబ్బరిలోని నీటిని తొలగించి నెయ్యి నింపడం ద్వారా ప్రాపంచిక ఆలోచనలను విడిచి ఆధ్యాత్మిక భావనలను నింపుకోవాలనే ప్రతీకాత్మక అర్థాన్ని భక్తులు భావిస్తారు.

18 పవిత్ర మెట్లు అధిరోహించడం భక్తుడి ఆధ్యాత్మిక ప్రయాణంలో అత్యంత ముఖ్యమైన ఘట్టం. ప్రతి మెట్టు ఎక్కుతున్నప్పుడు తనలోని చెడు ఆలోచనలు, అహంకారం, అసూయ, ద్వేషం వంటి భావాలను వదిలించుకోవాలనే సంకల్పం ఉండాలి.

దీక్ష ముగిసినా ధర్మం ముగియకూడదు!

నేటి సమాజంలో మనిషికి అన్నీ ఉన్నా ప్రశాంతత కొరవడుతోంది. కోపం, అసహనం, అసూయ, స్వార్థం, వ్యసనాలు కుటుంబాలను, సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అయ్యప్ప దీక్ష అందించే సందేశం మరింత ప్రాధాన్యత సంతరించుకుంటోంది.

మాల ధరించినప్పుడు మాత్రమే మంచి మాటలు మాట్లాడి, దీక్ష ముగిసిన తర్వాత పాత అలవాట్లకు తిరిగి వెళ్లడం భక్తి పరమార్థం కాదు. నలుగురితో మంచిగా ఉండటం, తల్లిదండ్రులను గౌరవించడం, మహిళలను గౌరవించడం, పేదలకు సహాయం చేయడం, పర్యావరణాన్ని కాపాడటం వంటి విలువలను జీవితంలో భాగం చేసుకోవాలి.

అయ్యప్ప స్వామి సన్నిధికి చేరుకోవడం ఒక యాత్ర అయితే.. మనలోని అహంకారాన్ని జయించడం అసలైన ఆధ్యాత్మిక ప్రయాణం. మెడలోని మాల మనకు దీక్షను గుర్తుచేయాలి. నోట పలికే శరణుఘోష మన ప్రవర్తనలో కనిపించాలి. నుదుటి విభూతి కంటే మన హృదయంలోని పవిత్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. చివరగా ఒక్కమాట..

అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి శబరిమల వెళ్లడం గొప్ప అనుభూతి. కానీ శబరిమల నుంచి తిరిగి వచ్చిన తర్వాత మనిషిగా మరింత మంచివారిగా మారితేనే ఆ యాత్రకు పరిపూర్ణత లభిస్తుంది. మాల మెడలో ఉన్నన్ని రోజులే కాదు.. మానవత్వం మనసులో ఉన్నంతకాలం అయ్యప్ప దీక్ష కొనసాగాలి. స్వామియే శరణం అయ్యప్ప!

-ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170.





ఎదురయ్యే ప్రతిసారీ నువ్వో కొత్త అనుభవం

ఆ కళ్లు నన్ను ఎప్పుడైనా గమనించాయో లేదో తెలియదు...
నా ఉనికి వాటి జ్ఞాపకాలలో ఏ మూలనైనా ఉందో లేదో తెలియదు...
కానీ ఎందుకో,
ప్రతిరోజూ నా ఆలోచనల ప్రయాణం
వచ్చి ఆ చూపుల దగ్గరే ఆగిపోతుంది.

పలకరింపు లేని పరిచయం అది...
మాటలు లేని సంభాషణ అది...
కలవని దారుల్లోనూ
ఎక్కడో కలిసిపోయిన రెండు మనసుల ఊహ అది...

వాటితో నాకు ఎలాంటి అనుబంధం ఉందో తెలియదు,
కానీ వాటిని తలచుకున్న ప్రతిసారీ
నా మనసులో ఏదో తెలియని ప్రశాంతత...
మరేదో చెప్పలేని ఆనందం!

ఆ కళ్లు ఒక్క క్షణమైనా నన్ను చేరితే,
ఆ క్షణానికే ఓ జీవితకాలపు అర్థం దొరికినట్టుంటుంది.
ఆ చూపుల్లో నాకోసం ఏమీ లేకపోయినా,
నా ఊహలన్నీ మాత్రం వాటి చుట్టూనే అల్లుకుంటాయి.

బహుశా...
వాటి ప్రపంచంలో నేను ఓ చిన్న అపరిచితురాలినేమో!
నా ఉనికి వాటికి ఓ సాధారణ దృశ్యమే కావచ్చు!

కానీ నా ప్రపంచంలో మాత్రం...
ఆ కళ్లు కేవలం రెండు కళ్లు కావు...
నా మౌనానికి అర్థం చెప్పే అక్షరాలు,
నా ఊహలకు రెక్కలిచ్చే ఆకాశం,
నా మనసు ప్రతిరోజూ వెతుక్కునే ఓ అందమైన అనుభూతి!

కొన్ని బంధాలకు పేర్లు అవసరం లేదు...
కొన్ని అనుభూతులకు పరిచయాలు అక్కర్లేదు...
ఎందుకంటే, మనసుకు నచ్చిన కొన్ని ప్రపంచాలు
మనల్ని చేరకపోయినా...
మనలోనే శాశ్వతంగా నిలిచిపోతాయి!

- ప్రియా. గోలి..



ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కామారెడ్డి ప్రతినిధి, నవంబర్ 17 (సింగిడి)

కామారెడ్డి: వానాకాలం (ఖరీఫ్) 2026-27 సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి, కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను నిర్ణిత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని, రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని ఆదేశించారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా మేనేజర్ , స్టేట్ వేర్‌హౌస్ మేనేజర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మామునూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన వరంగల్ సీపీ



హనుమకొండ ప్రతినిధి ప్రతినిధి నవంబర్ 17 (సింగిడి)

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ మంగళవారం నాడు మామునూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను, పెండింగ్ కేసుల వివరాలను, కేసుల దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణను సమీక్షించి పలు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నాణ్యమైన దర్యాప్తుతో కేసులను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, అనుమానితులపై నిరంతరం నిఘా ఉంచుతూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పోలీస్ సిబ్బందికి సీపీ సూచించారు ఈ తనిఖీలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, పర్వతగిరి సీఐ ఆర్.సంతోష్ కుమార్, మామునూరు ఇన్‌స్పెక్టర్ ఈ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూసీఎఫ్ ప్రాజెక్టుల అనుమతులు పూర్తి చేయాలి

కరీంనగర్, నవంబర్17(సింగిడి)

నగరపాలక సంస్థ పరిధిలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక అనుమతులు, రుణ ఒప్పంద ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ హడ్కో ప్రతినిధులను ఆదేశించారు.మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి హడ్కో ప్రతినిధులతో నిర్వహించిన దృశ్యమాధ్యమ సమీక్షలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల అనుమతులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. నగర మౌలిక వసతుల అభివృద్ధికి యూసీఎఫ్ ప్రాజెక్టులు కీలకమని, పనులు త్వరగా ప్రారంభించేలా ఇంజినీరింగ్ అధికారులు, సంస్థ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.సమావేశంలో డీఈ దేవేందర్‌రెడ్డి, ఏఈ సతీష్, జేఏఓ, హడ్కో ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సద్బుద్ధి అవసరం

కరీంనగర్, నవంబర్17(సింగిడి)

విద్యతోపాటు సంస్కారం, సద్బుద్ధి అలవర్చుకుంటేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ప్రముఖ కాలమిస్టు, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు.దౌల్తాబాద్ మండలం లింగరాజుపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ, స్పష్టమైన లక్ష్యాలతో క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. పేదరికం చదువుకు అడ్డంకి కాదని, కృషితో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు.లీడ్ ఇండియా-2047 సంస్థ ప్రతినిధులు శ్రీనివాసాచారి, ఎం. చిరంజీవులు డిజిటల్ యుగంలోని సవాళ్లను అధిగమించే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలి
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్డుల ఆవిష్కరణ

పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 17 (సింగిడి)





జిల్లాలో ముస్తాబాద్ మండలంఅంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెడతారని, వారిని ప్రతి రోజూ కేంద్రాలకు పంపించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.ముస్తాబాద్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పది నిమిషాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా అంగన్వాడి కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువును పరిశీలిస్తుండగా తనిఖీ చేశారు. సామ్, మామ్ పిల్లలపై ఆరా తీశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయగా, పరిశీలించారు. పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్డులను ఆవిష్కరించారు. ప్రాథమిక పాఠశాలలో తనిఖీఅక్కడే ఉన్న ప్రాథమిక పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన యూనిఫాంలు వేసుకున్న విద్యార్థులతో మాట్లాడారు. గణితం, ఇతర అంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా పోషణ మాసం ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలు పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి మంగళవారం పది నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాల సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ, వసతుల పెంపు తదితర అంశాలపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు.ప్రతి రోజూ తల్లిదండ్రులు బాధ్యతగా ఆరేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా తీసుకెళ్లాలని వారి ఎత్తు, బరువు సమోదు చేయించాలని దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని స్పష్టం చేశారు.అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. బాలల మొదటి వెయ్యి రోజుల దశ కీలకమని, వారికి సరైన పోషకాహారం ఇంట్లో సైతం ఇవ్వాలని సూచించారు. త్వరలో ఎనిమియా ముక్త్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. సర్పంచులు అంగన్వాడీ కేంద్రాల్లో పరిశీలించాలని, సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. తల్లులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలిరక్త హీనతతో ఉన్న మహిళలు ప్రతి ఆరు నెలల ఒకసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రంఎందుగుదల లోపాలు గల పిల్లలు, చెవిటి, మూగ, మానసిక బుద్ధి మాంద్యం గల, నడవలేని వాళ్లు, పుట్టుకతో వచ్చే లోపల గల పిల్లలు, మెదడు సంబంధించిన సమస్యలు, సరిగా మాట్లాడ లేని పిల్లలు, రక్తహీనత పోషకాహారం లోపం గల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల వారి సమాచారంతో వైద్యులు వివిధ పరీక్షలు చేసి పిల్లలలోని లోపాన్ని గుర్తిస్తారని తెలిపారు. ఆర్ బీ ఎస్ కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు. కరీంనగర్ లో ఎన్ఆర్సీ కేంద్రంలో సేవలు అందిస్తారని, ఉన్నత వైద్య సేవలు హైదరాబాద్లో అందిస్తారని వెల్లడించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ రెడ్డి, సెస్ డైరెక్టర్ అంజి రెడ్డి, సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి నిర్మల, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న పంటల సాగు.. మెరుగైన ఆదాయం

డ్రిప్ ఇరిగేషన్ తో నీటిసద్వినియోగం
ఐదు రకాల కూరగాయల సాగు
నిరంతర ఆదాయం
ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామంలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి
నవంబర్ 17 (సింగిడి)





వరి సాగును వదిలి.. విభిన్నమైన పంటలు సాగు చేస్తూ మెరుగైన ఆదాయం పొందుతున్నారు. మూడెకరాల్లో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో నీటిని సద్వినియోగం చేసుకుంటూ ఐదు రకాల పంటలు సాగు చేస్తూ చేస్తున్నారు. ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామంలో చింతలకుల చంద్రం సాగు చేస్తున్న పంటలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయి పరిశీలించి అభినందించారు.ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామానికి చెందిన రైతు చింతలకుల చంద్రం సాంప్రదాయంగా సాగు చేస్తున్న వరిని వదిలి కూరగాయలు పండిస్తున్నారు. ఫామ్ ఫాండ్ ఏర్పాటు చేసుకుని దానికి డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ ఏర్పాటు చేసి మూడు ఎకరాల విస్తీర్ణంలో దోసకాయ, కాకరకాయ, బీరకాయ, టమాట, పచ్చిమిర్చి, వేరు శెనగ సాగు చేస్తున్నారు. నీటిని సద్వినియోగం చేసుకుంటూ.. ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు సాగు చేస్తూ నిరంతరం ఆదాయం వచ్చేలా ముందుకు సాగుతున్నారు. ఎక్కడ విక్రయిస్తారు..?ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామానికి చెందిన రైతు చింతలకుల చంద్రం ఆదర్శంగా కూరగాయల సాగు చేస్తుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించి.. సాగు విధానాన్ని తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో వేశారు? దిగుబడి ఎంత వస్తుంది? ఎక్కడ విక్రయిస్తారు? ఆదాయం ఎంత వస్తుందని రైతును ఆరా తీశారు. తనకు మూడు ఎకరాల్లో వివిధ రకాల కూరగాయల సాగుతో ఏడాదికి రూ.3 నుంచి నాలుగు లక్షల ఆదాయం వస్తుందని, పంట ఉత్పత్తులు ముస్తాబాద్, సిరిసిల్లలో విక్రయిస్తామని జిల్లా కలెక్టర్ దృష్టికి రైతు తీసుకువెళ్ళారు.కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, వ్యవసాయ శాఖ అధికారి ప్రదీప్, తహసీల్దార్ ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.



నాలాల కబ్జాపై పుర పాలక సంఘం ముట్టడి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 17 (సింగిడి)

ఏ ఐ ఎఫ్ టి యు న్యూ ఆధ్వర్యంలో సిరిసిల్ల కొత్తచెరువు నాలాల కబ్జాలు తొలగించి పూడిక తీయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించడం జరిగింది. ఏఐ ఎఫ్ టి యు న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ గత అనేక సంవత్సరాల నుంచి కొత్తచెరువు నాళాలుకబ్జా గురి అవుతున్నాయని వాటిని కాపాడాలని వాటి పూడికతీత పనులు చేపట్టాలని గతంలో ఏదైతే పూర్వపు నాళాలు ఎలా ఉండేదో అలాగే తీయాలని అట్టి సర్వే నెంబర్లు గుర్తించి సర్వేనెంబర్ 39 లో ఉన్న రొడ్డం పునర్నిర్మించి శాంతినగర్ ప్రజల శ్రీనగర్ కాలనీవాసుల కష్టాలను తొలగించాలని అధికారులు వెంటనే స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకొని వెంటనే పనులు చేపట్టాలని గత కొద్ది రోజులుగా ఉద్యమం ఉదృతం అవుతున్న అధికారుల్లో చలనం రాక రాజకీయ నాయకుల పట్టింపు లేక ఇక్కడి ప్రజలను కేవలం ఓట్లు వేసి ఓటరుగానే గుర్తిస్తూ ఐదు సంవత్సరాలకొచ్చే ఓట్ల కోసం ఎదురుచూస్తారే తప్ప ప్రజల కష్టసుఖాలు పాలుపంచుకోరు స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ చెరువు కాలువను తాత్కాలికంగా కచ్చా కాలువ కొద్ది రోజుల మందమే అని తీపించి పరోక్షముంపునకు ఇక్కడి ప్రజలను గురిచేసి సమస్యను జటిలం చేసి కూర్చున్నారు ఇక్కడ ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ మౌనవ్రతం చేస్తూ ఇక్కడ ప్రజలు కష్టాల్లో ఉన్న యదేచ్ఛగా చెరువు నాళాలు కబ్జా గురి అవుతున్న రోడ్లకు అడ్డంగా భవనాలు నిర్మిస్తున్న ఇంకా అనేక అక్రమాలు జరుగుతున్న పట్టనట్లుగా ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండా శ్యామ్,ఆకన సత్తయ్య,గుజ్జ దేవదాస్, పంతం సుజాత, తడిగొప్పుల వజ్రవ్వ, గడదాసు లతా, సోమిరెడ్డి సుజాత ఇంకా సుమారు వంద మంది మహిళలు పాల్గొన్నారు

సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులు ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దు
వైద్య విద్యార్థులు ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉత్తమ డాక్టర్లుగా ఎదగాలి
విద్యార్థుల ప్రవర్తనపై కళాశాల యాజమాన్యం పర్యవేక్షణ ఉండాలి
జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 17 (సింగిడి)





ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్‌లైన్ వేదికలను అధికంగా వినియోగిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండలని,ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ వైద్యులుగా ఎదగాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు.జిల్లా పరిధిలోని మెడికల్ కాలేజ్ వైద్య విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా ఎస్పీ పాల్గొని అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులతో కలిసి గంజాయి, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియాలో కనిపించే ప్రతి సమాచారం నిజమని నమ్మ వద్దని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు, మెసేజ్‌లు, అనుమానాస్పద లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, కుటుంబ సమాచారం, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు.సైబర్ నేరగాళ్లు విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని నకిలీ ఉద్యోగ ప్రకటనలు, బహుమతుల ఆశలు, ఫేక్ సోషల్ మీడియా అకౌంట్లు, ఆన్‌లైన్ గేమింగ్ , డిజిటల్ అరెస్ట్, తదితర మార్గాల్లో మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు.ఏదైనా అనుమానాస్పద సమాచారం లేదా ఆన్‌లైన్ వేధింపులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.మొబైల్ ఫోన్‌ను చెడు మార్గాలకు కాకుండా, మంచి పనులకు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు.సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.కళాశాల ఆవరణలో సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా అందరూ స్నేహపూర్వక వాతావరణంలో విద్యను అభ్యసించాలని, ర్యాగింగ్ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందని,వాటి జోలికి వెళ్లకూడదని , తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని , మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చడంలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలన్నారు.వైద్య విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కష్టపడి చదివి ఉత్తమ వైద్యులుగా ఎదగాలని, కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.కళాశాల యాజమాన్యం విద్యార్థుల నడవడికను నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని , ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్ కి గురైతే వెంటనే కళశాలలో ఏర్పాటు చేసిన యాంటీ ర్యాగింగ్ కమిటీ దృష్టికి తీసుకవెళ్లని సూచించారు.ఎవరైనా ర్యాగింగ్ కి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉండాలని, ద్విచక్ర నడిపే సమయాల్లో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉంటూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు.విద్యార్థినుల భద్రత కోసం జిల్లా షీ టీం పకడ్బందీగా పనిచేస్తుందని, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే షీ టీం నంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.అనంతరం వైద్య విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాల వలన కలుగు అనర్థాలపై స్కిట్ ద్వారా మిగతా విద్యార్థులకు అవగాహన కల్పించారు.అవగాహన సదస్సులో పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కలశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కలశాల అధ్యాపకులు, సైబర్ ఆర్.ఎస్.ఐ జునైద్, సైబర్ సిబ్బంది గంగారెడ్డి, మహేష్, కిట్టు , అభిషేక్, విజేయ్ , వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా గోపాష్టమి వేడుకలు



వేములవాడ నవంబర్ 17(సింగిడి)

వేములవాడ: కార్తీక శుద్ధ అష్టమి గోపాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ వి హెచ్ పి ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని శ్రీ గాయత్రి దేవాలయంలో గోపూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రాసం సమర్పించారు. భారతీయ సంస్కృతిలో గోవుకు ఉన్న విశిష్ట స్థానాన్ని వివరిస్తూ, ప్రతి ఒక్కరూ గోసంరక్షణకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా విశ్వహిందూ పరిషత్ నూతన గోరక్ష ప్రముఖ్‌గా గన్నమనేని ప్రదీప్ రావు నియమితులైనట్లు నాయకులు ప్రకటించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన క్షేత్ర ప్రముఖ్ గుమ్మల సత్యం జీ, విభాగ్ సహ కార్యదర్శి గజం రాజు, జిల్లా కార్యదర్శి గడప కిషోర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు నాగుల రాము గౌడ్ కు గన్నమనేని ప్రదీప్ రావు ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్షేత్ర ప్రముఖ్ గుమ్మల సత్యం, విభాగ్ సహ కార్యదర్శి గజం రాజు, జిల్లా కార్యదర్శి గడప కిషోర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు నాగుల రాము గౌడ్, వేములవాడ పట్టణ అధ్యక్షులు పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి గుండోజు గోపాల్ గార్లతో పాటు సనుగుల భాస్కర్, తిప్పర్తి సాయి కృష్ణ, తిప్పర్తి రమేష్, దండి గణేష్, కొక్కు గోపాలకృష్ణ, నంది శివ కుమార్, తదితర కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మార్కెట్ పాలకవర్గం.. ఛాంబర్ ఆఫ్ కామర్స్ మధ్య ఒప్పందం!

నాలుగు రోజులుగా కొనసాగిన ప్రతిష్టంభనకు ముగింపు
ఊపిరి పీల్చుకున్న రైతులు

వరంగల్ ప్రతినిధి
నవంబర్ 17 (సింగిడి)



వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. మార్కెట్ పాలక వర్గం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల మధ్య చర్చలు జరగడంతో ఇరు వర్గాల మధ్య ఒప్పందం కుదిరింది.ఇరువర్గాల మధ్య నెలకొన్న వివాదం కారణంగా మార్కెట్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులు విక్రయాలు జరగకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. నాలుగు రోజులుగా కొనసాగిన ఈ పరిస్థితి రైతులకు శాపంగా మారింది.ఈ నేపథ్యంలో మార్కెట్ పాలకవర్గం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు చర్చలు జరిపి వివాదానికి పరిష్కారం కనుగొన్నారు. ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదరడంతో మార్కెట్‌లో నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడినట్లయింది.అయితే ఈ వివాదం కారణంగా నష్టపోయిన రైతులకు న్యాయం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు, మార్కెట్ పాలకవర్గం తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా మార్కెట్ కార్యకలాపాలు సజావుగా కొనసాగించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు

ఎల్లారెడ్డి అభివృద్ధికి 13 ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 17(సింగిడి)

ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మరోసారి అధికార యంత్రాంగం దృష్టిని ప్రజా సమస్యల వైపు మళ్లించారు. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఐఏఎస్‌ను కలిసి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న 13 ప్రధాన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పేద కుటుంబాల అవసరాలు, మహిళా సంఘాలకు సంబంధించిన అంశాలను కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి స్థలాల కేటాయింపు, రైతుల భూ సమస్యల పరిష్కారం, అర్హులైన రైతులకు పట్టాదార్ పాస్‌బుక్‌ల జారీ, నకిలీ విత్తనాల విక్రయాల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు, నిరుపేదలకు ఇంటి స్థలాల కేటాయింపు, జర్నలిస్టుల సంక్షేమానికి అవసరమైన చర్యలు, వివిధ గ్రామాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.రైతులకు ప్రయోజనం చేకూరేలా మొక్కజొన్న, జొన్న పంటల కొనుగోలు పరిమితులను పెంచాలని, ఖాళీగా ఉన్న రేషన్ షాప్ డీలర్ పో



హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కరీంనగర్, నవంబర్17(సింగిడి)

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక ప్రతులను చింపి చెత్తబుట్టలో వేసి నిరసన తెలిపారు.అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా హామీలను నెరవేర్చలేదని ఆరోపించిన గంగుల, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విదేశీ ప్రతినిధి వ్యాఖ్యలపై బీజేపీ ఫిర్యాదు

కరీంనగర్, నవంబర్17(సింగిడి)

హైదరాబాద్‌లో జరిగిన 'భారత్ సమ్మిట్–2026'లో యూరోపియన్ సోషలిస్టుల పార్టీ ప్రధాన కార్యదర్శి జియాకోమో ఫిలిబెక్ చేసిన రాజకీయ వ్యాఖ్యలపై బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.భారత అంతర్గత రాజకీయాల్లో విదేశీ ప్రతినిధి జోక్యం చేసుకోవడం సరికాదని, ఆయన వీసా వివరాలు, సమ్మిట్‌లో చేసిన కార్యకలాపాలపై విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావుతో పాటు పలువురు జిల్లా నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాశాల స్థలం కబ్జా కాకుండా కాపాడాలి



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 17 (సింగిడి):

గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల స్థలం కబ్జాకు గురవుతోందని, అధికారులు వెంటనే స్పందించి దానిని రక్షించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. కళాశాల స్థల పరిరక్షణ కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రీతం మాట్లాడుతూ కళాశాల ప్రహరీకి ఆనుకుని ఉన్న పాత దుకాణాలను తొలగించి కొత్త సముదాయాలను నిర్మించే క్రమంలో ప్రధాన గేటు పక్కనున్న ప్రహరీని కూల్చివేశారని ఆరోపించారు. ఇప్పటికీ ఆ ప్రహరీని తిరిగి నిర్మించకపోవడం వెనుక స్థలాన్ని కబ్జా చేసే కుట్ర దాగి ఉందని ఆయన విమర్శించారు. స్థలం అన్యాక్రాంతం కాకముందే ప్రభుత్వం జోక్యం చేసుకుని, ప్రహరీని కూల్చిన వారిపై కఠినమైన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆసాల సంగీత్, రాజ్ కుమార్, సూర్య, నిశాంత్, సురేష్, రామకృష్ణ, నిఖిల్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి నవంబర్ 17 (సింగిడి)

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో బి ఏ డబ్ల్యు ఎన్ యూనిట్ సభ్యులు సుందరయ్యనగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ, ఎన్ డి పి ఎస్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. డి ఎ డబ్ల్యూ ఎన్ యూనిట్ సభ్యులు ప్యానెల్ లాయర్ కడగండ్ల తిరుపతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ. గంజాయి ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసం, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడతాయని వివరించారు.మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయం, కలిగి ఉండటం వంటి చర్యలకు సంబంధించి చట్టపరమైన నిబంధనలు, వాటిని ఉల్లంఘిస్తే ఎదురయ్యే శిక్షలు, పరిణామాల గురించి విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవయ్య, అధ్యాపక బృందం, సీనియర్ న్యాయవాదులు కుంట శ్రీనివాస్, నర్మేట రమేష్,అందె శ్రీను పారాలీగల్ వాలంటీర్ లావణ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలను అవమానించిన రాహుల్ గాంధీ

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 17(సింగిడి)

హైదరాబాద్‌లో నిర్వహించిన 'భారత్ సమ్మిట్ 2026' వేదికగా దేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో విదేశీ ప్రతినిధుల జోక్యాన్ని ప్రోత్సహించేలా వ్యవహరించడంపై బీజేపీ జిల్లా శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తో పాటు, పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్స్'పి ఈ ఎస్ సెక్రటరీ జనరల్ ఇటలీకి చెందిన జియాకోమో ఫిలిబెక్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి జిల్లా ఎస్పీ మహేష్ బిగిత్ను ఫిర్యాదు చేశారు. గోపి మాట్లాడుతూ దేశ ఎన్నికల ప్రక్రియ, రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వామ్య సంస్థల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజాసింగ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కిరణ్ నాయక్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు షేక్ సాబీర్, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వంతడుపుల సుధాకర్, జిల్లా నాయకులు గజ బింకర్ చందు, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ ప్రకాష్, యువ మోర్చా నాయకులు జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయం ఎవరి జాగీరు కాదు

కోట్లాది హిందువుల ఆరాధ్య దైవం!
గర్భగుడిని ముట్టుకోమని చెప్పి.. ఇప్పుడు శిఖరాన్ని తొలగించే ప్రయత్నం ఎందుకు?
ఆలయ అభివృద్ధి పనులపై పారదర్శకత ఏది?
మీడియా, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆలయంలోకి అనుమతి కల్పించాలి : బీజేపీ

వేములవాడ నవంబర్ 17(సింగిడి)

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పేరుతో జరుగుతున్న పనులు ఆలయ ప్రాచీన వైభవాన్ని, ఆగమ సంప్రదాయాలను, హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కొనసాగుతున్నాయని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డ బోయిన గోపి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో బిజెపి వేములవాడ పట్టణ అధ్యక్షులు శ్రీ రాపల్లి శ్రీధర్ ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి హాజరై మాట్లాడుతూ ఏడాది కాలంగా ఆలయ అభివృద్ధి పేరుతో జరుగుతున్న పనుల విషయంలో భారతీయ జనతా పార్టీ ఎంతో సంయమనం పాటించిందని తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని అధికార పార్టీ చేసిన విజ్ఞప్తికి అనుగుణంగా బీజేపీ కూడా సహకరిస్తూ వచ్చిందని, అయితే అభివృద్ధి పేరుతో ఆలయ పవిత్రతకు, ప్రాచీన నిర్మాణాలకు నష్టం కలిగించే చర్యలు చోటుచేసుకుంటుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి!

ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని గోపి పేర్కొన్నారు.

1. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది?
2. మంజూరైన నిధుల్లో ఇప్పటివరకు ఎంత మొత్తం ఖర్చు చేశారు?
3. ఏయే పనులకు ఎంతెంత నిధులు కేటాయించారు?
4. పనుల నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ ఎవరు? పనుల పర్యవేక్షణ బాధ్యత ఎవరిది?
5. గర్భగుడి శిఖరాన్ని తొలగించాల్సిన అవసరం ఏమొచ్చింది? దీనికి అనుమతి ఇచ్చింది ఎవరు?
6. శృంగేరి పీఠం నుంచి ఏయే నిర్మాణ పనులకు అనుమతులు తీసుకున్నారు? వాటికి సంబంధించిన పత్రాలను ఎందుకు బయటపెట్టడం లేదు?
7. ఆలయంలోని దక్షిణామూర్తి విగ్రహం, వెయ్యి స్తంభాల మండపం వంటి ప్రాచీన నిర్మాణాల ప్రస్తుత పరిస్థితి ఏమిటి?
8. ఆలయ అభివృద్ధి పనుల్లో ప్రాచీన కట్టడాల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?
9. అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తవుతాయి? ఆలయాన్ని భక్తులకు ఎప్పుడు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తారు?
10. పనులు పూర్తయ్యే వరకు భక్తులకు రాజన్న దర్శనం కల్పించేందుకు ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. వీటికి ప్రభుత్వం, ఆలయ అధికారులు ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆలయ అభివృద్ధి పేరుతో జరుగుతున్న పనుల్లో పారదర్శకత ఉండాలని, ఖర్చు చేసిన నిధులు, చేపట్టిన పనుల వివరాలను బహిరంగపరచాలని కోరారు. మీడియా ప్రతినిధులకు, అన్ని రాజకీయ పార్టీలకు ఆలయంలోకి ప్రవేశం కల్పించాలి. వీటీడీడీ వైస్ చైర్మన్, కలెక్టర్ కి బీజేపీ తరపున విజ్ఞప్తి చేస్తూ పనులను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం రాజకీయ పార్టీల ప్రతినిధులకు కల్పించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులపై ప్రశ్నలు అడిగితే అనుమతులు నిరాకరించడం, నాయకులను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. బీజేపీ నాయకుల అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు. రాజన్న ఆలయ పరిరక్షణే మా లక్ష్యం.. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని రెడ్డబోయిన గోపి హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సిరికొండ శ్రీనివాస్, పొన్నాల తిరుపతిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు రెగుల సంతోష్ బాబు, పట్టణ కౌన్సిలర్లు వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షులు షేక్ సాబీర్, రుద్రంగి మండల అధ్యక్షులు కర్ణబత్తుల వేణుగోపాల్, చందుర్తి మండల అధ్యక్షులు మోకిలే విజయేందర్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు వంతడుపుల సుధాకర్, మల్లారం తిరుపతి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సందేవేని రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి, బీజేపీ నాయకులు రెగుల రాజ్ కుమార్, రెగుల శ్రీకాంత్, మామిండ్ల లక్ష్మీరాజకుమార్, మంద రాజేందర్, పిన్నింటి హనుమాన్లు, బిల్లా కృష్ణ, గుడిసె మనోజ్ కుమార్, లాలా శేఖర్, ముదాం శంకర్, తోట శేఖర్, చేపూరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



రాజన్న ఆలయం ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు.. హిందూ సమాజం విశ్వాసానికి ప్రతీక!

స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అధికారులు ఒక విషయం గుర్తుంచుకోవాలని గోపి అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం ఎవరి వ్యక్తిగత జాగీరు కాదు. అది కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవం, పేదల పెన్నిధి, భక్తుల కొంగుబంగారం. ఆలయ అభివృద్ధి పేరుతో భక్తుల విశ్వాసాన్ని, ఆలయ ప్రాచీన వైభవాన్ని దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు.రాజన్న ఆలయ పవిత్రతకు భంగం కలిగించే నిర్ణయాలు తీసుకునే ముందు భక్తుల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులు, పాలకులపై ఉందని అన్నారు.

గర్భగుడిని ముట్టుకోమని చెప్పి.. గర్భగుడి శిఖరాన్ని ఎందుకు తొలగిస్తున్నారు?

గతంలో ఆలయ అభివృద్ధి పనుల సందర్భంగా గర్భగుడిని ముట్టుకోమని, దాని ప్రాచీన నిర్మాణానికి ఎలాంటి నష్టం కలిగించబోమని స్పష్టంగా చెప్పిన అధికారులు ఇప్పుడు గర్భ గుడి శిఖరాన్ని తొలగించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని గోపి ప్రశ్నించారు. తాజాగా తమ దృష్టికి వచ్చిన ఫొటోల్లో గర్భగుడి శిఖరాన్ని తొలగిస్తున్నట్లు కనిపిస్తోందని, ఇది భక్తుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఆలయ ఆగమ సంప్రదాయాలను, ప్రాచీన నిర్మాణాల పరిరక్షణను పరిగణనలోకి తీసుకున్నారా అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

గోపుర శిఖరం కనబడని పరిస్థితి ఎందుకు వచ్చింది?

ఆలయంలో చేపట్టిన స్లాబ్ నిర్మాణం వల్ల భక్తులు గోపుర శిఖరాన్ని దర్శించుకునే పరిస్థితి లేకుండా పోయిందని గోపి ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా చేపట్టిన నిర్మాణ పనుల్లో లోపాలు జరిగాయా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఉందా అధికారుల పర్యవేక్షణ లోపించిందా అనే విషయాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. చేసిన తప్పిదాలను సరిదిద్దాల్సింది పోయి, వాటిని కప్పిపుచ్చుకునేందుకు శృంగేరి పీఠాధిపతుల పేరును ప్రస్తావించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శృంగేరి పీఠం అనుమతి ఇచ్చిందని చెబుతున్న అధికారులు, అసలు ఏ పనులకు అనుమతి తీసుకున్నారు గర్భగుడిని ముట్టుకోకుండా గోపుర శిఖరాన్ని తొలగించేందుకు అనుమతి ఇచ్చారా పీఠం నుంచి లిఖితపూర్వక అనుమతి పొందారా అనుమతి పత్రాలను ప్రజలకు ఎందుకు చూపించడం లేదని నిలదీశారు. ఈ వ్యవహారంపై వాస్తవాలు తెలుసుకునేందుకు బీజేపీ నాయకులు స్వయంగా శృంగేరి వెళ్లి పీఠాధిపతులను కలిసి వివరాలు తెలుసుకుంటామని తెలిపారు. శృంగేరి పీఠాధిపతుల పేరును ఉపయోగించుకుని ఇక్కడ జరుగుతున్న తప్పిదాలకు వారిని బాధ్యులుగా చూపించే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు.

సీఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం
19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 17, (సింగిడి):

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 19న సిద్దిపేటకు రానున్న నేపథ్యంలో భారీ బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. సిద్దిపేట బైపాస్ రోడ్డులోని నాగదేవత ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణాన్ని సందర్శించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సభకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్, బారికేడింగ్, లైటింగ్, భద్రత, తాగునీరు తదితర సౌకర్యాలపై సూచనలు చేశారు. సభా వేదిక నిర్మాణంతో పాటు మిగిలిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభంఈ నెల 19న సిద్దిపేట వేదికగా



దేశంలోనే తొలిసారిగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని సైతం నిర్వహించనున్నారు. ప్రజాపాలన ప్రభుత్వం మూడేళ్లుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలపై సీఎం ప్రసంగించనున్నారని మంత్రి పొన్నం తెలిపారు.పది నియోజకవర్గాల నుంచి జనంసిద్దిపేట కేంద్రంగా నిర్వహించనున్న ఈ సభకు సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, జనగామ, హుస్నాబాద్, మానకొండూర్, సిరిసిల్ల, వేములవాడ, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలిరానున్నారని తెలిపారు.అంతకు ముందు సీఎం పాదయాత్ర ప్రారంభమయ్యే ముస్తాబాద్ చౌరస్తా ను జిల్లా కలెక్టర్ కె హైమావతి, సిపి రష్మీ పేరమల్ తో కలిసి పరిశీలించారు..ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, భవాని రెడ్డి, జిల్లా కలెక్టర్ కె హైమావతి, సిపి. రష్మీ పెరమల్, జిల్లా అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



దీక్షా దివాస్‌ను విజయవంతం చేయండి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 17 (సింగిడి)

ఈనేపథ్యంలో ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి మాజీ మంత్రివర్యులు ఎల్ రమణ కొండూరి రవీందర్ రావు. జిల్లా పార్టీ అధ్యక్షులు తోట ఆగయ్య మాట్లాడుతూ.. ఈనెల 29న కరీంనగర్ లో జరిగే దీక్ష దివాస్ కార్యక్రమానికి సిరిసిల్ల నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో తెలంగాణ వాదులు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో తుల ఉమా,గూడూరి ప్రవీణ్, న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి జిందం చక్రపాణి గుజ్జుల రాజిరెడ్డి పాప వెంకట్ స్వామి గౌడ్ బొంపల్లి సురేందర్‌రావు గజబింకార్ రాజన్న వర్ష కృష్ణారి మున్సిపల్ కౌన్సిలర్లు సెస్ డైరెక్టర్లు



ఫ్యాక్స్ చైర్మన్లు, సర్పంచులు మాజీ జెడ్పిటిసిలు మాజీ ఎంపీపీలు మాజీ కౌన్సిలర్లు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

నిరుపేదల సొంతింటి కలకు అండగా డాక్టర్ అజీనాయక్!

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముందుకొచ్చిన కేలోత్ హాజీ నాయక్
బిల్లుల ఆధారంగా ఇళ్ల నిర్మాణ బాధ్యత
కట్టుకోలేని పేదలకు నేనున్నానంటూ భరోసా

కామారెడ్డి ప్రతినిధి, (సింగిడి)గాంధారి:



సొంతింటి కల ప్రతి పేద కుటుంబానికి ఒక జీవితకాల స్వప్నం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు ఆశలు కల్పిస్తున్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందులు, నిర్మాణ ఖర్చులు భరించలేని పరిస్థితుల కారణంగా కొందరు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పేద కుటుంబాల పరిస్థితిని అర్థం చేసుకున్న గుండారం గ్రామానికి చెందిన డాక్టర్ కేలోత్ హాజీ నాయక్ మానవతా దృక్పథంతో ముందుకొచ్చి వారికి అండగా నిలుస్తున్నారు.గాంధారి మండలంలోని నిరుపేద ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితుల్లో ఉంటే, వారి తరఫున ఇళ్ల నిర్మాణ బాధ్యత తీసుకునేందుకు హాజీ నాయక్ ముందుకొచ్చారు. ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లుల ఆధారంగా ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి, పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కేలోత్ హాజీ నాయక్ మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామంలోనైనా ఇందిరమ్మ ఇల్లు మంజూరై ఆర్థిక పరిస్థితులు బాగాలేక నిర్మించుకోలేని నిరుపేద కుటుంబాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాంటి కుటుంబాలకు ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. గ్రామస్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇలాంటి సామాజిక బాధ్యతతో కూడిన ప్రయత్నాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని అభిప్రాయపడుతున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో భూముల రీ-సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 17 (సింగిడి):

గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ–సర్వే ప్రక్రియను ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మంగపేట, కిష్టంపేట గ్రామాల్లో, ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామంలో జరుగుతున్న రీ–సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే బృందాలకు రైతులు తమ భూముల వివరాలను అందించి పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. కేసనపల్లి, పోతారం గ్రామాల్లో రీ–సర్వేను త్వరగా పూర్తి చేసి రైతులకు నోటీసులు జారీ చేయాలని, అలాగే సర్వారం గ్రామంలో రీ–సర్వే సందర్భంగా దొర్లిన పొరపాట్లను వెంటనే సరిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారంలోని ఐకేపీ కేంద్రం, మొట్లపల్లి పీఏసీఎస్ కేంద్రంతో పాటు ముత్తారం మండలం



పారుపల్లిలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. వానాకాలం పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు ఏడు రకాల సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తోందని, దీనివల్ల రైతులకు క్వింటాలుకు సుమారు రూ. 2,961 ధర లభిస్తుందని ఆయన వివరించారు. ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోకుండా ప్రభుత్వ కేంద్రాలనే సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు నిర్దేశిత తేమ శాతం వచ్చేలా ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని, నాణ్యమైన ధాన్యాన్ని అధికారులు వెంటనే కొనుగోలు చేసి సకాలంలో చెల్లింపులు జరపాలని సూచించారు.ముత్తారం మండలంలోని నూతన తహసిల్దార్ కార్యాలయం, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాలను కూడా కలెక్టర్ సందర్శించారు. నూతన తహసిల్దార్ కార్యాలయంలో మిగిలి ఉన్న పార్టిషన్, చిన్నపాటి ప్యాచ్‌వర్క్ పనులను త్వరగా పూర్తి చేయాలని, కార్యాలయం ప్రారంభించిన పది రోజుల తర్వాత తుది బిల్లు చెల్లింపు ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే, పాత తహసిల్దార్ కార్యాలయ భవనాన్ని గ్రంథాలయానికి కేటాయించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ రాముడు, ముత్తారం తహసిల్దార్ ఆంజనేయులు, గిర్దావర్ వినోద్, స్థానిక సర్పంచ్‌లు శ్రీనివాస్, భాగ్యలక్ష్మి , మనోహర్ రావు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసేవకే కాంగ్రెస్ ప్రభుత్వం పునరంకితం

మానకొండూరు,నవంబర్17(సింగిడి)

బీఆర్ఎస్ పాలనలో అణచివేతకు, నిరాదరణకు గురైన ప్రజలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.మంగళవారం మానకొండూరు–ముంజంపల్లి మార్గంలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో చేయూత పథకం కింద కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలకులు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించారని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందకుండా చేశారని ఆరోపించారు. ఇందిరాగాంధీ, వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని గుర్తుచేశారు. అప్పటి నుంచి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల కలను సాకారం చేసేందుకు ము

పిల్లల మెదడు కబళిస్తున్న స్మార్ట్‌ఫోన్

సాయంత్రం ఏడు గంటల వేళ.. ఆఫీసు నుంచి తలనొప్పితో ఇంటికి వచ్చిన రమేష్, కూరగాయల సంచి పక్కన పెట్టి కాసేపు విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు. ఇంతలో ఎనిమిదేళ్ల కూతురు "నాకు ఏమీ తోచడం లేదు నాన్నా" అంటూ మారాం చేయడం మొదలుపెట్టింది.

టీవీ బోర్ కొట్టింది, హోంవర్క్ పూర్తయింది.. అమ్మ వంటగదిలో బిజీగా ఉంది. కోట్లాది మంది అలసిపోయిన తండ్రుల్లాగే రమేష్ కూడా తన జేబులోంచి ఫోన్ తీసి, ఒక కార్టూన్ పెట్టి కూతురి చేతికి ఇచ్చాడు.

ఇల్లంతా ఒక్కసారిగా నిశ్శబ్దమైంది. రమేష్ కళ్లు మూసుకుని కూర్చున్నాడు. కానీ, కుక్కర్ విజిల్ మోగేలోపు ఒక కార్టూన్ ముగిసి, ఆటోప్లేలో మరో కార్టూన్ మొదలైంది. రమేష్ తనకు దొరికిన ఆ ఇరవై నిమిషాల ప్రశాంతత కోసం, తన కూతురి ఆలోచనా ప్రపంచాన్ని ఒక చిన్న తెరకు అప్పగించాడు.

అధికారిక లెక్కలే లేని ఆందోళన

ప్రతి చిన్న విషయాన్ని లెక్కగట్టే ఈ డిజిటల్ యుగంలో, మన పిల్లలు రోజుకు ఎన్ని గంటలు ఫోన్లు, ట్యాబ్‌ల ముందు గడుపుతున్నారనే దానిపై భారతదేశం వద్ద కచ్చితమైన జాతీయ గణాంకాలు లేవు.

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వే (Economic Survey 2025-26) సైతం ఈ విషయాన్ని నిజాయితీగా అంగీకరించింది. పిల్లలు, యువతలో డిజిటల్ వ్యసనం (Digital Addiction) తీవ్ర ఆందోళనకరంగా మారుతోందని పేర్కొన్నప్పటికీ, ఎంతమంది దీని బారిన పడ్డారనే స్పష్టమైన డేటా లేదని తెలిపింది.

మరోవైపు లోకల్ సర్కిల్స్ (LocalCircles) నిర్వహించిన సర్వే ప్రకారం, దేశంలో ప్రతి ఇద్దరు తల్లిదండ్రులలో ఒకరు తమ పిల్లలు సోషల్ మీడియా, ఓటీటీ లేదా గేమింగ్‌కు బానిసలయ్యారని భావిస్తున్నారు.

మానసిక ఆరోగ్యం స్క్రీన్ సమయం పెరగడం, ముఖాముఖి సంబంధాలు తగ్గడం వల్ల పిల్లల్లో మానసిక బలహీనత పెరుగుతోంది.

ఆన్‌లైన్ ఉచ్చులు తల్లిదండ్రుల కంటపడకుండా పిల్లలు సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్/గ్యాంబ్లింగ్ యాప్‌ల బారిన పడే ప్రమాదం ఉంది.

నిద్రలేమి & ఏకాగ్రత రాత్రంతా ఫోన్లు చూడటం వల్ల నిద్ర కరువై, తరగతి గదిలో పాఠాలపై ఏకాగ్రత నిలపలేక పిల్లలు కునుకుపాట్లు పడుతున్నారు.



'బోర్ కొట్టడం' కూడా పిల్లల ఎదుగుదలకు అవసరమే!

రమేష్ కూతురు ఇప్పుడు ఏం చేయాలి? అని అడగడం మానేసింది. ఇక్కడే అసలు సమస్య మొదలైంది.

ఖాళీగా ఉన్న మధ్యాహ్నం లేదా బోర్ కొట్టే సమయం అనేది వృథా కాదు. అక్కడే పిల్లల సృజనాత్మకత పుడుతుంది. ఒక అగ్గిపెట్టెను పడవగా ఊహించుకోవడం, ఆకాశంలోని మేఘాల్లో కథలు అల్లుకోవడం ఆ ఖాళీ సమయాల్లోనే సాధ్యమవుతుంది.

వేచి చూడటం (Waiting) అనేది పిల్లలకు సహనాన్ని నేర్పుతుంది. కానీ స్మార్ట్‌ఫోన్ ప్రతి సెకనుకు ఒక కొత్త దృశ్యాన్ని, తక్షణ ఆనందాన్ని ఇస్తూ, పిల్లల మెదడు తనంతట తాను ఆలోచించి ఎదిగే క్షణాలను దొంగిలిస్తోంది.

రమేష్ కళ్లు తెరిచి చూసినప్పుడు, వెలుగుతున్న ఫోన్ తెరపై వంగిపోయి, తన తండ్రిని కూడా గమనించలేనంతగా మునిగిపోయిన కూతురు కనిపించింది. అతనికి ఒక్కసారిగా తన చిన్ననాటి సుదీర్ఘమైన మధ్యాహ్నాలు, ఏమీ లేని ఆ ఖాళీ సమయాల్లో తను సృష్టించుకున్న ఆటలు గుర్తుకొచ్చాయి.

చిన్నప్పుడు మీకు ఏమీ తోచని ఖాళీ మధ్యాహ్నాలలో మీరు ఏం చేసేవారు? నేటి మన పిల్లలకు ఆ స్వేచ్ఛను మనం ఇస్తున్నామా?.

పరిష్కారం నిషేధం కాదు.. నియంత్రణ!

ఫోన్‌ను పూర్తిగా నిషేధించాలని ఎవరూ కోరడం లేదు.. ఎందుకంటే అదే పరికరం పిల్లలకు ఒక గ్రంథాలయంగా, ఉపాధ్యాయుడిగా, ప్రపంచాన్ని చూపే మ్యాప్‌గా ఉపయోగపడుతుంది. సమస్య తెర ఉండటంలో కాదు, ఆ తెర ఎవరి అదుపులో ఉందనే దానిలోనే ఉంది.

తల్లిదండ్రుల ఆదర్శం: భోజనం చేసేటప్పుడు "ఫోన్లు చూడొద్దు" అని పిల్లలకు చెబుతూ, తల్లిదండ్రులు తమ మెసేజ్‌లు చెక్ చేసుకుంటే పిల్లలు రెండో పాఠాన్నే నేర్చుకుంటారు. పిల్లలు మనం చెప్పే మాటల కంటే, మనం చేసే పనులనే ఎక్కువగా అనుకరిస్తారు.

ఆచరణాత్మక మార్పులు: ఇంట్లో 'ఫోన్-ఫ్రీ జోన్లు' ఏర్పాటు చేయడం, చిన్న పిల్లలకు సాధారణ ఫోన్లు ఇవ్వడం, చదువుకు మాత్రమే పరిమితమైన ట్యాబ్‌లు వాడటం, పాఠశాలల్లో ఆన్‌లైన్ భద్రతపై పాఠాలు చెప్పడం మరియు యాప్ కంపెనీలు వయసు నిర్ధారణ (Age Verification) విషయంలో బాధ్యత వహించడం అత్యవసరం.

ఛాయ్.. బిస్కెట్

టీ, బిస్కెట్లు తినడం అప్పటికప్పుడు ఆకలిని తగ్గించినా.. శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో మాత్రం వెనుకబడతాయి. ముఖ్యంగా ప్యాకెట్ బిస్కెట్లలో మైదా, చక్కెర, కొవ్వులు అధికంగా ఉంటాయి.

తీపి కలిపిన టీ కూడా శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం చూపుతుంది. ప్రొటీన్లు, ఫైబర్ తక్కువగా ఉండే ఇలాంటి అల్పాహారం రోజువారీ శక్తి, ఆకలి నియంత్రణ, జీవక్రియపై ప్రభావం చూపవచ్చు. కన్సల్టెంట్ డైటీషియన్, డయాబెటిస్ ఎడ్యుకేటర్ కనికా మల్హోత్రా తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం టీతో పాటు మైదాతో తయారైన బిస్కెట్లు, చక్కెర కలిపిన పానీయాలు తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. ఈ పెరుగుదలను నియంత్రించేందుకు శరీరం ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఇలాంటి ఆహారపు అలవాట్లు తరచుగా కొనసాగితే కొంతమందిలో ఇన్సులిన్ నిరోధకత (Insulin Resistance) వచ్చే ప్రమాదం పెరగవచ్చని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు, బిస్కెట్లలో ఫైబర్, ప్రొటీన్లు తక్కువగా ఉండటం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన ఉండదు. ఉదయం 10 గంటలకే మళ్లీ ఆకలి వేయడం, అలసట, చిరాకు, ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఇప్పటికే ప్రీడయాబెటిస్ ఉన్నవారు ఇలాంటి ఆహారపు అలవాట్ల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.

నెల రోజుల పాటు ఇదే అలవాటు ఉంటే పోషకాల లోపం వస్తుందా?

టీ, బిస్కెట్లను మాత్రమే అల్పాహారంగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందకుండా పోవచ్చు. ముఖ్యంగా ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, విటమిన్లు, ఖనిజ లవణాల కొరత ఏర్పడే అవకాశం ఉంటుంది.

ప్రొటీన్ల కొరత: కండరాల నిర్మాణం, మరమ్మతులకు ప్రొటీన్లు ఎంతో అవసరం. అల్పాహారంలో ప్రొటీన్లు లేకపోతే కండరాల ఆరోగ్యంపై ప్రభావం పడవచ్చు. అలాగే త్వరగా ఆకలి వేయడానికి కూడా ఇది ఒక కారణం కావచ్చు.



జీర్ణ సమస్యలు: బిస్కెట్లలో ఫైబర్ తక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియకు అవసరమైన పీచు పదార్థాలు అందవు. దీంతో కొంతమందిలో మలబద్ధకం వంటి సమస్యలు రావచ్చు.

ఐరన్ శోషణపై ప్రభావం: టీలో ఉండే టానిన్లు ఆహారం ద్వారా లభించే ఐరన్ శోషణను తగ్గించవచ్చు. ముఖ్యంగా ఐరన్ లోపం ఉన్నవారు భోజనంతో పాటు టీ తాగకుండా జాగ్రత్తపడాలి.

అలసట, ఎముకల ఆరోగ్యం: సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వల్ల బి విటమిన్లు, కాల్షియం వంటి పోషకాలు తగినంతగా అందకపోవచ్చు. దీర్ఘకాలంలో ఇది ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు.

బరువు పెరిగే ప్రమాదం: చక్కెర, కొవ్వులు అధికంగా ఉండే టీ, బిస్కెట్లను తరచూ ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు శరీరంలో చేరతాయి. ఇవి బరువు పెరగడానికి, కొలెస్ట్రాల్ సమస్యలకు దోహదపడవచ్చు.

ఉదయం టీతో బిస్కెట్లు తినడం అప్పుడప్పుడు పెద్ద సమస్య కాకపోవచ్చు. కానీ ప్రతిరోజూ వాటినే పూర్తి అల్పాహారంగా తీసుకోవడం మంచిది కాదు. ముఖ్యంగా ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని అల్పాహారంలో చేర్చుకోవాలి. ఉదయం టీ తాగే అలవాటును కొనసాగిస్తూనే బిస్కెట్ల స్థానంలో పోషకాలు ఉన్న ఆహారాన్ని ఎంచుకోవడం ద్వారా రోజంతా శక్తివంతంగా ఉండేందుకు సహాయపడుతుంది. చిన్న చిన్న ఆహారపు మార్పులే దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి.

నోట్: ఈ సమాచారం సాధారణ ఆరోగ్య అవగాహన కోసం మాత్రమే. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, మధుమేహం లేదా ఐరన్ లోపం వంటి సమస్యలు ఉన్నవారు డైటీషియన్ లేదా వైద్యుల సలహా మేరకు ఆహార మార్పులు చేసుకోవాలి.

అతివ Athiva Singidi

ఎన్నో ఔషధ గుణాలు ఉన్న ఆముదం నూనె

ఆముదం నూనెలో ఉండే ఆరోగ్య ప్రయోజనాల గురించి మనందరికీ తెలుసు. కానీ ఆముదం చెట్టు ఆకులలో కూడా అనేక రకాల ఔషధ గుణాలు ఉన్నాయని చాలా మందికి తెలియదు. ఆముదం ఆకులలో ఉండే యాంటీ-వైరల్, యాంటీ-ఇన్ఫ్లమేటరీ, హీలింగ్ గుణాలు శరీరంలోని నొప్పులు, వాపులు, గాయాలను నయం చేయడంలో అద్భుతంగా పనిచేస్తాయి. మన ఆరోగ్యానికి ఈ ఆకులు ఏ విధంగా ఉపయోగపడతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

కీళ్ల నొప్పులకు చక్కటి పరిష్కారం

వయసు పైబడటం వల్ల వచ్చే మోకాళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ వాపులను తగ్గించడంలో ఆముదం ఆకులు బాగా పనిచేస్తాయి. ఒక కడాయిలో 20 మి.లీ ఆవనూనెను వేడి చేసి, గోరువెచ్చగా ఉన్నప్పుడు ఒక ఆముదం ఆకును అందులో ముంచి నొప్పి ఉన్న మోకాళ్లపై ఉంచి, శుభ్రమైన తెల్లటి వస్త్రంతో కట్టు కట్టాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుముఖం పడతాయి.

గాయాలను త్వరగా మాన్పడానికి

శరీరంపై అయ్యే చిన్న గాయాల నుండి పెద్ద గాయాల వరకు నయం చేయడానికి ఆముదం ఆకులను ఉపయోగించవచ్చు. చిన్న గాయాలైతే ఆకును నలిపి ఆ రసాన్ని గాయంపై వేయాలి. పెద్ద గాయాలైతే ఆముదం ఆకులను మెత్తని పేస్ట్ లా చేసి, కొబ్బరి నూనెలో కలిపి గాయాలపై రాయడం వల్ల అవి త్వరగా మానిపోతాయి.



ఒత్తిడిని తగ్గించే హెయిర్ మసాజ్

నేటి కాలంలో చాలా మంది మానసిక ఒత్తిడి, నిద్రలేమితో బాధపడుతున్నారు. కొబ్బరి నూనెలో ఆముదం ఆకులను చిన్న ముక్కలుగా వేసి బాగా మరిగించాలి. ఆ నూనె చల్లారిన తర్వాత తలకు పట్టించి మసాజ్ చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, ప్రశాంతమైన నిద్ర పడుతుంది.

గౌట్, పాదాల వాపులకు ఉపశమనం

శరీరంలో యూరిక్ యాసిడ్ పెరగడం వల్ల వచ్చే గౌట్ సమస్యతో కాలి వేళ్లలో వాపు, నొప్పి వస్తాయి. ఆముదం ఆకుల పేస్ట్‌ను కొబ్బరి నూనె లేదా ఆవనూనెలో వేసి మరిగించి వడకట్టుకోవాలి. ఈ నూనెను ఉదయం, సాయంత్రం రాయడం వల్ల గౌట్ నొప్పులు తగ్గుతాయి. అలాగే, ఎక్కువ సేపు నిలబడటం వల్ల పాదాలు వాచినట్లయితే, రాత్రి పడుకునే ముందు పాదాలను గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుని, ఆముదం ఆకులను పాదాల చుట్టూ ఉంచి వస్త్రంతో కట్టుకుంటే వాపులు త్వరగా తగ్గిపోతాయి.

స్టాక్ మార్కెట్ Stock Market

బ్యాంక్ నిఫ్టీ చరిత్రలోనే తొలిసారి 62,000 దాటి కొత్త ఆల్-టైమ్ హై



బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ చరిత్రలోనే తొలిసారి 62,000 పాయింట్ల మైలురాయి దాటి కొత్త ఆల్-టైమ్ హై నమోదు చేసింది. సెన్సెక్స్, నిఫ్టీ కూడా వరుసగా రెండో రోజు లాభాల్లో ముగిశాయి.

బ్యాంక్ నిఫ్టీ చరిత్రలోనే తొలిసారి 62,000 దాటి కొత్త ఆల్-టైమ్ హై

అమెరికా నిబంధనల ప్రభావంతో ఆసియా మార్కెట్లు నష్టాల్లో పయనించినప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు మాత్రం మంగళవారం (నవంబర్ 17) అద్భుతమైన ప్రతిభ కనబరిచాయి. ముడిచమురు ధరలు తగ్గడం, బ్యాంకింగ్ షేర్లలో భారీ కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సూచీలు రెండో రోజు కూడా లాభాలతో ముగిశాయి.

బీఎస్ఈ సెన్సెక్స్ (BSE Sensex): 427.40 పాయింట్లు (0.52%) లాభపడి 82,532.19 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 82,897 వరకు వెళ్లింది.

ఎన్ఎస్ఈ నిఫ్టీ (NSE Nifty): 96.30 పాయింట్లు (0.38%) పెరిగి 25,387.40 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ ఒక దశలో 25,501 తాకింది. (ఫిబ్రవరి 26, 2026 తర్వాత నిఫ్టీ తొలిసారిగా ఇంట్రాడేలో 25,500 మార్కును తాకడం విశేషం).

బ్యాంకింగ్ షేర్ల జోరు: నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ చరిత్రలోనే తొలిసారిగా 62,000 పాయింట్ల మైలురాయిని దాటి సరికొత్త ఆల్-టైమ్ హై (62,324.55 పాయింట్లు) నమోదు చేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (4% పైగా), కెనరా బ్యాంక్, ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మంచి లాభాలను ఆర్జించాయి.

తగ్గిన క్రూడ్ ఆయిల్ ధరలు: బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 92 డాలర్ల దిగువకు పడిపోవడం భారత ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిచ్చింది.

బలపడిన రూపాయి: క్రూడ్ ధరల పతనం కారణంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ 93.92కి బలపడింది.

విదేశీ పెట్టుబడులు (FPI Inflows): నవంబర్‌లో ఇప్పటివరకు FPI పెట్టుబడులు ఏకంగా రూ. 84,166 కోట్లకు చేరాయి. రూపాయి బలపడుతుండటంతో, అమెరికా బాండ్ ఈల్డ్స్ ఎక్కువగా ఉన్నప్పటికీ విదేశీ మదుపర్లు భారత బాండ్లు, ఈక్విటీల వైపు ఆకర్షితులవుతున్నారు.

ఆటోమొబైల్ రంగానికి చెందిన టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి, ఐషర్ మోటార్స్ షేర్లు 0.6% నుంచి 1% వరకు లాభపడ్డాయి. మాక్స్ హెల్త్‌కేర్, సన్ ఫార్మా, అపోలో హాస్పిటల్స్ వంటి హెల్త్‌కేర్ షేర్లు కూడా సానుకూలంగా ముగిశాయి.

ఐదేళ్లలో రూ.5 లక్షలు వడ్డీ

సాంప్రదాయ పోస్టాఫీస్ పథకాల్లోకి ఇటీవల పెట్టుబడులు పెరుగుతున్నాయి. స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్, బంగారం ధరల్లో మార్పుల వల్ల రిస్క్ లేని ఆదాయం వైపు చాలామంది చూస్తున్నారు. సురక్షిత పెట్టుబడులను కోరుకునేవారికి మంచి మార్గాన్ని చూపిస్తున్నాయి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పోస్టాఫీస్ స్కీమ్‌లు. సమీపంలోని పోస్టాఫీస్‌కు వెళ్లి సులువుగా తెరిచే అవకాశం ఉండటంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా పొదుపు పథకాల్లో చేరుతున్నారు. దీంతో ఇటీవల పోస్టల్ స్కీమ్స్ బాగా పాపులర్ అవుతున్నాయి. పోస్టాఫీసుల్లో బాగా పాపులర్ అయిన పథకం నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్(NSC).

NSC పాదుపు ఖాతా ఎందుకు తెరవాలి..?

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ పథకంలో ఉన్న బెనిఫిట్ ఏంటంటే.. ఇందులో అధిక వడ్డీ పొందవచ్చు. దీంతో వడ్డీ రూపంలో మీరు జమ చేసే సొమ్ముపై ఎక్కువ ఆదాయం లభిస్తుంది. తమ డబ్బులకు ఎక్కువ వడ్డీని ఇచ్చే పథకాల కోసం చూసేవారికి ఇది గొప్ప అవకాశం. వడ్డీతో పాటు మీకు చక్రవడ్డీ కూడా ఇందులో లభిస్తోంది. దీని వల్ల మీ పెట్టుబడి రెట్టింపవుతుంది. చిన్న మొత్తంలో కూడా ఇందులో పెట్టుబడి పెట్టవచ్చు.

వడ్డీ ఎంత ఉందంటే..?

ప్రస్తుతం నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ వడ్డీ రేటు 7.7 శాతంగా ఉంది. అయితే చక్రవడ్డీ వల్ల మీకు అదనంగా బెనిఫిట్ ఉంటుంది. కేవలం రూ.వెయ్యి నుంచి గరిష్టంగా ఎంత సొమ్ము అయినా దాచుకోవచ్చు. మీరు ఎక్కువ డబ్బులు ఇన్వెస్ట్ దానిపై ఆదాయం మరింత ఎక్కువగా లభిస్తుంది. మీ సమీపంలోని ఏదైనా పోస్టాఫీస్‌కు వెళ్లి ఆధార్, బ్యాంక్ వివరాలు అందించి ఇందులో చేరవచ్చు. ఆన్‌లైన్‌లోనూ ఈ ఖాతా తెరిచే అవకాశముంది. ఈ పథకానికి ఐదేళ్ల లాక్ ఇన్ పీరియడ్ ఉంటుంది. ఐదేళ్ల తర్వాత వడ్డీతో సహా మొత్తం తీసుకోవచ్చు. అలాగే విత్ డ్రా చేసుకునేటప్పుడు ఎలాంటి టీడీఎస్ పడదు. ఐదేళ్లలోపు మీరు ఈ ఖాతాపై లోన్ కూడా తీసుకోవచ్చు. ఇలా అనేక బెనిఫిట్స్ పొందవచ్చు.

రూ.5 లక్షలు సంపాదించడం ఎలా..?

ఉదాహరణకు మీరు ఈ ఖాతాలో ఒకేసారి రూ.11.50 లక్షలు చేయాలి. 5 ఏళ్లకు మీకు వడ్డీ, చక్రవడ్డీ రూపంలో రూ.5,16,389 అదనంగా లభిస్తాయి. దీంతో ఒకేసారి రూ.16.66 లక్షలు ఐదేళ్ల మెచ్యూరిటీ పీరియడ్ తర్వాత విత్ డ్రా చేసుకోవచ్చు. అలాగే పిల్లల పేరుపై కూడా ఈ ఖాతా తెరవొచ్చు. పదేళ్ల వయస్సుకంటే తక్కువ ఉన్న పిల్లల ఖాతాను తల్లిదండ్రులు నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే ఇందులోని పెట్టుబడులకు ఒక ఏడాదిలో గరిష్టంగా రూ.1.80 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు.



'సుప్రీం'లో వేదాంతకు చుక్కెదురు

సుప్రీం కోర్టులో వేదాంత గ్రూపు కంపెనీ ట్విన్ స్టార్ టెక్నాలజీస్‌కి చుక్కెదురైంది. దివాలా ప్రక్రియలో ఉన్న వీడియోకాన్ గ్రూపు కంపెనీల ఆస్తులను కారు చౌకగా రూ.2,962 కోట్లకు కొట్టేయాలన్న ట్విన్ స్టార్ టెక్నాలజీస్ ప్రణాళికకు సర్వోన్నత న్యాయస్థానం బ్రేక్ వేసింది. ఈ పరిష్కార ప్రక్రియ మొత్తాన్ని పునఃపరిశీలించాలని వీడియోకాన్ గ్రూపు కంపెనీలకు రుణాలు ఇచ్చిన రుణదాతల కమిటీ(సీఓసీ)కి ఎన్‌సీఎల్‌ఏటీ నివేదించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది.



మరింత కిందకు పసిడి ధరలు..

అంతర్జాతీయ భౌగోళిక కారణాల నేపథ్యంలో బంగారం ధరలు ప్రతిరోజూ తగ్గుతూనే ఉన్నాయి. మంగళవారం కూడా తగ్గుదల నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,36,140గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ. 760 తగ్గింది. (Gold and Silver Rates). ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,24,700గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ.700 తగ్గింది (Live Gold Rates).



కొండగట్టు చందనోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం



హైదరాబాద్, నవంబర్ 17 (సింగిడి):
జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో జరుగుతున్న చందనోత్సవం, మహాసంప్రోక్షణ మహోత్సవాలకు హాజరుకావాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ఆహ్వానం అందింది.ప్రతి 60 ఏళ్లకోసారి ఎంతో వైభవంగా నిర్వహించే చందనోత్సవం, మహాసంప్రోక్షణ, నిజరూప దర్శన మహోత్సవాలు ఈ నెల 15 నుండి 20వ తేదీ వరకు కొండగట్టులో జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రెవెన్యూ మరియు దేవాదాయ శాఖల ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు తదితరులు మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కొండగట్టు క్షేత్ర పురాణం, ఆలయ ఆవిర్భావం, చారిత్రక ప్రాశస్త్యం మరియు 60 ఏళ్లకోసారి జరిగే ఈ ఉత్సవాల ఆధ్యాత్మిక విశిష్టతను వారు గవర్నర్‌కు వివరించారు.గవర్నర్‌తో డీజీపీ సౌమ్య మిశ్రా భేటీఅంతకుముందు మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ సౌమ్య మిశ్రా లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. రాష్ట్రంలో మహిళల భద్రత కోసం పోలీసు శాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు, షీ టీమ్స్ పనితీరును గవర్నర్‌కు వివరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

హన్మకొండ, నవంబర్ 17, (సింగిడి):
కాజీపేట మండలం కడిపికొండలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట దర్గా పాక్స్ చైర్మన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, 44వ డివిజన్ అధ్యక్షులు జక్కుల సదానందం, 45వ డివిజన్ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి, 46వ డివిజన్ అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్, 64వ డివిజన్ అధ్యక్షులు దువ్వ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమౌతున్న నాలాలు

- కల్వర్టు లు, నాలాల ప్రాంతాల్లో యథేచ్ఛగా వెలుస్తున్న నిర్మాణాలు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులు
- చోటా మోటా నాయకుల తెరవెనుక సెటిల్మెంట్లు



నారాయణపేట, నవంబర్ 17, (సింగిడి):
నలుదిక్కుల నాలాలు, కల్వర్టుల ప్రాంతాల్లో ఉన్న స్థలాలను అమాంతం నాకేస్తున్న నిర్మాణదారులు. ఇలాంటి దృశ్యాలు కళ్ళకు కనిపిస్తే చాలు సంబంధిత అధికారులకు కంప్లైంట్ ఇవ్వకుండానే గద్దల్లా వాలిపోతున్న సెటిల్మెంట్ల దళారులు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని యాదగిరి రోడ్డు ప్రాంతంలో గల నాలా భూములు, కల్వర్టుల ప్రాంతాలు అన్యాక్రాంతమవుతున్నాయి. అధికారిక అనుమతులు కొంతైతే, దాని అంచుల్లో అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ, టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినవస్తున్నాయి.జిల్లా కేంద్రంలో విస్తరిస్తున్న ఈ అక్రమ ఆక్రమణల పట్ల అధికార యంత్రాంగం ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శలున్నాయి. ఇక్కడ ఇన్చార్జి అధికారుల విధానాన్ని ఆసరాగా తీసుకొని ఇదే అదనుగా భావించి కొందరు చోటామోటా నాయకులు రంగప్రవేశం చేసి, నిర్మాణాలను ఆపేసినట్లు నటించి తెరవెనుక సెటిల్మెంట్లు చేసుకుంటున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అధికారుల మౌనం, అనధికారిక వసూళ్ల దందాలే ఇలాంటి అక్రమాలకు ఆజ్యం పోస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. అందుకు ఉదాహరణ ఈ చిత్రంలో కనిపిస్తున్న కల్వర్టు ప్రాంతంలో అతిపెద్ద నాలా (మోరిని) పక్కకు మరల్చి అట్టి మురుగునీటిని పక్కనే బ్రిక్స్ వర్క్ జరుగుతున్న ప్రాంతానికి మరల్చిన దృశ్యం కనిపిస్తుంది. ఇట్టి నిర్మాణం పట్టణంలో ఎక్కడో మూలకు జరుగుతున్నది కాదు, అభివృద్ధి జరుగుతున్న విశాలమైన రోడ్డు పక్కనే చేపడుతున్న దృశ్యం, అదేవిధంగా దీనికి ఎదురుగా మరో యజమాని తమ స్థలమే అయినప్పటికీ అతిపెద్ద నాలా మోరిని చిన్నదిగా మార్చి చదును చేసి అట్టి మొరికి చిన్నపాటి సిమెంట్ పైపులు వేసి కల్వర్టు కింది నుండి నీరు వెళ్లే విధంగా చేపట్టిన పనులు కనిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అటుపక్కకు కన్నెత్తి చూడని అధికారులు. ఇట్టి విషయం మున్సిపల్ కమిషనర్ దృష్టికి వెళ్లినప్పటికీ అక్కడ ఏం జరుగుతుందో తెలియదని సమాధానం, విషయాన్ని టౌన్ ప్లానింగ్ అధికారికి చేరవేస్తా అనడం విడ్డూరంగా మారింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్థాయి అధికారులు జిల్లా కేంద్రంలో జరుగుతున్న కల్వర్టు, నాలాల ప్రాంతాలను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాలా ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సూర్యాపేటలో నకిలీ బంగారం కలకలం

సూర్యాపేట జిల్లా ప్రతినిధి (సింగిడి):
సూర్యాపేట పట్టణంలో నకిలీ బంగారం వ్యవహారం కలకలం రేపుతోంది. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని చర్చి కాంపౌండ్ సమీపంలోని ఓ బ్యాంకులో నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి గోల్డ్ లోన్లు పొందిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. బంగారం అసలుదా, నకిలీదా, అనే విషయాన్ని సక్రమంగా నిర్ధారించకుండానే రుణాలు మంజూరు చేసినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఒకే వ్యక్తి పేరుతో ఏకంగా ఐదు గోల్డ్ లోన్లు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో బ్యాంకు ఉద్యోగి ఒకరు సదరు వ్యక్తికి సహకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బంగారం నాణ్యతను పూర్తిస్థాయిలో పరిశీలించకుండా, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మేనేజర్ ఫిర్యాదుతో వెలుగులోకి.....బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారంపై అనుమానాలు రావడంతో పరిశీలించగా అది నకిలీ బంగారంగా తేలినట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన బ్యాంకు మేనేజర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మేనేజర్ ఫిర్యాదు మేరకు ఈ మోసం వెలుగులోకి వచ్చింది.ఆ బ్యాంకు లోనే పని చేసే ఉద్యోగికి ఫోన్ చేయగా ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానాలు రెట్టింపు అయ్యాయి. ఈ వ్యవహారంలో ఉద్యోగి పాత్ర ఎంతవరకు ఉంది,అనే ప్రశ్నలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. బ్యాంకుకు జరిగిన నష్టం ఎంత ఈ మోసంలో ఇంకా ఎవరైనా భాగస్వాములుగా ఉన్నారా అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

భగ్గుమన్న వర్గ విభేదాలు

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 17 (సింగిడి):
పెద్దపల్లి జిల్లా రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కాల్వ శ్రీరాంపూర్ మండలంలో నిర్వహించిన పెన్షన్ లబ్ధిదారుల పత్రాల పంపిణీ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు వర్గీయుల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం ఇరువురు నేతల మధ్య ఉన్న అంతరం మరోసారి చర్చనీయాంశంగామారింది.కాల్వ శ్రీరాంపూర్ మండలంలో ఏర్పాటు చేసిన సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ వంశీకృష్ణ హాజరయ్యారు. అయితే కార్యక్రమం ప్రారంభం కావడానికి సుమారు రెండున్నర గంటల ఆలస్యం కావడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే విజయ రమణారావు రాక కూడా ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో తాను అయ్యప్ప మాల ధారణ (దీక్ష)లో ఉన్నానని సాయంత్రం పూజ సమయానికి చేరుకోవాల్సి ఉందని అలాగే మరో కార్యక్రమానికి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొంటూ ఎంపీ వంశీకృష్ణ వేదికపై ప్రసంగించి అక్కడి నుండి బయలుదేరారు. ఇక్కడే ఎంపీ ఎమ్మెల్యే వర్గాల మధ్య విభేదాలు మరోసారి బహిర్గతం అయ్యాయి. ఈ విషయంపై ఎంపీ మాట్లాడుతూ తాను ఎవరితోనూ గొడవ పడే ఉద్దేశంతో రాలేదని స్పష్టం చేశారు. కార్యక్రమం నిర్వహణలో తీవ్ర జాప్యం జరగడం ఎమ్మెల్యే రాక



ఆలస్యం కావడం వల్ల సమయాభావంతోనే తాను ముందుగా ప్రసంగించాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. అయ్యప్ప దీక్షలో ఉన్న తనను ఎమ్మెల్యే అనుచరులు అడ్డుకుని వాగ్వాదానికి దిగడం పట్ల ఎంపీ వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేశారు.మరోవైపు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అయిన విజయ రమణారావు వేదిక వద్దకు రాకముందే ఎంపీ ప్రసంగించడం పట్ల ఎమ్మెల్యే అనుచరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ స్థానిక నాయకత్వ ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ ఎమ్మెల్యే రాకుండా వేదికపై ఎలా మాట్లాడుతారని వారు ఎంపీని ప్రశ్నించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఒకే పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులైనప్పటికీ, నియోజకవర్గంలో పట్టు సాధించే విషయంలో ఇరువురు నేతల మధ్య సమన్వయ లోపం ఉన్నట్లు ఈ ఘటన ద్వారా మరోమారు తేటతెల్లం అయ్యింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో సమయపాలన, వేదికపై ఎవరు ముందు మాట్లాడాలి అనే విషయాల్లో స్పష్టత లేకపోవడం తరచూ వివాదాలకు దారితీస్తోంది.నియోజకవర్గ స్థాయిలో పనులు, నిధుల కేటాయింపు అనుచరుల మధ్య ఆధిపత్య పోరు కారణంగా ఇరువురు నేతల మధ్య దూరం పెరుగుతోందనే అభిప్రాయాలు స్థానిక రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. తాజాగా కాల్వ శ్రీరాంపూర్‌లో జరిగిన ఈ ఘటనతో పెద్దపల్లి నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యే వర్గాల మధ్య ఉన్న విభేదాలు బహిరంగంగా బయటపడ్డాయి.

వైఎస్ఆర్ నగర్ ప్రజలకు అండగా ఉంటా

హన్మకొండ, నవంబర్ 17, (సింగిడి):
కాజీపేట వైఎస్ఆర్ నగర్ భూములు, కాజీపేట చౌరస్తాలో నిర్మాణం చేపట్టిన భవనానికి సంబంధించిన అంశాలపై ఇటీవల బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో పాటు కొన్ని హైదరాబాద్‌కు చెందిన యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఆరోపణలపై వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం కాజీపేటలో మీడియా సమావేశం నిర్వహించి సమాచార హక్కు చట్టం ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల నుంచి సేకరించిన పత్రాలు, రెవెన్యూ రికార్డులు, భూముల వివరాలు, అనుమతులకు సంబంధించిన డాక్యుమెంట్లను మీడియా ముందు ఉంచుతూ పలు కీలక అంశాలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్ఆర్ నగర్ గుడిసెవాసుల సమస్యపై గతంలోనే సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించానని, మరింత సమగ్ర సమాచారం కోసం మరోసారి దరఖాస్తు చేశానని తెలిపారు. రెవెన్యూ, కుడా, మున్సిపల్ కార్పొరేషన్ తదితర మూడు శాఖల నుంచి పూర్తి డాక్యుమెంటేషన్ సేకరించిన తర్వాతే ప్రజల ముందుకు వాస్తవాలు తీసుకువస్తానని స్పష్టం చేశారు. తాను ఇప్పటివరకు ఏ అంశంపై మాట్లాడినా ఆధారాలు, అధికారిక రికార్డుల ఆధారంగానే మాట్లాడానని, ఊహాగానాలతో ఎప్పుడూ ఆరోపణలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. వైఎస్ఆర్ నగర్ భూములకు సంబంధించి ఇరానీ కుటుంబానికి చెందిన భూములు అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలోకి రావడంతో అప్పట్లో కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఈ మేరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వివరించారు. ఈ కేసు న్యాయపరిధిలో ఉండగానే 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, అప్పటి ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలో, సదరు భూములను నాలా కన్వర్షన్ చేసి ఇరానీ కుటుంబ సభ్యుల పేర్లపై ఎలా నమోదు చేశారనే అంశంపై ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ, కుడా, మున్సిపల్ కార్పొరేషన్ శాఖల రికార్డులను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అక్కడ 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. అక్కడ నివసిస్తున్న ప్రజల ప్రశాంతతకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని, బయట వ్యక్తులు వచ్చి వివాదాలు సృష్టించకుండా చూడాలని అధికారులను కోరినట్లు వెల్లడించారు. హంటర్ రోడ్డులో శిల్పారామం లేదా ఇతర పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉన్న సమయంలో, తనకు సంబంధం లేని వివాదంలోకి తనను లాగేందుకు మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అనుచరులు రాత్రికి రాత్రే విగ్రహాన్ని తీసుకొచ్చి ఏర్పాటు చేశారని ,మళ్లీ అదే విగ్రహాన్ని వారి అనుచరులు ధ్వసం చేశారనీ తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి అక్కడి సీసీటీవీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు ఉన్నాయని, వాటిని కూడా మీడియాకు అందజేస్తానని తెలిపారు. మతపరమైన అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్,విజయశ్రీ రాజాలి,తోట వెంకటేశ్వర్లు,పోతుల శ్రీమాన్,అబూ బకర్,గుంటి కుమార్ సీనియర్ నాయకులు అంకుష్,సమత రాజు, సతీష్, డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు నాయకులు తదితరులున్నారు.



అన్ని అర్హతలు ఉన్నా.. అందని ఆసరా పింఛన్



నారాయణపేట, నవంబర్ 17, (సింగిడి):
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని 3వ వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ విమర్శించారు. మంగళవారం తన నివాసంలో లబ్ధిదారులతో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డులోని వితంతువులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మూడేళ్ల క్రితం భర్తను కోల్పోయిన వెంకట మ్మతో పాటు లలిత, యాదమ్మల దరఖాస్తులను అధికారులు పక్కన పెట్టారని మండిపడ్డారు. సదరం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగుడు రక్షిత్ కు కూడా పింఛన్ మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. వార్డులో 38 మంది అర్హులు దరఖాస్తు చేసుకోగా, కేవలం 24 మందికే మంజూరు చేసి మిగిలిన 14 మందికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంట్లో ఇద్దరికి పింఛన్ ఇస్తామన్న ప్రభుత్వం, కనీసం భర్త చనిపోయిన వితంతువుకు కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. వెంటనే అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయక పోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో లబ్ధిదారులు వెంకటమ్మ, లలిత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్న సాయం.. విద్యార్థినులకు పెద్ద భరోసా



కొత్తగూడెం, నవంబర్17(సింగిడి):
సేవ చేయడానికి కోట్ల రూపాయల సంపద ఉండాల్సిన అవసరం లేదు.. ఎదుటివారి అవసరాన్ని గుర్తించే మంచి మనసుంటే చాలని నిరూపించారు టీఎన్జీవో కేంద్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ జడ్.ఎస్. జయపాల్. చదువుకుంటూ వసతి గృహాల్లో ఉంటున్న నిరుపేద బాలికల వ్యక్తిగత పరిశుభ్రతకు తనవంతు సహకారం అందిస్తూ ఉచితంగా స్నానపు సబ్బులను పంపిణీ చేశారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని సెయింట్ ఆండ్రూస్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జి. రత్నరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలకు అనుబంధంగా ఉన్న వసతి గృహంలో నివసిస్తున్న బాలికలకు అందించేందుకు జడ్.ఎస్. జయపాల్ సబ్బులను అందజేశారు. . విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

కామారెడ్డి, నవంబర్ (17:సింగిడి):
పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. జిల్లాలోని ప్రతి అర్హ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించేలా అర్హుల గుర్తింపు, నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు, మండల గణాంక అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం విధివిధానాలు, అర్హత ప్రమాణాలు, ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు.18 నుంచి 59 ఏళ్ల వయస్సు వారికి అవకాశంఈ పథకం కింద ప్రతి అర్హ కుటుంబం నుంచి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఒకరికి మాత్రమే రూ.5 లక్షల జీవిత బీమా వర్తిస్తుందని కలెక్టర్ వెల్లడించారు. ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీ ఆధారంగా అర్హతను నిర్ధారించనున్నట్లు తెలిపారు.



1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు ఈ పథకానికి అర్హులని వివరించారు.నవంబర్ 19 నుంచి ప్రత్యేక శిబిరాలున వంబర్ 19 నుంచి డిసెంబర్ 18 వరకు నెల రోజుల పాటు గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. కామారెడ్డి జిల్లాలోని 25 మండలాల పరిధిలో ఉన్న 532 గ్రామ పంచాయతీలతో పాటు కామారెడ్డి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడ మున్సిపాలిటీల్లోని ప్రతి వార్డులో శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. రేషన్ కార్డు లేని కుటుంబాలకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక కోడ్ ఆధారంగా గుర్తింపు సంఖ్య కేటాయించి నమోదు చేయనున్నారు. రేషన్ కార్డులో ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్నవారు వెంటనే సంబంధిత రేషన్ షాపులో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో నీపీఓ రఘునందన్, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, సీఈఓ చందర్, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, డీఎస్ఓ వెంకటేష్, డీఎం శ్రీకాంత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో శాఖల పనితీరును సమీక్షించిన చైర్ పర్సన్

నారాయణపేట, నవంబర్ 17, (సింగిడి):
మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కొండ స్వేత సత్య యాదవ్ ప్రతి విభాగాన్ని స్వయంగా సందర్శించి, ఆయా శాఖల పనితీరు, జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యతతో స్వీకరించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్, మేనేజర్, వివిధ విభాగాల అధికారులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ నవంబర్ 17(సింగిడి):
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా, 7వ రోజు వేడుకలను ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పవిత్ర కార్తీక మాస పర్వదినాల సందర్భంగా, ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు మరియు శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి సభ్యులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, వాయనంతో పాటు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

విద్యుత్ వెలుగుల్లో త్రికుటేశ్వరాలయం

కరీంనగర్, నవంబర్17(సింగిడి):
కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని కాకతీయుల కాలం నాటి పురాతన ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు భక్తులు ముందడుగు వేశారు. పూజ్య గురువు శ్రీ సురేష్ ఆత్మారామ్ మహారాజ్ ఆధ్వర్యంలో సుమారు 120 మంది భక్తుల సమక్షంలో ఆలయానికి 'శ్రీ త్రికుటేశ్వరాలయం'గా నామకరణం చేశారు.గతంలో చీకటిలో ఉన్న ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో కొత్త శోభ సంతరించుకుంది. స్థానికుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ బాధ్యులు, సేవా సంస్థ ప్రతినిధులు, మహిళలు, పిల్లలు, భక్తులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకోవాలి

కల్వకుర్తి నవంబర్ 17 (సింగిడి):
కల్వకుర్తి మండలం పంజాగుల గ్రామంలో వి బి జి రామ్ జి పథకం కింద కూలీలతో చేపడుతున్న ఫామ్ పాండ్ (వ్యవసాయ క్షేత్ర నీటి కుంట) నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, కూలీల హాజరు, పనుల నిర్వహణ, కూలీలకు కల్పిస్తున్న ఉపాధి తదితర అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల ద్వారా కూలీలకు ఆదాయం కల్పించడంతో పాటు గ్రామాలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే ఆస్తులు సమకూరాలని, చేపట్టిన ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం పంజాగుల గ్రామంలో దాసరి లక్ష్మమ్మ మహిళా సంఘం ఆధ్వర్యంలో 400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన షేడ్‌నెట్ హౌస్ యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. 1.46 లక్షల యూనిట్ వ్యయంతో 50 శాతం సబ్సిడీ కింద రూ.73 వేల ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో సాగు చేస్తున్న ఆకుకూరలు, కీరదోస, వివిధ రకాల క్యాప్సికం, తీగ టమాట తదితర కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, మహిళా సంఘాలు వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. సమష్టిగా కృషి చేస్తే వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాలను పెంచుకొని ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని పేర్కొన్నారు. రైతులు పంటల సాగులో మార్పులు చేసుకుంటూ నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, కల్వకుర్తి డివిజన్ ఉద్యాన శాఖ అధికారి జగన్, తహసీల్దార్ ఇబ

ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి



కల్వకుర్తి నవంబర్ 17 (సింగిడి):
కల్వకుర్తి మండలంలోని ముకురాల, పంజాగుల గ్రామాల్లో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు సాగు చేస్తున్న ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సాగు విధానం, పెట్టుబడి వ్యయం, దిగుబడులు, మార్కెటింగ్ అవకాశాలు, రైతులకు లభిస్తున్న ఆదాయం తదితర అంశాలపై రైతులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ముందుగా ముకురాల గ్రామానికి చెందిన రైతు రాజేందర్ రెడ్డి తన ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో సాగు చేస్తున్న పందిరి కూరగాయలు, చిక్కుడు పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మొక్కల పెరుగుదల, దిగుబడులు, సాగు ఖర్చులు, మార్కెటింగ్ అవకాశాల గురించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ,ప్రస్తుత సీజన్ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి సాగును గణనీయంగా తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

సంప్రదాయ గానుగ నూనె తయారీ పరిశీలన..
ముకురాల గ్రామంలో ఎద్దు గానుగ ద్వారా తయారు చేస్తున్న నూనె ఉత్పత్తులను కూడా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సంప్రదాయ పద్ధతిలో నూనె తయారీ విధానం, వినియోగిస్తున్న ముడి సరుకులు, ఉత్పత్తుల నాణ్యత, తయారీ వ్యయం, విక్రయ విధానం తదితర వివరాలను నిర్వాహకులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ ఇబ్రహీం,అధికారులు పాల్గొన్నారు.

బీసీఓబీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



గోదావరిఖని,నవంబర్17(సింగిడి):
సింగరేణి కాలరీస్ బీసీ, ఓబీసీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం సాయంత్రం ఆర్జీ–1 ఏరియా జనరల్ మేనేజర్ లలిత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పలు విజ్ఞప్తులు చేశారు.సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఆదేశాల మేరకు జనరల్ మేనేజర్‌ను కలిసిన నాయకులు.. సంఘం కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన నివాస గృహాన్ని కేటాయించాలని కోరారు. అదేవిధంగా ఆర్జీ–1 ఏరియాలో చాలాకాలంగా ఖాళీగా ఉన్న ఉపరితల సాధారణ సహాయకుల పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏరియాలోని అన్ని కాలపరిమితి వేతన ఖాళీలను గుర్తించి, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం బీసీ, ఓబీసీ ఉద్యోగులకు అవకాశాలు కల్పించాలని కోరారు.ఈ అంశాలపై జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. సంఘానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, సహాయ జనరల్ మేనేజర్ ఆంజనేయులు, ఉప జనరల్ మేనేజర్ పైడీశ్వర్, రెండో శ్రేణి ఇంజనీర్ మల్లేశం, రాజన్న, ఐఈడీ విభాగానికి చెందిన శ్రీధర్, రమేష్, బీసీ సమన్వయ అధికారి పెరుమాళ్ల శ్రీనివాస్, ఏరియా భద్రతాధికారి మురళీమోహన్, సంఘం ఉపాధ్యక్షుడు పెంచాల తిరుపతి, కార్యదర్శి బత్తుల పోషం పాల్గొన్నారు. వివిధ గనులు, విభాగాలకు చెందిన గని కార్యదర్శులు, పర్యవేక్షకులు, బీసీ ఉద్యోగులు హాజరయ్యారు.

అన్నదాత కన్నీటిపై కదలాలి..

కాటారం,నవంబర్ 17(సింగిడి):
ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు అప్పుల ఊబిలో చిక్కుకుని కన్నీరు పెడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని తోట కోటేశ్వర్ పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు పాలకుల విధానాలు రైతాంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాయని పేర్కొంటూ, రైతుల పక్షాన మరో ప్రజాస్వామ్య పోరాటానికి నాయకత్వం వహించాలని ఉద్యమ అగ్రనేత దేవ్ జీకి విజ్ఞప్తి చేశారు.కాటారంలో మాజీ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు దేవ్ జీని తోట కోటేశ్వర్ పటేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి, క్షేత్రస్థాయిలో రైతులు



ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయని తెలిపారు. మరోవైపు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగడంతో సాగు పెట్టుబడి భారమైందన్నారు. కీలక సమయంలో యూరియా, ఇతర ఎరువుల కొరత ఏర్పడటం, ఆన్‌లైన్ అనువర్తనాల్లో సాంకేతిక సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వివరించారు. ఎరువుల కోసం దుకాణాల చుట్టూ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) లభించక, దళారుల చేతిలో రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువుల నిల్వల కొరత, సరఫరా సమస్యలు, ఆన్‌లైన్ విధానాల్లో సాంకేతిక ఇబ్బందులతో ఎరువుల వ్యాపారులు సైతం ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని దేవ్ జీ దృష్టికి తీసుకెళ్లారు.రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని, అన్నదాతల సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రజాస్వామ్య సమరభేరి మోగించాలని తోట కోటేశ్వర్ పటేల్ దేవ్ జీని కోరారు.

పింఛన్ల పంపిణీలోనూ రాజకీయ వివక్షా?



నాగర్ కర్నూల్, నవంబర్ 17 (సింగిడి):
నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో 536 పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంగా నిర్వహించారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు తిమ్మాజిపేట పాండు, జయప్రకాశ్ చారి, విజయలక్ష్మి నరేష్ చారి తీవ్రంగా విమర్శించారు. ప్రజలచే ఎన్నికైన కౌన్సిలర్లను పక్కనపెట్టి, ఓటమిపాలైన కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో కేవలం 536 మందికి మాత్రమే పింఛన్లు మంజూరు చేశారని, ఇంకా సుమారు 200 మంది అర్హులైన వృద్ధులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వారందరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాసంగిలో వరి వేయద్దు

నీటి ఎద్దడి దృష్ట్యా రైతులకు అవగాహన కల్పించాలి.. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 17 (సింగిడి):
ప్రస్తుత యాసంగి సీజన్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున జిల్లాలో వరి సాగు పూర్తిగా నష్టదాయకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల వైపు మళ్లేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో యాసంగి సాగు ప్రణాళికపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

తాగునీటికే ప్రాధాన్యం.. సాగునీరు కష్టమే...
వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, ఎస్‌ఆర్‌ఎస్‌పీ (SRSP) ప్రాజెక్టులోనూ నీటిమట్టం ఆశాజనకంగా లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఉన్న నీరు కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతుందని, సాగునీటిని విడుదల చేయడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. దీనికి తోడు రాబోయే రోజుల్లో విద్యుత్ సరఫరాలోనూ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేపట్టవద్దని సూచించారు.

ఎకరం వరి నీటితో.. నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న..
రైతులు ఆరుతడి పంటలు, ముఖ్యంగా మొక్కజొన్న సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఒక ఎకరం వరికి పట్టే నీటితో ఏకంగా నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయవచ్చని, తద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించి లాభాలు పొందవచ్చని వివరించారు.ఆరుతడి పంటలకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై రైతులకు ముందస్తుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు ఏయే పంటలు వేస్తున్నారనే వివరాలను పక్కాగా సేకరించాలని పేర్కొన్నారు.వాతావరణ పరిస్థితులు నీటి



లభ్యతకు అనుగుణంగా యాసంగి సాగు ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులకు ఈ సందర్భంగా సూచించారు. ఈ సమీక్షలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ములుగు ప్రతినిధి, నవంబర్ 17 (సింగిడి):
అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఒంటరి మహిళలు, వితంతువులు ఎవరూ అధైర్యపడవద్దని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.మంగళవారం మంగపేట మండలంలో మంత్రి సీతక్క విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద, రాజుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.మంగపేట మండలంలో మొత్తం



659 మంది లబ్ధిదారులకు నూతనంగా చేయూత పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ మేరకు లబ్ధిదారులకు మంత్రి సీతక్క తన చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేశారు. నూతనంగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్, డీఆర్డీఓ, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఇస్సార్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ తోట రమేష్, ఎంపీడీఓ బద్రు నాయక్, తహసీల్దార్ తోట రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

కల్వకుర్తి నవంబర్ 17 (సింగిడి):
కల్వకుర్తి మండల పరిధిలోని పంజుగుల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన తీరు, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల విధుల నిర్వహణ, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా? ఆహార పదార్థాల నాణ్యత ఎలా ఉంది? వంటశాలలో పరిశుభ్రత పాటిస్తున్నారా? అనే అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీవో యాదయ్య, మండల విద్యాధికారి శంకర్ నాయక్, గ్రామ సర్పంచి పర్వతాలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలి

మహబూబ్ నగర్ బ్యూరో, నవంబర్ 17(సింగిడి):
జిల్లాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, పనుల పురోగతిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సేకరించిన భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అవార్డులను జారీ చేయడంతోపాటు, పరిహారం చెల్లింపులు పూర్తి చేసి, భూముల మ్యుటేషన్ ప్రక్రియను సత్వరమే చేపట్టాలని సూచించారు.
మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. భారతమాల జాతీయ రహదారి, రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఉదండాపూర్ రిజర్వాయర్ పరిధిలోని భూములను నీటిపారుదల శాఖ అధికారులకు స్వాధీనం చేసి అప్పగించాలని సంబంధిత తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ యాదగిరి, జిల్లా భూ సర్వే రికార్డుల అధికారి ఎ.డి. అశోక్, మున్సిపల్ కమిషనర్ రామానుజులు రెడ్డి, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

మహబూబ్ నగర్ బ్యూరో , నవంబర్ 17(సింగిడి):
గత ఏడెనిమిదేళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న అర్హులకు ప్రజా ప్రభుత్వం చేయూత పింఛన్లు మంజూరు చేసి ఆర్థిక భరోసా కల్పిస్తోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. మంగళవారం నవాబ్‌పేట మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో నవాబ్‌పేట మండలానికి కొత్తగా మంజూరైన 861 చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు మంజూరు కాని వారి దరఖాస్తులను మరోసారి పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జడ్చర్ల నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నవాబ్‌పేట పాఠశాలలో రూ.38 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేశామని, బాలికల కోసం భోజనశాల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.
నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఫతేపూర్ మైసమ్మ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అప్పన్నపల్లి అటవీ ప్రాంతం మీదుగా ఫతేపూర్ మైసమ్మ ఆలయానికి పర్యాటక మార్గాన్ని అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనను పర్యాటక శాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలున్నందున గ్రామాల వారీగా తాగునీటి అవసరాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీ తర్వాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులతో సమావేశం నిర్వహించి గ్రామాల వారీగా తాగునీటి అవసరాలను సమీక్షించాలని సూచించారు.

పింఛన్లతో అర్హులకు ఆర్థిక భరోసా: కలెక్టర్
జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితర అర్హులైన వర్గాలకు ప్రభుత్వం చేయూత పింఛన్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు మెరుగైన జీవనం సాగించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నరసింహులు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీత, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతం చేయాలి

రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

మహబూబ్ నగర్ బ్యూరో , నవంబర్ 17(సింగిడి):
8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ క్రీడా పోటీలను తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, ఈ క్రీడా వేడుకలను అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఈ క్రీడా పోటీల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.
ఈ నేపథ్యంలో మంగళవారం మంత్రి వాకిటి శ్రీహరి మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియాన్ని సందర్శించి క్రీడా పోటీల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియంలో నిర్మిస్తున్న టాయిలెట్ బ్లాక్ పనులను ప్రత్యేకంగా పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రీడాకారులకు ఉపయోగపడేలా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని, నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. అనంతరం స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా 8వ ఎడిషన్ సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు.

తెలంగాణకు దక్కిన సువర్ణావకాశం
ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, పట్టుదలతో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించే సువర్ణావకాశం తెలంగాణకు దక్కిందన్నారు. 8వ ఎడిషన్ లోగో ఆవిష్కరణ కార్యక్రమం సైతం రాష్ట్రంలో నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి సుమారు 8 వేల మంది క్రీడాకారులు, 1,500 మంది కోచ్‌లు ఈ పోటీల్లో పాల్గొననున్నారని, దీంతో పాలమూరు ప్రాంతంలో క్రీడా పండుగ వాతావరణం నెలకొననుందని తెలిపారు.
క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.23 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.203.36 కోట్ల నిధులు వెచ్చించి స్టేడియాలు, క్రీడా మైదానాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తోందని మంత్రి వెల్లడించారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి: ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి
రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలు ఈ క్రీడా పోటీల నిర్వహణకు పోటీపడినప్పటికీ, ఈసారి 8వ ఎడిషన్ నిర్వహణ అవకాశం తెలంగాణకు దక్కడం విశేషమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రాష్ట్రానికి ఈ అవకాశం తీసుకువచ్చారని తెలిపారు.

పోటీలను విజయవంతం చేయాలి: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి



రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా క్రీడలకు కేంద్రంగా నిలుస్తోందని, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణను అందరూ బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రాష్ట్రంలో ఈ పోటీల నిర్వహణకు అవకాశం కల్పించారని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా ఏర్పాట్లు చేపట్టాలని, ఈ నెల 25వ తేదీలోగా సంబంధిత పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

అన్ని వసతులు కల్పిస్తాం: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో కబడ్డీ పోటీలు నిర్వహించే అవకాశం లభించడం గర్వకారణమని, జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీలోగా క్రీడాకారులు, కోచ్‌లకు అవసరమైన వసతి తదితర అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాభిమానుల భాగస్వామ్యంతో పోటీలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ. నిర్మల, మహబూబ్‌నగర్ మేయర్ జి. మమత, డిప్యూటీ మేయర్ ఎం. సురేందర్ రెడ్డి, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎం.పి వెంకటేష్,కార్య దర్శి కురుమూర్తి గౌడ్, జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్, క్రీడా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పత్తిపంటను నాశనం
చేసేందుకు కుట్ర చేస్తున్నారు..

రైతులు ఆవేదన..పంటకు, కుటుంబాలకు రక్షణ కల్పించాలని ప్రజావాణిలో కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు



కల్వకుర్తి (సింగిడి):
కోర్టు విచారణలో ఉన్న కుటుంబ వారసత్వ భూవివాదాన్ని అడ్డుపెట్టుకుని తమ పత్తి పంటను నాశనం చేసేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని కురుమిద్ద గ్రామానికి చెందిన దాయాదులు సుల్తాన్, భాస్కర్, సాయి, బాలస్వామి, వెంకటయ్య ఆరోపించారు. శీను, మల్లేష్‌తో పాటు వారి బామ్మర్ది కలిసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూవివాదానికి సంబంధించి ఇటీవల పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో వచ్చిన కథనాలు ఏకపక్షంగా ఉన్నాయని పేర్కొంటూ ఒక ప్రకటనలో తమ వాదనను వెల్లడించారు.

పత్తి పంటను దెబ్బతీసేందుకే తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఆరోపణలు
కురుమిద్ద గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 140, 136/ఆ/ఆఇ1లో ఉన్న భూములకు సంబంధించి ఐదుగురు అన్నదమ్ముల కుమారుల మధ్య వారసత్వ వివాదం కొనసాగుతోందని, ప్రస్తుతం ఈ వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉందని బాధితులు తెలిపారు. గతంలో వివాదాస్పద భూమిలో వరి పంట సాగు చేసిన సమయంలో పక్కనే ఉన్న గిరిజన రైతు పొలం మీదుగా రాకపోకలు సాగిస్తూ పంటను పండించారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం వరి కోతల సమయంలో తమ పత్తి పంట మీదుగా కోత యంత్రాన్ని తీసుకెళ్లి పంటను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆరుగాలం కష్టపడి, పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న పత్తి పంటను దెబ్బతీసి తమను ఆర్థికంగా నష్టపరచాలనే ఉద్దేశంతోనే ఈ వ్యవహారానికి తెరలేపారని వారు విమర్శించారు. తమ సొంత పొలంలోకి దారి చేసుకునే ప్రయత్నంలో భాగంగానే కోర్టులో కేసు వేసి, అనంతరం తమ కుటుంబ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఏకపక్ష కథనాలు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. తాము వరి కోతలను అడ్డుకుంటున్నామని, దాడులకు పాల్పడుతున్నామని వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద అసత్య ప్రచారం తగదు..
ఈ వివాదం ఐదుగురు అన్నదమ్ముల కుమారుల మధ్య కొనసాగుతున్న వారసత్వ భూవివాదమని, న్యాయస్థానంలో విచారణ పూర్తికాకముందే భూమి తమదేనంటూ ప్రచారం చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ తమదే సొంత భూమి అన్నట్లుగా ప్రచారం చేయడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. ఒక వర్గం వాదనలనే పరిగణనలోకి తీసుకుని వార్తలు ప్రచురించడం వల్ల వాస్తవాలు మరుగున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులు, మాజీ సర్పంచ్‌పై నిందలు వేయడం సరికాదు:
న్యాయస్థానంలో విచారణలో ఉన్న సివిల్ వివాదం విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్న కల్వకుర్తి ఎస్సై కురుమూర్తి, రెవెన్యూ అధికారులపై విమర్శలు చేయడం సమంజసం కాదని వారు అన్నారు. వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్న కురుమిద్ద మాజీ సర్పంచ్ పుట్ట శేఖర్‌ను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేయడం తగదన్నారు. మీడియా ప్రతినిధులు సైతం ఒక వర్గం వాదనలకే పరిమితం కాకుండా, కోర్టు పత్రాలు, ఇరువర్గాల అభిప్రాయాలను పరిశీలించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేస్తాం:
శీను, మల్లేష్‌ల నుంచి తమ కుటుంబాలకు ముప్పు ఉందని సుల్తాన్, భాస్కర్, సాయి, బాలస్వామి, వెంకటయ్య ఆందోళన వ్యక్తం చేశారు. తమ పత్తి పంటకు ఎలాంటి నష్టం కలగకుండా చూడటంతో పాటు కుటుంబ సభ్యులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు త్వరలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను కలిసి పూర్తి వివరాలతో అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

అపోల ఫార్మసిని తనిఖీ చేసిన అధికారులు

కొల్లాపూర్(సింగిడి): ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలు వాస్తవమేనాగర్ కర్నూల్ డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ విశ్వంత్ రెడ్డి కొల్లాపూర్ అపోలో ఫార్మసీ సందర్శనఉన్నతాధికారుల దృష్టికి నివేదిక.ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలు వాస్తవమేనని నాగర్ కర్నూల్ డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ విశ్వంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పిల్లల ప్రాణాలతో 'అపోలో ఫార్మసీ' చెలగాటం శీర్షికతో పత్రి కల్లో ప్రచురితమైన కథనంతో స్పందించిన డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ సోమవారం కొల్లాపూర్ పట్టణంలోని అ-పోలో ఫార్మసీని సాధారణ వ్యక్తిగా సందర్శించి పలు విషయాలు గమనించారు. సాధారణ వ్యక్తిగా ఫార్మసీలోకి వెళ్లిన ఆయన యాంటిబయాటిక్ కొనుగోలు చేశారు. అక్కడి సిబ్బంది ఈయన డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ అని తెలుసుకోకుండా యాంటిబయాటిక్ ను విక్రయించారు. దీంతో ఆయన అక్కడే యాంటిబయాటిక్ ను ఫొటోలు తీసుకుని ఫార్మసీ సిబ్బందికి క్లాస్ పీకారు. ఫార్మసిస్ట్ లేని సమయంలో ఎలా క్రయ విక్రయాలు చేస్తారని, అలాగే ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఎలా విక్రయిస్తున్నారని నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫార్మసీలో ఎలాంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, వారంలో షోకాజ్ నోటీసులు రాగానే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అలాగే ఫుడ్ ప్రొడెక్ట్ కు సంబంధించిన విక్రయాలపై ఫుడ్ ఇన్ స్పెక్టర్ కు కూడా ఫోన్ చేసి చెప్పినట్లు చెప్పారు.



అసలు విషయం ఏమిటంటే..
వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం సంపత్ రావుపల్లెకు చెందిన పురుషోత్తం అనే వ్యక్తి వారం క్రితం తన ఐదారేండ్ల పిల్లలు బలహీనంగా ఉన్నారని, బలం కోసం ఏదైనా పౌడర్ ఇవ్వాలని కొల్లాపూర్ పట్టణంలోని అపోలో ఫార్మసీలో అడిగారు. అక్కడ విధుల్లో ఉన్న ఫార్మాసిస్ట్ రాణి ప్రోటీన్ పౌడర్ బాగుంటదని, ఇది తీసుకొని పిల్లలకు పాలల్లో కలిపి తాపాలని చెప్పారు. దీంతో ఆ వ్యక్తి తన ఇద్దరు పిల్లలకు ఉదయం ప్రోటీన్ పౌడర్ తాపడంతో రాత్రి సమయంలో పిల్లలు వాంతులు చేసుకున్నారు. వెంటనే ఆ వ్యక్తి హుటా హుటిన హాస్పిటల్ కు తీసుకెళ్లి రెండ్రోజుల పాటు వైద్యం చేయించారు. ఆ తర్వాత కొనుగోలు చేసిన ప్రోటీన్ పౌడర్ తీసుకొని కొల్లాపూర్ లోని అపోలో ఫార్మసీకి వచ్చి ఫార్మసిస్టును అడిగాడు మేడం ఈ మందు తాగిన తర్వాత మా పిల్లలకు వాంతులు చేయనుకున్నారని, పిల్లలకు ఏమైనా రియాక్షన్ అవుతుందా ?, అసలు తాపొచ్చా? తాపకూడదా? అని అడగడంతో తాము చాలామందికి ఇచ్చామని, ఎవరికి ఏమి కాలేదని నిర్లక్ష్యపు సమాధానంతో రెచ్చిపోయారు. అంతటితో ఆగకుండా ఆమె నువ్వు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో? ఏం చేసుకుంటావో చేసుకో? ఎవరికైనా కంప్లైంట్ చేసుకో ? నన్నెవరు ఏమి చేయలేరంటూ ఉగిపోయింది, ఈ విషయంపై అ-పోలో ఫార్మసీ మేనేజర్ ఫోన్లో వినియోగదారుడుతో మాట్లాడుతూ నేను వచ్చి మాట్లాడతానని.. ఈ రోజు మీతో మా సిబ్బందిని పంపిస్తానని, పిల్లలకు చూయించిన డాక్టర్ దగ్గరికి వస్తారు తీసుకెళ్లాలని చెప్పారు. అక్కడ ఏం జరిగిందో తెలుసుకుని మాట్లాడతానని చెప్పడంతో ఆ సిబ్బందిలో శ్రీకాంత్ అనే అపోలో ఫార్మసీ మెడికల్ ఇంచార్జి వినియోగదారులతో పాటు తీసుకెళ్లి ఆపిల్లలకు వైద్యం చేసిన డాక్టర్ దగ్గరికి వెళ్లగా.. అక్కడ జరిగిన విషయం వారికి తెలిపారు. పిల్లలకు వాంతులు అయితే ట్రీట్మెంట్ ఇచ్చానని డాక్టర్ చెప్పడంతో బాధ్యత వహించాల్సిన మెడికల్ అపోలో ఫార్మసీ మేనేజర్ తీరా చేతులెత్తేసి మాకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించారు. దీంతో పలు పత్రికల్లో జరిగిన విషయంపై 'పిల్లల ప్రాణాలతో 'అపోలో ఫార్మసీ' చెలగాటం' శీర్షికన కథనం ప్రచురితం అయింది. దీంతో స్పందించిన డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ అపోలో ఫార్మసీని సందర్శించారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

రాజేంద్రనగర్,(సింగిడి): రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. కొకాపేటలోని సన్‌సైన్ ఎకోపొలిస్ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న రానోజ్ టాయే (23) అనే వ్యక్తి, 2024 ఆగస్టు 21న తప్పిపోయిన చిలుక కోసం వెతుకుతున్న 9 ఏళ్ల బాలికను నమ్మించి భవనం మీదికి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. నిందితుడి బారి నుంచి ధైర్యంగా తప్పించుకున్న ఆ చిన్నారి, వెంటనే కిందకు వచ్చి జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, 2024 ఆగస్టు 22న నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని రాప్ అండ్ పోక్సో కేసుల ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధించారు.ను పరిహారం: బాధితురాలైన బాలికకు ప్రభుత్వం తరఫున రూ. 3,00,000 పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

సీనియర్ కాంగ్రెస్ నాయకులు జయకృష్ణ అంత్యక్రియల్లో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ ప్రతినిధి, (సింగిడి): కొడంగల్ నియోజకవర్గం బొంరాస్పేట్ మండలం మెట్లకుంట గ్రామానికి చెందిన పీ ఏ సీ ఈసారి చైర్మన్,బ్లాక్ అధ్యక్షులు జయకృష్ణ అంత్యక్రియల్లో కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏ.తిరుపతిరెడ్డితో కలిసి పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయకృష్ణ గారి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. జయకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఊరూరా మత్స్యకారుల దినోత్సవం జరుపుకోవాలి
-దొడ్ల నర్సింహులు,మడిగె శ్రీనివాస్



కొడంగల్, (సింగిడి): ఈనెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు ఊరూరా జరుపుకోవాలని, ప్రతి గ్రామంలో మత్స్యకారుల సొసైటీ ఆధ్వర్యంలో జెండాలు ఎగురవేయాలని ఆ సంఘం నాయకులు దొడ్ల నర్సింహులు,మడిగె శ్రీనివాస్ లు అన్నారు.ఈసందర్భంగా సంఘం ఆధ్వర్యంలో కొడంగల్ లో పోస్టర్ విడుదల చేశారు.మత్స్యకారుల ఐక్యతను చాటుతూ హక్కుల సాధన, సంక్షేమం,కోసం కలిసి కట్టుగా కృషిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు అడ్వొకేట్ వెంకటయ్య ముదిరాజ్,కావలి సాయిలు ముదిరాజ్,తోక ఆశన్న ముదిరాజ్, తిరుపతయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి: కలెక్టర్ నారాయణ రెడ్డి

నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశం.. ప్రజావాణికి మొత్తం 96 ఫిర్యాదులు

రంగారెడ్డి ప్రతినిధి,(సింగిడి): ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని, నిబంధనల ప్రకారం





త్వరితగతిన చర్యలు తీసుకుని ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 96 ఫిర్యాదులు అందగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 54, ఇతర శాఖలకు సంబంధించి 42 దరఖాస్తులు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద దేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

చెట్ పూజలో పాల్గొన్న టీపీసీసీ అధికార ప్రతినిధి సొంటిరెడ్డి పున్నారెడ్డి.



కుత్బుల్లాపూర్, (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రోడామేస్త్రి నగర్ డివిజన్ లో లెనిన్ నగర్ చట్ పూజా కార్యక్రమంలో టి పి సి సి అధికార ప్రతినిధి సొంటి రెడ్డి పున్నారెడ్డి పాల్గొని భక్తిశ్రద్ధలతో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ ఆయురారో గ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నాచారం, (సింగిడి): నాచారం సర్కిల్ హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో రూ. 57 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తో కలిసి శంకుస్థాపన చేయడం జరిగింది. రూ. 10 లక్షల వ్యయంతో సాయి నగర్ నుండి రత్నానిధి అపార్ట్‌మెంట్‌కు వెళ్లే రహదారి నిర్మాణం. రూ. 22 లక్షల వ్యయంతో రాఘవేంద్ర నగర్‌లో ఉస్మాన్ ఇంటి వైపు రహదారి నిర్మాణం. రూ. 10 లక్షల వ్యయంతో రాఘవేంద్ర నగర్ నుండి ఇందిరా నగర్‌కు వెళ్లే మార్గంలోని గ్యాస్ అంజి రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం. రూ. 15 లక్షల వ్యయంతో బుడగ జంగాల స్మశాన వాటికలో మిగిలిన అభివృద్ధి పనులు. ఈ కార్యక్రమంలో డీఈ సాయి పృథ్వి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేడల మల్లికార్జున గౌడ్, మల్లేష్ యాదవ్, విటల్ యాదవ్, ఆశు, గుండు రమేష్ గౌడ్, టేకులపల్లి రామ్ చందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్ అడ్జస్ట్మెంట్, సాకుతో ఉపాధ్యాయుల తరలింపు.

కొల్చారం (సింగిడి): ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు, ఉత్తమమైన



బోధన ఉంటుందని, బడిబాట కార్యక్రమం పేరిట ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి విద్యార్థులను ప్రభుత్వ బడులలో చేర్పించాలని అవగాహన కార్యక్రమాలు చేపట్టగా, వారిపై నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపిస్తే వర్క్ అడ్జస్ట్మెంట్, డిప్యూటేషన్ పేరుతో ఉపాధ్యా యులను ఇతర పాఠశాలలకు మండలాలకు, పంపుతూ విద్యార్థుల జీవితాలతో అధికారులు ఆడుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపించారు. మండలకేంద్రంలో కొల్చారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్మెంట్ పేరు కింద ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో వర్క్ అడ్జస్ట్మెంట్ పై మెమొరండం సమర్పించారు. వెంటనే వర్క్ అడ్జస్ట్మెంట్ ఉత్తర్వులను నిలిపివేయాలని వారు కోరారు.

హస్తకళ.. శారీరక, మేధోపరమైన అన్వేషణ

గీతం ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ ఎరిన్ ఓ'కానర్

పటాన్చెరు, (సింగిడి): చేతివృత్తిని (హస్తకళను) ఒక శారీరక, మేధోపరమైన అన్వేషణగా ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, గాజు తయారీ నిపుణురాలైన డాక్టర్ ఎరిన్ ఓ'కానర్ అభివర్ణించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో హస్తకళల్లో లీనమవ్వడం: మనస్సు, శరీరంపై ప్రభావాలు అనే అంశంపై సోమవారం ఆమె ఆన్ లైన్ ద్వారా ఆతిథ్య ఉపన్యాసం చేశారు.గాజు కళాకారిణిగా తన అనుభవం, చేతివృత్తుల అధ్యయనాలలో ఆమె చేసిన విస్తృతమైన పరిశోధన ఆధారంగా, డాక్టర్ ఓ'కానర్ గాజు తయారీ అభ్యాసం ద్వారా చేతివృత్తికి సంబంధించిన శారీరక కోణాలను, శారీరక జ్ఞానం యొక్క స్వభావాన్ని అన్వేషించారు. గణనీయమైన శారీరక ఓర్పు, మేధోపరమైన ప్రమేయం, సృజనాత్మక సున్నితత్వం అవసరమయ్యే పనిలో నిమగ్నమై ఉన్నప్పుడు, కళాకారులు తప్పులు, అనిశ్చితులు, వైఫల్యాలను ఎలా అధిగ మిస్తారో ఆమె వివరించారు. చేతివృ త్తితో నిరంతర అనుబంధం, కళాకారుడి మనస్సును, శరీరాన్ని క్రమంగా, తరచుగా సూక్ష్మమైన మార్గాలలో ఎలా తీర్చిదిద్ది, రూపాంతరం చెందిస్తుందో ఆమె మరింతగా చర్చించారు. ఈ ఉపన్యాసం శరీరం, మనస్సు, పదార్థం, సృజనాత్మక అభ్యాసం మధ్య ఉన్నక్లిష్టమైన సంబంధంపై విలువైన అంతర్దృష్టులను అందించింది. తద్వారా చేతి పనిని ఒక శారీరక, మేధోపరమైన అన్వేషణగా లోతుగా అర్థం చేసుకునేలా చేసింది.అతిథి గురించి:డాక్టర్ ఎరిన్ ఓకానర్, పీహెచ్.డి., గాజు, పదార్థ స్వభావం, దేహధారణ, కళ, పర్యావరణం వంటి అంశాలలో నైపుణ్యం కలిగిన, హస్తకళా అధ్యయనాలలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన స్కాలర్. ఆమె ప్రస్తుతం న్యూయార్క్ నగరంలోని నార్త్ ఈస్టర్న్ విశ్వవిద్యాలయంలో



సోషియాలజీ, ఆంత్రోపాలజీ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. గతంలో 17 యేళ్ల పాటు మేరీమౌంట్ మాన్ హట్టన్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసరుగా, విభాగాధిపతిగా పనిచేశారు. ఆమె గాజు తయారీ యొక్క శారీరక అనుభవంపై అధ్యయనమైన 'ఫైర్ క్రాఫ్ట్: ఆర్ట్, బాడీ అండ్ వరల్డ్ అమాంగ్ గ్లాస్ బోయర్స్' (కొలంబియా యూనివర్సిటీ ప్రెస్, 2025) అనే గ్రంథ రచయిత్రి. కార్నింగ్ మ్యూజియం ఆఫ్ గ్లాస్ నుంచి 2023 రాకోవ్ గ్లాస్ రీసెర్చ్ గ్రాంట్ గ్రహీత అయిన ఆమె ప్రస్తుతం 'ది మిడిల్ మినరల్ అండ్ ది మైన్: ఎ జియో ఆంత్రోపాలజీ ఆఫ్ స్టూడియో గ్లాస్' అనే పుస్తక రచనలో నిమగ్నమైన ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కురుమూర్తి స్వామి ఉద్దాల ఉత్సవంలో మాజీ మంత్రులు

-కురుమూర్తి స్వామి ఆశీస్సులు అందరికీ కలగాలి: -మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి ప్రతినిధి, (సింగిడి): తెలంగాణలో ప్రసిద్ధిగాంచినకురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాచిన్నచింతకుంట మండలం వడ్డేమాన్ గ్రామంలో నిర్వహించిన ఉద్దాల మహోత్సవంలోమాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి లు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉద్దాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారినిదర్శించుకున్నారు. అనంతరం నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పేదల తిరుపతిగాకోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా కురుమూర్తి స్వామి భక్తుల ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్నారని అన్నారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిభక్తుల కోరిక మేరకు కురుమూర్తి గుట్టపై వెలసి భక్తులకుదర్శనమిస్తున్నారని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కురుమూర్తి దేవాలయ అభివృద్ధికి ప్రత్యేకంగాకృషి చేశామని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటిఅసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలకు కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల శుభా కాంక్షలుతెలియజేశారు.





సగరులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలి

-జీవో 59ను సవరించి కాంట్రాక్టు పనుల్లో రిజర్వేషన్లు పెంచాలి

-జిల్లా సగర సంఘం అధ్యక్షుడు మోడల తిరుపతయ్య సాగర్

వనపర్తి ప్రతినిధి, (సింగిడి):: సగరులు అన్ని రంగాల్లో వెనుకబాటుతనానికి గురవుతున్నా రని, వారిని బీసీ-డీనుంచి బీసీ-ఏలోకి మార్చాలని జిల్లా సాగర సంఘం అధ్యక్షుడు మోడల తిరుపతయ్య సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్‌ఎదుట సాగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట డారు. జీవో59ను సవరించి ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో సగరులకు రిజర్వేషన్ల శాతం పెంచాలని, నిర్మాణ రంగ కార్మికులుగా గుర్తించి ఆరోగ్య భద్రత కార్డులతోపాటు పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు. సగర ఉప్పరులు కులవృత్తిపైఆధారపడి, నిర్మాణ పనులు ఎక్కడ ఉంటే అక్కడికి వలస వెళ్లి దినసరి కూలీలుగాజీవనం సాగిస్తున్నారని తెలి



పారు. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.బీసీ-డీకేటగిరీలో కొనసాగడం వల్ల సగరులకు తగిన న్యాయం జరగడం లేదని, వారివాస్తవ జీవన పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసి బీసీ-ఏలో చేర్చేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని బీసీ సంక్షేమ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొబ్బూరి చంద్రయ్య,జిల్లా కోశాధికారి గుంటి సత్యం సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక సత్యంసాగర్, రాష్ట్రకోశాధికారి చీర్ల విష్ణు, గోల్డెన్‌సిటీ ఆర్.కె. రవిసాగర్, మహిళా మాజీ అధ్యక్షురాలు మహేశ్వరి సాగర్, రాష్ట్ర నాయకుడుపెబ్బేరు శ్రీనివాసులు సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, ముఖ్యసలహాదారు పల్లె సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బుజ్జన్న, సంస్కృత విభాగంఅధ్యక్షుడు నాగేంద్రం, జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి, మాజీ లీగల్‌అడ్వైజర్ సుజనా సాగర్, చీర్ల శ్రీనివాసులు, పెద్ద నాగులు, మర్రికుంటఅధ్యక్షుడు నాగరాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్రీనివాసులు తదితరులుపాల్గొన్నారు

వనపర్తి నియోజకవర్గానికి నెలకు రూ.11 కోట్ల పింఛన్లు

-పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

-వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి,(సింగిడి): వనపర్తి నియోజకవర్గానికి ప్రతి నెల సుమారు రూ. 11 కోట్ల పింఛను నగదును ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. సోమవారం వనపర్తి మండల పరిషత్ కార్యాలయంలోజిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డితో కలిసి నూతన చేయూత పింఛన్లు,డిజిటల్ రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ బీమా పథకం ద్వారా ప్రతికుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం లో ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, మహిళలఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఆరుగ్యారంటీలతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలుస్తున్నామనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు,అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దావాజిపల్లిలో అభివృద్ధి పనులకు భూమిపూజ

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన -- ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

శ్రీరంగాపూర్(పానగల్) (సింగిడి):: పానగల్ మండలంలోని దావాజిపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. అలాగే నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కూడా భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, మహిళా శిశు సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుల్లారావు, భాస్కర్ యాదవ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు హేమాద్రి నాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడు



వెంకటయ్య యాదవ్, గ్రామ సర్పంచ్ తులసి సుగురమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఉప సర్పంచ్ ప్రేమ్ సాగర్, మాజీ ఉప సర్పంచ్ సురేందర్ గౌడ్, యుగంధర్ గౌడ్, వార్డు సభ్యుడు నీలం, చిన్న గట్టు యాదవ్, మహేష్ యాదవ్ తదితర కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుడ్లనర్వలో చిన్నారుల భవిష్యత్తుకు మరో ముందడుగు

రూ.8 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

బిజినపల్లి, (సింగిడి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం గుడ్లనర్వ గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 8 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ భవన నిర్మాణ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించడంతో పాటు బాల్యంలోనే విద్యపై ఆసక్తి పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించి, చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. నూతన భవనం అందుబాటులోకి వస్తే చిన్నారులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణంలో పోషకాహారం, ప్రాథమిక విద్య అందుతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మిద్దె రాములు గ్రామ సర్పంచ్ లేట్ల బాలస్వామి దేవరకొండ రామచందర్ ఉపసర్పంచ్ దాసరి శివ. సంజీవ.ఆర్ మన్యం గూడకాశన్న



లక్ష్మీకాంతరావు. గూడ లక్ష్మయ్య భీమ్లా నాయక్ స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, నాయకులు, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓజేటిని సద్వినియోగం చేసుకోవాలి.ప్రిన్సిపల్ నీరజ

నేరేడుచం(సింగిడి):: ఒకేషనల్ విద్యార్థులు ఆన్ జాబ్ ట్రైనింగ్ ను సద్వినియోగం చేసుకోవాలని నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి నీరజ అన్నారు. సోమవారం కళాశాల ఓఏ ,ఈటి ఓఏసిపి ఒకేషనల్ గ్రూపులకు సంబంధించిన మొదటి,ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఓజేటీలో భాగంగా స్థానిక తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థను సందర్శించారు.ఓజేటిని ప్రారంభించిన అనంతరం ఆమె గిడ్డంగులను విద్యార్థులతో పాటు సందర్శించి మాట్లాడారు. వృత్తి విద్య కోర్సు విద్యార్థులకు విద్యతో పాటు ఓజేటి ఎంతో ముఖ్యమని ఇంటర్ విద్య అధికారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. ఈ ఓజేటీతో విద్యార్థులకు బోధించిన పాఠ్యాంశాలకు సంబంధించి ఫీల్డ్ అవగాహన కలుగుతుందన్నారు. తరగతి గదికే పరిమితం కాకుండా ఆయా సంస్థలు కోర్సును బట్టి సందర్శించడం వల్ల ఎంతో నైపుణ్యం చేకూరుతుందన్నారు. దీంతో వృత్తి విద్యా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఏదైనా స్వయం ఉపాధి,



ఉద్యోగములో స్థిర పడాలంటే ఈ ఓజేటి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాఠ్యాంశాలు తెలుసుకోవడం ఎంత ముఖ్యమో సంబంధిత పనిపై అవగాహన పొందడం అంతే ముఖ్యమని సూచించారు. ఈ సందర్భంగా గిడ్డంగుల యొక్కప్రాముఖ్యతపై గిడ్డంగుల సంస్థ మేనేజర్ సఫియాబి,సూపర్వైజర్ రాహుల్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరెడ్డి వెంకటరమణ,ఒకేషనల్ లెక్చరర్లు వెంకన్న, కె.శ్రీనివాసులు,ప్రసాదు,వీరు, అపర్ణ, వీరేష్ ఇంగ్లీష్ లెక్చరర్ వి.శ్రీనివాసులు, ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు వైద్య పరీక్షలు

పాలకవీడు,(సింగిడి): శూన్యంపాడు గ్రామంలో అదానీ ఫౌండేషన్ సహకారంతో పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 55 పశువులకు గర్భకోశ చికిత్సలు అందించి, చిన్న దూడలకు 50 నట్టల మందులు పంపిణీ చేశారు. రైతులకు కాల్షియం, మెగ్నీషియం లవణాలు, లవణ మిశ్రమాలను సర్పంచ్ నీమా నాయక్ అందజేశారు. కార్యక్రమంలో అదానీ ఫౌండేషన్ సీఎస్ఆర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డి. రాజబాబు, పశువైద్యాధికారులు డా. శ్రీనివాస్, సందీప్ కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వీవో భవన నిర్మాణ స్థలం మార్చాలని ప్రజల వినతి



కామేపల్లి, (సింగిడి): కామేపల్లి మండలం రుక్మితండా గ్రామ పంచాయతీ పరిధిలోని మహిళా సమాఖ్య నిర్మాణ స్థలాన్ని మార్చాలని కోరుతూ బండిపాడు, రాయిగూడెం గ్రామ ప్రజలు కామేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సోమవా రం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ?మహిళా సమాఖ్య భవన నిర్మాణ నిమిత్తం గతంలో బండిపాడు హ్యాబిటేషన్‌లోని కూలిపోయే స్థితిలో ఉన్న అంగన్‌వాడీ-1 స్థలాన్ని ఎంపిక చేసి, జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపడం జరిగిందని వారు పేర్కొన్నారు. అయితే ఈప్రతి పాదనను పరిశీలించి మంజూరు చేయకపోవటం వలన రాయిగూడెం హ్యాబిటేషన్‌లో ఉన్న తిరుపతమ్మ తల్లీ గుడి పక్కన కొండాయిగూడెం చెరువు శిఖం స్థలానికి ప్రక్కనే కేటాయించాలని గ్రామస్తులు కోరారు. స్థానిక అవసరాలకు అనుగుణం గా ప్రభుత్వ భూమిని కేటాయించి భవన నిర్మాణం చేపట్టాలని వారు అధికారులను అభ్యర్థించారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం.. చిన్నారుల భద్రతకు ముప్పు! నూతన భవనం మంజూరు చేయాలని ప్రజావాణిలో వినతి

తల్లాడ, (సింగిడి): తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నారుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. కోడ్ నెం. 322 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న ఈ అంగన్‌వాడీ భవనం గోడలకు బీటలు ఏర్పడి, పైకప్పు పెచ్చులు ఊడి కింద పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనాన్ని తొలగించి, దాని స్థానంలో నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ మా రత్నమ్మ స్వచ్ఛంద సేవా సొసైటీ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ (ఎన్జీవో) ప్రజావాణిలో తల్లాడ మండల నోడల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. సంబంధిత అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో భవనాన్ని పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న భవనాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో విద్య, పౌష్టికాహారం అందేలా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ కోరారు.



ఎవరు చెప్పినా మేము మారం గాక మారం... మా స్టైల్ అంతే..

కలెక్టర్, ఎంపీడీవో ఆదేశాలు 'బేఖాతరు'.. సీఎం ప్రజావాణికి కీలక శాఖల అధికారుల డుమ్మా!

11 దాటినా ఖాళీ కుర్చీలే దర్శనం-?నిర్లక్ష్యపు నీడలో 'ప్రజావాణి'.. అర్జీదారుల ఆగ్రహం

కామేపల్లి, (సింగిడి): ఎవరు చెప్పినా మేము మారం గాక మారం... మా జిల్లాస్థాయి అధికారులు కావచ్చు... మండల స్థాయి అధికారులు కావచ్చు... మా స్టైలే అంతే... అన్న చందంగా తయారయింది మండలంలోని కీలక శాఖల అధికారుల వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'సీఎం ప్రజావాణి' కార్యక్రమాన్ని మండల స్థాయి ఃఅధికారులు అపహాస్యం చేస్తున్నారు. స్వయంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా, గైర్హాజరైతే వేటు తప్పదని ఎంపీడీవో ధరావత్ సోమ్‌లాల్ కఠిన హెచ్చరికలు జారీ చేసినా మండలంలోని వివిధ శాఖల అధికారుల తీరులో ఏమాత్రం మార్పు రావడం లేదు. ?సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణికి 11 గంటలు దాటినా పలు కీలక శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కాలేదు. జాబితాలో పేరున్న బాధ్యతాయుతమైన అధికారులు స్వయంగా హాజరై రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని తుంగలో తొక్కారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు మొత్తం 24 మంది హాజరు కావలసి ఉండగా కేవలం 8 మంది అధికారులు





మాత్రమే హాజరయ్యారు. పలు శాఖల అధికారులు గైరాజర్ అయ్యారు. వివిధ సమస్యలపై తమ గోడు వెల్లబోసుకుందామని ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని వచ్చిన అర్జీదారులు అధికారుల కోసం గంటల తరబడి వేచి చూశారు. దీంతో వారు ఖాళీ కుర్చీలను చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు గైరాజర్ కావటం తో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడుతున్నారు. ప్రధాన శాఖలైన రెవిన్యూ, అగ్రికల్చర్, విద్యాశాఖ అధికారులు ఆలస్యంగా హాజరయ్యారు.వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, ఎక్సైజ్, ఆర్ అండ్ బి, ఐ టి డి ఏ హార్టికల్చర్, మత్స్య శాఖ అధికారులు అసలు అడ్రస్ లేరు. మరికొందరు అధికారులు ఈ సమావేశానికి తీరిక చూసుకొని ఆలస్యంగా హాజరు కావటం తాము గ్రామాల్లో విజిట్ కు వెళ్ళామని అందుకే ఆలస్యం అయిందని చెప్పటం కోస మెరుపు ఇప్పుడు వరకు జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి అందరు మండల స్థాయి అధికారులు ఒక్కసారి కూడా సమావేశానికి హాజరైన దాఖలాలు లేవు. కొన్ని శాఖల అధికారులు వస్తే కొన్ని శాఖల అధికారులు అసలు అడ్రస్ ఉండటం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత లక్ష్యం నీరు గారి పోతుంది జిల్లా ఉన్నతాధికారుల హెచ్చరిక లనే లెక్కచేయని ఈ 'దుమ్మా' అధికారులపై జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

అభివృద్ధికి పనులకు అందరూ సహకరించాలి
ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు



అల్వాల్, (సింగిడి): రోడ్ల అభివృద్ధికి అందరూ సహకరించాలని ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు అన్నారు. రోడ్ల వెడల్పు లో భాగంగాఓల్డ్ అల్వాల్ ఇందిరా గాంధీ చౌరస్తాలో రోడ్డు వెడల్పు వంటి అభివృద్ధి లో భాగంగా అక్కడ ఉన్న సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని తొలగించి ప్రక్కనే ఉన్న స్థలంలోకి మార్చాలని అధికారులు అభిప్రాయపడ్డారు. రోడ్లు వెడల్పు అభివృద్ధి పనులు శరవేగంతో కొనసాగించాలని ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో
ఎం ఎం సి డిప్యూటీ ఇంజనీర్ అధికారి మహేష్ ల తో కలిసి సందర్శించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కిషోర్ , ఎం ఎం సి ఏఈ రవళి, స్థానికులు వేణు, శరత్, ఆంజనేయులు, బాబు, నాయకులు పాల్గొన్నారు .

జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌లో
'కింగ్ షోటోకాన్' విద్యార్థుల సత్తా..
నాలుగు గ్రాండ్ ఛాంపియన్‌షిప్ టైటిళ్లు కైవసం



జడ్చర్ల, (సింగిడి): జడ్చర్ల పట్టణంలో నిర్వహిం చిన జాతీయ స్థాయి ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో మహబూబ్‌నగర్‌కు చెందిన 'కింగ్ షోటోకాన్ కరాటే డో ఇండియా' విద్యార్థులు అద్భుత ప్రతిభకనబరిచి నాలుగు గ్రాండ్ ఛాంపియన్‌షిప్ అవార్డులను సాధించారు. ఈ విషయాన్ని కరాటే క్లబ్ వ్యవస్థాపకుడు, సీనియర్ మాస్టర్ జహంగీర్ పాషా ఖాద్రీ అల్ కాజ్మీ వెల్లడించారు. సోమవారం జిల్లా కేంద్రంలో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందించారు.జహంగీర్ పాషా ఖాద్రీ అల్ కాజ్మీ మాట్లా డుతూ.. తమ కింగ్ షోటోకాన్‌కు చెందిన నలుగురు విద్యార్థులు పోటీల్లో విశేష ప్రతిభతో బహుమతులు సాధించడం ఆనం దంగా ఉందన్నారు. పోటీల వివరాల ప్రకారం.. సీనియర్ కటా విభాగంలో మహమ్మద్ హుజైఫా షరీఫ్ బంగారు పతకంతో పాటు ఓపెన్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకు న్నారు. ఆయిషా కటా కలర్ బెల్ట్ విభాగంలో గ్రాండ్ ఛాంపియ న్‌షిప్ సాధించగా, నిఖిల్ కూడా అదే విభాగంలో గ్రాండ్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. గుల్‌ఫిషా కటా కలర్ బెల్ట్ విభాగంలో రన్నరప్ ట్రోఫీని దక్కించుకున్నారు. ఈ విద్యార్థులం దరూ మహబూబ్‌నగర్‌లోని మహాత్మా గాంధీ రోడ్ పాఠశాలలో శిక్షణ పొందుతున్నారని ఆయన తెలిపారు. షోటోకాన్ విద్యార్థు లు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిం చడం సంతోషకరమని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురా వాలని ఆకాంక్షించారు. విజేతలందరికీ ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

యాచకులకు చేయూత..
సత్యమేవ జయతే దాతృత్వం



కోదాడ, (సింగిడి): : చలితో ఇబ్బందులు పడు తున్న యాచకులకు సత్యమేవ జయతే సేవాసమితి అండగా నిలిచింది. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నాదెళ్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో దేవాలయాలు, కూడళ్లు, బస్టాండ్ వద్ద ఉన్న యాచకులకు దుప్పట్లు, మంకీ క్యాప్‌లు, బుట్టలు, భోజనం పంపిణీ చేశారు. సీనియర్ వైద్యులు డాక్టర్ సుబ్బారావు, సత్యా న్వేషణ మండలి అధ్యక్షుడు సురేంద్రబాబు ఈ కార్యక్రమాన్ని అభినందించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి.. కేసు నమోదు



కోదాడ, (సింగిడి):అనంతగిరి మండల కేంద్రానికి చెందిన చెవుల హనుమంతరావు (50) బైక్ అదుపుతప్పి ఖానాపురం శివారులోని పంట కాలువలో పడి మృతిచెందారు. ఆదివారం రాత్రి కోదాడకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. సోమవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఏడుకొండలు తెలిపారు.

ఆరుతడి పంటలే సాగు చేయాలి

కోదాడ, (సింగిడి): ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనుకూ లంగా లేనందున మండల వ్యా ప్తంగా రైతులు యాసంగిలో వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు భూక్య నారాయణ సూచించారు. సమావేశంలో మాట్లాడుతూ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కోరారు.

49 మందికి చేయూత పింఛన్లు



మునగాల,(సింగిడి)::మునగాల మండలం నారాయణగూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కాంపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన 49 మంది పింఛన్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. వీరిలో వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు అర్హులైన పేదలకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు
ఎంపికైన విద్యార్థినికి సన్మానం



వనపర్తి ప్రతినిధి, (సింగిడి):అండర్-14 బాలికల వాలీబాల్‌విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పెద్దగూడెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థిని జి. మేఘనను డీసీసీ అధ్యక్షుడు, శాట్స్ చైర్మన్‌శివసేనా రెడ్డి సోమవారం తన నివాసంలో శాలువాతో సత్కరించి అభినందిం చారు. ఈనెల 13 నుంచి 15 వరకు సంగారెడ్డిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలకుఎంపిక కావడం గ్రామానికి, పాఠశాలకు గర్వకారణమన్నారు. గ్రామీణవిద్యార్థుల్లోనూ అపారమైన క్రీడా ప్రతిభ ఉందని, సరైన ప్రోత్సాహంకల్పిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలోపాఠశాల ప్రధా నో పాధ్యాయురాలు వరలక్ష్మి, పీడీ శేఖర్, బ్రహ్మచారి, శివకుమార్, బుచ్చిబాబు, రాములు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు .

ఎస్సీ వర్గీకరణ ఫలాలను విద్యార్థులు
సద్వినియోగం చేసుకోవాలి
-బుక్కపురం మహేష్ మాదిగ



వనపర్తి ప్రతినిధి, (సింగిడి):ఎస్సీ వర్గీకరణ చట్టం మందకృష్ణమాదిగ మూడు దశాబ్దాల పోరాట ఫలితమని ఎంఎస్ఎఫ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాఇన్‌చార్జి బుక్కపురం మహేష్ మాదిగ అన్నారు. వనపర్తి పట్టణంలోని అభయాస్ జూనియర్ కళాశాలలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల సదస్సుకు ఆయనముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ ద్వారా లభిస్తున్న 9 శాతం రిజర్వేషన్ ఫలాలను వినియోగించుకొని మాదిగ విద్యార్థులువిద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. మహనీయులఆశయాల సాధన కోసం ప్రతి విద్యార్థి ఎంఎస్ఎఫ్‌లో భాగస్వామి కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి మొలకలపల్లి పరుశరాముడు అధ్యక్షత వహించగా మీసాలగణేష్ మాదిగ, కొమ్ము చెన్నకేశ వులు మాదిగ, గంధం గట్టయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభయాస్ కళాశాల ఎంఎస్ఎఫ్ నూతన అధ్యక్షుడిగారేపల్లి ధనుష్ మాదిగను ఎన్నుకున్నారు.

తహసీల్దార్ కార్యాలయ
ఉద్యోగుల సామూహిక సెలవు వినతి



కోదేరు (సింగిడి): కోదేరుతహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జి.పి.ఓలు, గిర్దావర్లు మరియు కార్యాలయ సిబ్బంది కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్) విధానాన్నిరద్దు చేసి, పాత పెన్షన్ పథకం (ఓ పి ఎస్) విధానాన్ని పునరుద్ధరించాలనే ప్రధాన మైన డిమాండ్‌తో రాష్ట్ర ఉద్యోగ సంఘాల నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు, మంగళవారం 17నాడు సామూహిక సెలవులో పాల్గొనాలని నిర్ణయించారు. రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు కోదేరు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు తమ సామూహిక సెలవు దరఖాస్తును కోదేరు తహసీల్దార్ ఎండి జమీల్ కుసమర్పిం చారు ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగులు కోరారు

నేరాలకు పాల్పడితే
కఠిన చర్యలు తప్పవు..
ఎస్ఐ రువ్వ కోటేశ్...



కోదాడ,(సింగిడి):ప్రభుత్వ నిషేధిత నాటు సారాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటా మని ఎస్ఐ రువ్వ కోటేశ్ హెచ్చరించారు. మండలంలోని శూన్యంపాడు తండాకు చెందిన రమావత్ గోప నాటు సారాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అతని ఇంటిపై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ తనిఖీల్లో లీటరు నాటు సారాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశారు. అనంతరం తిరిగి నాటు సారాయి విక్రయాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా మండల తహసీల్దార్ ఎదుట రూ. 5 లక్షల పూచీకత్తుతో బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను
విజయవంతం చేయాలి



కోదాడ,(సింగిడి):: డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని, కలెక్టరేట్లలో కౌంట్‌డౌన్ బోర్డులు, ప్రధాన కూడళ్లలో మస్కట్ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు.



ఐపీఎల్‌కు ధోనీ వీడ్కోలు..

సీఎస్కేకు ఇక మెంటార్!

చెన్నై: టీమిండియా మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజ ఆటగాడు మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్ ఆటగాడిగా తన ప్రస్థానానికి ముగింపు పలికాడు. ఇకపై మైదానంలో ఆటగాడిగా కాకుండా సీఎస్కే మెంటార్‌గా జట్టుకు సేవలందించనున్నాడు. 2027 సీజన్ నుంచి ఈ కొత్త బాధ్యతలు చేపట్టనున్నట్లు చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది.

రెండు దశాబ్దాల అనుబంధం

ధోనీ లేకుండా సీఎస్కేను ఊహించలేమని జట్టు యజమాని ఎన్. శ్రీనివాసన్ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. 2008 నుంచి దాదాపు రెండు దశాబ్దాలుగా ధోనీతో తమ ప్రయాణం కొనసాగుతోందని గుర్తుచేశారు. సీఎస్కే గుర్తింపులో ధోనీ ఎప్పటికీ భాగమని, చెన్నై ఆయన సొంత ఇల్లేనని పేర్కొన్నారు. మరోవైపు మైదానంలో పసుపు జెర్సీలో ధోనీని చూడలేమన్న వార్త అభిమానులను కలచివేస్తోంది. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పుడు వీడ్కోలు మ్యాచ్ నిర్వహించనట్లే, ఇప్పుడు కూడా ప్రత్యేక ఫేర్‌వెల్ మ్యాచ్ లేకపోవడంపై కొందరు అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ధోనీ ఖాతాలో ఎన్నో ఘనతలు

ధోనీ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదు ఐపీఎల్ టైటిళ్లు, రెండు ఛాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలు గెలుచుకుంది. జట్టును పదిసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేర్చిన ఘనత ఆయన సొంతం. కెప్టెన్‌గా జట్టుకు విజయాలు అందించడమే కాకుండా, కీలక సమయాల్లో ఫినిషర్‌గా రాణించి ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఆటగాడిగా ధోనీ నిష్క్రమణ ఐపీఎల్ అభిమానులకు ఒక శకం ముగిసినట్టే. అయితే మెంటార్‌గా ఆయన అనుభవం సీఎస్కే యువ ఆటగాళ్లకు ఉపయోగపడనుంది.



శాఫ్ ఫైనల్లో భారత్-పాక్ ఢీ



ఢాకా: దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ (శాఫ్) టైటిల్ కోసం భారత్, పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. ఢాకా వేదికగా నేడు జరిగే ఫైనల్లో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ద్వితీయ శ్రేణి ఆటగాళ్లతో బరిలోకి దిగినప్పటికీ భారత జట్టు మరోసారి చాంపియన్‌గా నిలవాలని పట్టుదలతో ఉంది. ఈ టోర్నీ చరిత్రలో భారత్ 14వసారి ఫైనల్ ఆడుతుండగా.. పాకిస్తాన్ తొలిసారి తుదిపోరుకు చేరుకుంది.

ఇప్పటివరకు తొమ్మిదిసార్లు విజేతగా నిలిచిన భారత్.. నాలుగుసార్లు రన్నరప్‌గా సరిపెట్టుకుంది. 2003లో మాత్రమే ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. గ్రూప్ దశలో భారత్ 3-2తో పాకిస్తాన్‌ను, 1-0తో మాల్దీవులను ఓడించింది. సెమీఫైనల్లో 2-1తో భూటాన్‌పై విజయం సాధించి ఫైనల్ బెర్తు ఖరారు చేసుకుంది. మరోవైపు పాకిస్తాన్ సెమీఫైనల్లో 1--0తో బంగ్లాదేశ్‌ను ఓడించి తుదిపోరుకు సిద్ధమైంది.

గత రికార్డుల్లో భారత్‌దే పైచేయి

భారత్, పాకిస్తాన్ జట్లు ఇప్పటివరకు 30 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. ఇందులో భారత్ 17 విజయాలు సాధించగా.. పాకిస్తాన్ నాలుగు మ్యాచ్‌ల్లో మాత్రమే గెలిచింది. మరో తొమ్మిది మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఈ గణాంకాలు భారత జట్టుకు అనుకూలంగా ఉన్నప్పటికీ.. ఫైనల్లో పాక్‌ను తక్కువ అంచనా వేయకుండా ఆడి పదోసారి టైటిల్ అందుకోవాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది.

కోహ్లీది కెరీర్‌లోనే అతి పెద్ద తప్పు: కపిల్ దేవ్



భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంపై మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించాడు. టెస్టుల నుంచి తప్పుకోవడం కోహ్లీ కెరీర్‌లో చేసిన అతిపెద్ద తప్పిదమని అభిప్రాయపడ్డాడు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు పదేళ్ల తర్వాత కోహ్లీ పశ్చాత్తాపపడతాడని వ్యాఖ్యానించాడు. అద్భుతమైన ఫిట్‌నెస్ కలిగిన కోహ్లీకి టెస్టుల్లో ఇంకా రాణించే సామర్థ్యం ఉందని పేర్కొన్నాడు. కోపంతో రిటైర్మెంట్ నిర్ణయం తీసుకోవడం సరికాదని కపిల్ సూచించాడు. గతంలో ఎన్నోసార్లు జట్టు నుంచి తొలగించినా, తిరిగి చోటు సంపాదించి తన సత్తా నిరూపించుకున్న మొహిందర్ అమర్‌నాథ్‌ను ఈ సందర్భంగా ఉదాహరణగా ప్రస్తావించాడు. కోహ్లీ కూడా మరికొంత కాలం టెస్టుల్లో కొనసాగాల్సిందని అభిప్రాయపడ్డాడు. 2025 మేలో టెస్టులకు వీడ్కోలు పలికిన కోహ్లీ.. ఆ తర్వాత టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు.

ప్రభుదేవా, ఏఆర్ రెహమాన్ 'మూన్‌వాక్' రిలీజ్ డేట్ ఫిక్స్

వర్సటైల్ యాక్టర్ ప్రభుదేవా, మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ మూవీ 'మూన్‌వాక్'. మనోజ్ నిర్మల శ్రీధరన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫ్యామిలీ కామెడీ



ఎంటర్‌టైనర్ నుంచి ఇప్పటికే వచ్చిన పలు అప్డేట్స్ ఆకట్టుకోగా.. తాజాగా రిలీజ్ డేట్ ప్రకటించారు మేకర్స్. ఈ మూవీ డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటిస్తూ ఓ క్యూట్ ఫ్యామిలీ పిక్‌ను షేర్ చేశారు. కామెడీ, డ్యాన్స్, మ్యూజిక్, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు విడుదల చేసిన పోస్టర్ చూస్తే అర్థం అవుతున్నది. ఇక ఈ చిత్రంలో యోగిబాబు ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ముఖ్యంగా యోగిబాబు ఏకంగా 16 విభిన్న పాత్రల్లో కనిపించనుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అంతే కాకుండా.. ఈ సినిమాకు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించడంతో పాటు ఐదు పాటలూ స్వయంగా ఆయనే ఆలపించడం విశేషం. అలాగే ఆయన ఈ చిత్రంలో అతిథి పాత్రలోనూ కనిపించనున్నారు. మనోజ్ నిర్మల శ్రీధరన్, దివ్య మనోజ్, ప్రవీణ్ ఎలక్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని దీవష్టఅఅఎఇశీశీఎం ్రాతీశీఎబష్అశీఅం తెరకెక్కిస్తోంది.

ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం

బుధవారం
18-11-2026

బంపర్ ఆఫర్..

కథను మలుపు తిప్పే పాత్రలో ఐశ్వర్య

తనదైన నటన, అందంతో దక్షిణాది ప్రేక్షకుల మనసు గెలుచుకున్న మలయాళ బ్యూటీ ఐశ్వర్య లక్ష్మి.. తెలుగు, తమిళంలో వరుస చిత్రాల్లో చాన్స్ దక్కించుకుంటున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న విభిన్న కథలను ఎంచుకుంటూ దూసుకుపోతున్నారు. ప్రస్తుతం మెగా హీరో సాయి దుర్గా తేజ్ సరసన 'సంబరాల ఏటిగట్టు'లో నటిస్తున్న ఈ భామ.. ఇప్పుడు మరో క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో భాగమవ్వబోతున్నట్లు సమాచారం. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య సినిమాలో నటించే బంపర్ ఆఫర్ దక్కినట్లు తెలుస్తోంది. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'సూర్య 48' చిత్రంలో కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఐశ్వర్య లక్ష్మి కూడా కనిపించబోతున్నారనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాలో అతిథి పాత్ర కోసం దర్శకుడు టీజే జ్ఞానవేల్ స్వయంగా ఐశ్వర్య లక్ష్మిని సంప్రదించినట్లు సమాచారం. సూర్య వంటి స్టార్ హీరో సినిమా, పైగా జ్ఞానవేల్ వంటి డైరెక్టర్ కావడంతో ఐశ్వర్య కూడా ఈ స్పెషల్ రోల్ చేయడానికి ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై మూవీ మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



దాన్ని ఎవరూ కాదనలేరు..

- రమ్యకృష్ణ

సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉందనే చర్చ ఎన్నో ఏళ్లుగా నడుస్తూనే ఉంది. కొందరు నటీనటులు అసలు అలాంటిదే లేదని కొట్టిపారేస్తే, మరికొందరు మాత్రం తమకు ఎదురైన చేదు అనుభవాలను బయట పెడుతూ సంచన నిజాలు చెబుతుంటారు. ఇప్పటికే ఎంతోమంది నటీమణులు తమ ఆవేదనను వ్యక్తం చేయగా.. తాజాగా సీనియర్ నటి రమ్యకృష్ణ ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొని క్యాస్టింగ్ కౌచ్‌తో పాటు, ఒకప్పుడు సెట్స్‌లో హీరోయిన్లు ఎదుర్కొన్న దారుణమైన పరిస్థితుల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంతో అభివృద్ధి చెందిన అమెరికా లాంటి దేశాల్లోనే ఎప్‌స్టీన్ ఫైల్స్ వంటి ఘటనలు జరిగాయని, అలాంటప్పుడు మన దగ్గర జరగదని ఎలా చెప్పగలమని ఆమె ప్రశ్నించారు. ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ఒకప్పుడు జరిగింది, ఇప్పుడు జరుగుతోంది, భవిష్యత్తులోనూ జరుగుతుందని, దాన్ని ఎవరూ కాదనలేరని ఆమె స్పష్టం చేశారు. అయితే, బలవంతంగానా లేక మన ఇష్టంతోనా అనేది కాలానుగుణంగా మారుతూ వస్తోందని, గ్లామర్ ఫీల్డ్ కావడం వల్లే దీని గురించి ఎక్కువగా మాట్లాడుకుంటారని, నిజానికి బయటి ప్రపంచంలోనూ లింగభేదం లేకుండా అన్ని చోట్లా ఇలాంటి వేధింపులు ఉన్నాయని రమ్యకృష్ణ అభిప్రాయపడ్డారు. అలాగే ఒకప్పుడు షూటింగ్ సెట్స్‌లో హీరోయిన్లకు కనీస సౌకర్యాలు, ప్రైవసీ ఉండేవి కావని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో కారవాన్‌లు, వాష్‌రూమ్‌లు లేకపోవడంతో అంబాసిడర్ కారులోనే బాటిల్స్‌లో యూరిన్ పోయాల్సిన పరిస్థితులు ఉండేవని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సమయం వృథా కాకూడదని, ఒక షూట్ నుంచి మరో షూట్‌కు వెళ్లేటప్పుడు కారులోనే సొంతంగా మేకప్ వేసుకునేవాళ్లమని తెలిపారు. ఇప్పటి తరం నటీనటులు చాలా అదృష్టవంతులని, తాము పడిన కష్టాల్లో కనీసం పావు వంతు కూడా వారు పడటం లేదని రమ్యకృష్ణ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి.

సిన్మా
Cinma Singidi

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737